# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల మాస పత్రిక

సంపుటి : 56 సంచిక : 1 జనవరి, 2023 పేజీలు : 24 వెల : రు. 10/-


# ఎన్నికల వ్యవస్థ - ఎన్నికల కమిషన్ స్వతంత్రత

**ఎన్నికల** కమిషన్ రాజ్యాంగ చట్ర పరిధిలో పనిచేసే వ్యవస్థ. ఎన్నికల కమిషన్. ఇది ఏ రాజకీయపార్టీ ప్రయోజనాలను, అవసరాలను పరిపూర్తిచేసే వ్యవస్థ కాదు. నిష్పక్షపాతంగా, ప్రజాస్వామ్య యుతంగా పనిచేసితీరాల్సిన వ్యవస్థ ఇది. ఈ మధ్య కాలంలో ఛీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సిఇసి), ఎలక్షన్ కమీషనర్ (ఇసి)ల నియామకాలు పారదర్శకంగా జరుగుతున్నాయా లేదా అనే చర్చలు జరుగుతున్నాయి.

ఒకవైపున, సిఇసి, ఇసిల నియామక క్రమాల గురించిన ఫిర్యాదులపై న్యాయస్థానంలో వారంరోజులుగా వాదోపవాదాలు జరుగుతూండగానే, డిసెంబర్ 31వ తేదీన పదవీవిరమణ చేస్తోన్న పంజాబ్ క్యాడర్‌కు చెందిన ఐఎఎస్ అధికారి, భారీ పరిశ్రమల మంత్రిత్వశాఖలో కార్యదర్శిగా పనిచేస్తున్న అరుణ్ గోయెల్‌ను స్వచ్ఛంద పదవీ విరమణ చేయించి, ఆయనను అదేరోజు సిఇసిగా నియమించారు. అరుణ్ గోయల్ కేంద్ర ప్రభుత్వంలోని పలు శాఖలలో దశాబ్దాల కాలంపైగా పనిచేస్తూ, 2014లో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత నమ్మకంగా 'తలాడించే మనిషి'గా అనేక పదవీ బాధ్యతలు చేపట్టారు. ప్రత్యేకించి మనదేశానికి స్వాతంత్ర్యం సంప్రాప్తించి 75 సం॥లు పూర్తయిన సందర్భంగా 'ఆజాదీకా అమృత్ మహోత్సవ్' కార్యక్రమ రూపకల్పనలోనూ, దానికి విస్తృత ప్రచారం కల్పించటంలోనూ ఆయన ఒక కీలక పాత్ర నిర్వహించారు.

ఈ సందర్భంలో "ఎలక్షన్ కమిషన్‌లో సంస్కరణలు చేపట్టాల్సిన సమయం ఆసన్నమైంది. మొదటగా ప్రధాని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రతిపక్ష నేతలతోకూడిన 'కొలీజియమ్', ఎన్నికల కమీషన్‌ను ఎంపిక చేయాలి; ఎన్నికల కమీషనర్లు ప్రభుత్వానికి 'తలాడించేవారు'గా వుంటే, ఎన్నికల కమీషన్ స్వతంత్రంగా వుండలేదు; ప్రధాని హోదాలోనున్న వ్యక్తిపై ఎన్నికల సందర్భంగా ఏవైనా ఆరోపణలు ముందుకువస్తే, ఎన్నికల కమీషన్ ప్రధానిపై చర్య తీసుకోకుండా తప్పించుకోరాదు" అనే సుప్రీంకోర్టు వ్యాఖ్యానం, తీవ్రమైన చర్చలకు దారితీసింది.

1947 తదనంతర కాలంలో, మనదేశ ఎన్నికల కమీషన్ పనితీరును గమనిస్తే, 1952లో సాధారణ ఎన్నికలు నిర్వహించిన నాటినుండి, అది ఏనాడూ స్వతంత్రంగా వ్యవహరించకపోగా, పాలక కూటమికి అనుగుణంగా 'తలాడిస్తూ' సేవ చేస్తోంది.

ఓటర్లయిన పేద, దళితులను, పీడిత ప్రజానీకాన్ని వారి వారి ఇళ్ళలోనే నిర్బంధించి, వారిని దుర్మార్గంగా పశువుల కొట్టాల్లో కట్టిపడేసి, వారిని పోలింగ్ బూత్‌లకే వెళ్ళనీయకుండా నిరోధించారు. వారిని ఓటువేయనిస్తే, వారంతా కమ్యూనిస్టులకే ఓటు వేస్తారని భావించి ఈ దౌర్జన్యానికి ఒడిగట్టారు; కమ్యూనిస్టులు ఎన్నికలలో విజయం సాధించినచోట మోసకారీతనంగా ఫలితాలను తారుమారు చేశారు; కమ్యూనిస్టు అగ్రనాయకులు అభ్యర్థులుగా పోటీచేసినచోట రిగ్గింగ్, మద్యం పంపిణీ, డబ్బు పంపిణీ మొదలైన వానితోపాటు ప్రభుత్వాధికారాన్ని వినియోగించి భయోత్పాతాన్ని సృష్టించటం వంటివి పాలకపార్టీలు అనుసరించిన పద్ధతుల్లో కొన్ని మాత్రమే. ఈ సందర్భాలన్నింటిలోనూ ఎన్నికల కమిషన్, పాలకపార్టీల ప్రయోజనాల పక్షానే నిలిచింది. మొట్టమొదటి ప్రధాని జవహర్‌లాల్ మొదలుకొని నేటి ప్రధాని మోడీ వరకూ ఈ ప్రహసనం కొనసాగుతూనే వుంది. అయితే, 1990–96 సం॥ల నడుమ ప్రధాన ఎన్నికల కమీషనర్‌గా పనిచేసిన టి.ఎన్.శేషన్ దీనికి ఒక మినహాయింపు. ఎన్నికల వ్యవస్థపై ప్రజాస్వామికవాదులకు సైతం భ్రమలు తొలగుతున్న నేపథ్యంలో ఎన్నికలను నిష్పక్షపాతంగా జరిపేందుకు, ప్రజాస్వామ్య చట్రంలో ఎన్నికలలో ప్రజలంతా ఓటు హక్కును వినియోగించుకునేలా చేసేందుకు ఆయన ప్రయత్నించాడు. అయితే, అది కొనసాగలేదు.

ఇప్పుడు, సుప్రీంకోర్టు చేసిన 'ప్రజానుకూల' అనే వ్యాఖ్యలను పరిశీలిద్దాం. ఇటీవల తెలంగాణా రాష్ట్రం – మునుగోడులో జరిగిన ఉప ఎన్నిక సందర్భంగా డబ్బు ఖర్చు చేసిన పద్ధతిలోనే గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్ ఎన్నికలలోనూ అదే విధానం కొనసాగుతోంది. 2024 సం॥లో జరగనున్న దేశవ్యాప్త సాధారణ ఎన్నికలు – కులం, మతం కేంద్రాలుగా సమీకరణలు జరగని విధంగా, డబ్బు, మద్యం పంపిణీ వుండని భిన్నమైన విధానంలో నిష్పక్షపాతంగా, నిజాయితీగా జరగబోతున్నాయా? సుప్రీంకోర్టు ఎత్తిచూపిన అంశాలు ఆచరణలోకి రానున్నాయా? ఆవిధంగా జరిగితే ఏ ప్రజాస్వామికవాది అయినా సంతోషిస్తాడు.

ఆధిపత్య పాలన దోపిడీవర్గాలను పరిరక్షిస్తుంది; అది నిరంతరాయంగా శ్రామికవర్గాన్ని, పేదలను, మధ్యతరగతి రైతాంగాన్ని దోపిడీ చేస్తుంది. కులంపై ఆధారపడిన వివక్షను, మతతత్వాలను పెంచి పోషిస్తుంది. న్యాయమైన హక్కుల కోసం జరిగే పోరాటాలను, ఆందోళనలను అది అణచివేస్తుంది. సామ్రాజ్యవాదుల

(తరువాయి 2వ పేజీలో)

జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల మాస పత్రిక

వెబ్‌సైట్ :
www.janasakthionline.com
ఈ-మెయిల్ :
janasakthi1963@gmail.com

సంపుటి : 55
సంచిక : 12


లోపలిపేజీల్లో....


సిద్ధాంతవ్యాసం

చరిత్ర గురించి భావవాద ఆలోచన దివాళాకోరుతనం - మావో 12

జోహార్లు

కా॥ జగ్గారపు సుబ్బారావు 2

రాజకీయార్థికం :

ఎన్నికల వ్యవస్థ - ఎన్నికల కమిషన్ స్వతంత్ర నూతన సాంకేతికతలు - ప్రొ॥ తోట జ్యోతిరాణి 3

గుజరాత్ : మరో నిర్బంధ చట్టం 7

దేశంలో సామాజిక శతృత్వభావం 18

ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల 19

సూరత్ : వలస కార్మికుల శ్రమదోపిడీ 20

ప్రజలపై పెరుగుతున్న నిర్బంధం 24

సంస్మరించుకుందాం :

కా॥ పరమేశ్వరరావు 17

అంతర్జాతీయం :

కాప్-27 సమావేశాలు 8

ప్రపంచ జీవవైవిధ్య సదస్సు 11

జి-20 సమావేశం 16

జర్మనీ 17

రిపోర్టు :

కా॥ జగ్గారపు సుబ్బారావు సంతాపసభ 11

కేరళ : మత్స్యకారుల ఆందోళన 21

బీహార్ : ఏఐకెఎంకెఎస్ ఆందోళన 22

కా॥ అంగడి చెన్నయ్య, కోటయ్యల వర్ధంతి సభలు 23



**వెల :** విడిప్రతి..................రూ.10/-
సంవత్సర చందా....రూ. 100/-

చిరునామా :

**ఎస్.శేషమ్మ, ఎడిటర్**
**32-13-26/1, బి.ఎం.ఆర్. రోడ్,**
**ఎం.ఆర్.పురం, విజయవాడ-10.**


## నిబద్ధ కమ్యూనిస్టు, సిపిఐ(ఎం-ఎల్) గుంటూరుజిల్లా నాయకులు

# కా॥ జగ్గారపు సుబ్బారావుకు జోహార్లు



**గుంటూరుజిల్లా** సిపిఐ(ఎం-ఎల్) సీనియర్ నాయకులు కామ్రేడ్ జగ్గారపు సుబ్బారావు (84 సం॥లు) అనారోగ్యంతో చికిత్స పొందుతూ 17-12-2022న మంగళగిరిలో మరణించారు.

ఆయన 1962వ సం॥లో భట్టిప్రోలు ప్రాంతం నుండి మంగళగిరికి చేనేత కార్మికునిగా వలస వచ్చారు. కా॥ సుబ్బారావు - కా॥ విశ్వం, పాతర్ల నాగయ్యల సాహచర్యంలో తొలుత సిపిఎం రాజకీయాలను, తర్వాత కా॥ తరిమెల నాగిరెడ్డి నాయకత్వంలోని విప్లవ రాజకీయాలను స్వీకరించారు. ఆనాటినుండి కడదాకా, ఐదున్నర దశాబ్దాల కాలం అదే నిబద్ధతతో కొనసాగారు. నిర్మాణంలో పెడధోరణులకు వ్యతిరేకంగా వివిధ మలుపులలో పార్టీ నాయకత్వాన దృఢంగా నిలబడ్డారు.

చేనేత కార్మికునిగా వృత్తి చేసుకుంటూనే, చేనేత కార్మికులను సంఘటితపరచి, వారికి వర్గ రాజకీయాలను బోధించేవారు. మజూరి తదితర వృత్తి కార్మికుల సమస్యలపై మిలిటెంట్ ఉద్యమాలకు నాయకత్వం వహించి, చేనేత కార్మికుల పలు సమస్యలను పరిష్కరించుకున్నారు. ప్రజాతంత్ర చేనేత కార్మికసంఘం రాష్ట్ర కన్వీనర్‌గా, ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్రకమిటీ సభ్యునిగా పలు ప్రాంతాల్లో చేనేత కార్మికులను సంఘటితం చేసేందుకు కృషిచేశారు.

1982వ సం॥లో రతనాల చెరువులో బంజరు భూమిని నివాస స్థలాలుగా పేదలు స్వాధీనం చేసుకునేందుకు పార్టీ నిర్ణయానుసారం ఇతర కామ్రేడ్స్‌తో కలసి కా॥ సుబ్బారావు దానికి నాయకత్వం వహించారు. ఆ సందర్భంలో రౌడీగూండాల, భూ ఆక్రమణదారుల భౌతికదాడులతోపాటు, పోలీసు నిర్బంధం, కేసులను ఎదుర్కొన్నారు. శ్రామికనగర్‌ను ఫలప్రదంగా నిర్మాణం చేసుకున్నారు. ఈ క్రమంలోనే శ్రామికనగర్ నుండి మంగళగిరి మున్సిపల్ కౌన్సిలర్‌గా నిజమైన అర్ధంలో ఆయనను ప్రజలే గెలిపించుకున్నారు. కౌన్సిలర్‌గా ప్రజాసమస్యల పరిష్కారానికి కృషిచేయటంతోపాటు పాలక పార్టీల ప్రలోభాలకు లోనుగాకుండా నిజాయితీగా నిలిచారు.

1990 తుఫాన్ సమయంలో తీవ్రంగా నష్టపోయిన చేనేత కార్మికులను కదిలించి మిలిటెంట్‌గా కార్యక్రమాలు నిర్వహించారు. టి.బి. వ్యాధికి గురై, కోలుకుని దీర్ఘకాలంగా శ్వాసకోశ సంబంధ వ్యాధితో ఇబ్బంది నెదుర్కొంటూవున్నప్పటికీ, పార్టీ కార్యక్రమాలలో చివరిదాకా పాల్గొన్నారు. కొండమోడు టి.ఎన్.నగర్ ఇళ్ళ కూల్చివేత సందర్భంలో 1997 ఫిబ్రవరి చలికాలమైనప్పటికీ పార్టీ ఆదేశానుసారం దాదాపు నెలరోజులు అక్కడే వుండి దెబ్బతిన్న ప్రజలకు అండగా నిలిచారు.

కా॥ సుబ్బారావు కడదాకా సామాన్య జీవితం గడిపారు. కుటుంబాన్ని కూడా పార్టీ తోడ్పాటుతో తన రాజకీయాలకు అనుగుణంగా మలుచుకున్నారు. వ్యాధులబారిన పడి వచ్చిన అనేకమంది కామ్రేడ్స్‌కు ఆశ్రయమిచ్చి, వారి వ్యాధి నయం అయ్యేవరకు శ్రద్ధగా బాగోగులు చూడగలగటం, కుటుంబ సహకారమున్నందువలననే ఆయనకు సాధ్యమైంది.

పెద్దగా చదువుకోకపోయినప్పటికీ పార్టీ, సాహిత్య పత్రికలను ఆమూలాగ్రం చదివి, అర్ధంకాని విషయాలను అడిగి తెలుసుకునేవారు; చర్చించేవారు. పత్రికలను, కరపత్రాలను ఎప్పుడూ దగ్గరే వుంచుకొని నిరంతర రాజకీయ ప్రచార కృషి చేసేవారు.

కామ్రేడ్ సుబ్బారావు మరణంపట్ల సిపిఐ(ఎం-ఎల్) విచారం వ్యక్తం చేస్తూ, ఆయనకు విప్లవ జోహార్లర్పిస్తోంది; వారి కుటుంబసభ్యులకు సంతాపం తెలియజేస్తోంది. ✡

**(మొదటిపేజీ తరువాయి)** ప్రయోజనాలకనుగుణంగా అది వ్యవహరిస్తుంది. ప్రజలలో కులం, మతం, భాషా విషయాలపై ఆధారపడి విభజనలను అది సృష్టిస్తుంది. కిరాయి మూకలనుపయోగించి ప్రగతిశీల శక్తులపై అది దాడులు చేయిస్తుంది. అణచివేత అధికార యంత్రాంగాన్ని వినియోగించి విప్లవశక్తులను నిర్బంధిస్తుంది. దోపిడీవర్గాల పాలనను మరింతకాలం కొనసాగించేందుకు ప్రభుత్వం ఫాసిజాన్ని ఒక సాధనంగా వినియోగించుకుంటుందని ఇదంతా మనకు తెలుపుతోంది. అనేక సందర్భాలలో ఎన్నికలవ్యవస్థ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని రుజువైంది. నిజమైన ప్రజాస్వామ్య సాధనకోసం ప్రజలను చైతన్యయుతులను చేసే కర్తవ్యం వామపక్ష, విప్లవ శక్తులపై వుంది. ✡

# టెక్నాలజీ అభివృద్ధి, వినియోగాలలో సోషలిస్టు ప్రజా దృక్పథం - పెట్టుబడిదారీ లాభాల దృక్పథం - సోవియట్ యూనియన్ అనుభవాలు

- ప్రొ. తోట జ్యోతిరాణి

**ప్రపంచంలోని** సమస్త దేశాలలో నిరుద్యోగ రిజర్వు ఆర్మీ తీవ్రస్థాయికి చేరుకున్నది. పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ అభివృద్ధి క్రమం, అది నిర్దేశిస్తున్న సాంకేతిక నవకల్పనల (innovations) పర్యవసానమే ప్రస్తుత సంక్షోభం. ఫైనాన్స్ కాపిటల్ ఆధిక్యత పెరుగుతున్నది. ఆధిపత్యం బలపడుతున్నది. నిరుద్యోగ సమస్యతో ముడిపడి వున్న విభిన్న సమస్యల దాడికి శ్రామికవర్గం బలవుతున్నది. మెజారిటీ ప్రజల జీవితాలు విధ్వంసం అవుతున్నాయి. రాయితీ, రాజీలేని గుత్త పెట్టుబడుల లాభాపేక్ష చట్రంలో సమస్య పరిష్కారం పేరుతో అమలవుతున్న ప్రతి నయా ఉదారవాద విధానం వల్ల సంక్షోభం మరింత సంక్లిష్టమవుతున్నది. దీర్ఘకాలంగా కొనసాగుతున్న ఈ సంక్షోభం ప్రస్తుత దోపిడీ వ్యవస్థకు శాశ్వత లక్షణమైంది. పెట్టుబడి గమనం నిర్దయగా, క్రూరంగా ఉంటుంది. అందుకే అంతం చేయాల్సింది పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభాన్ని కాదు, పెట్టుబడిదారీ వ్యవస్థని అంటాడు సమీర్ అమీన్. అదే సంక్షోభ వ్యవస్థ పరిధిలోనే సంక్షోభాన్ని అంతం చేయడం సాధ్యపడదు. సోషలిస్టు సమాజ స్థాపనతోనే దోపిడీ, పీడనల నుండి శ్రామికవర్గం విముక్తి చెందుతుంది అన్నదే ఖచ్చితమైన, రుజువైన వాస్తవం.

1917 బోల్షివిక్ విప్లవం తర్వాత సోవియట్ రష్యాలో చరిత్రలోనే మొట్టమొదటిసారిగా దోపిడీ, పీడన లేని సోషలిస్టు సమాజాన్ని నిర్మించడం కోసం అద్భుతమైన కృషి జరిగిందని మనందరికీ తెలిసిందే. లాభాపేక్ష స్థానంలో లక్ష్య సాధన కోసం దృఢ సంకల్పంతో రూపొందించిన కేంద్ర ప్రణాళికలతో అతి కొద్ది కాలంలోనే అభివృద్ధి క్రమంలోను, అభివృద్ధి ఫలితాలను అందుకోవటంలోను ప్రజలందరూ భాగస్వాములైనారు. అది నిజంగా వాస్తవీకరించబడిన సమ్మిళిత అభివృద్ధి. లాభాపేక్ష లక్ష్యంగా పనిచేసే స్వేచ్ఛా వాణిజ్యంలో మార్కెట్ శక్తుల పరస్పర చర్యలతో 200 సంవత్సరాలలో అమెరికా సాధించిన అభివృద్ధిని, సోషలిస్టు సమాజ స్థాపన లక్ష్యంగా రూపొందించిన ప్రణాళికల అమలుతో రష్యా కేవలం 20 సంవత్సరాలలో సాధించిందని ఆర్థికవేత్తలు చెబుతారు. పరిణితి చెందిన ప్రజాస్వామిక వ్యవస్థగా ప్రచారమైన అమెరికాలో 'అభివృద్ధి'తో పాటు ఆర్థిక అసమానతలు, సకల వివక్షలు, నేరాలు కూడా బలపడ్డాయి. కానీ సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం లక్ష్యంగా సాగిన సోవియట్ రష్యాలో సాగిన అభివృద్ధి గమనం ఆర్థిక అసమానతలను, గత వ్యవస్థలో కొనసాగిన సమస్త వివక్షలను నిర్మూలించే దిశగా కొనసాగింది.

ప్రపంచ ప్రజలందరి ముందు అతిపెద్ద ఆర్థిక సంక్షోభాలు కనిపిస్తూనే ఉన్నాయి. అవి తొలగించుకునే మార్గాల్ని వారు అన్వేషిస్తున్నారు. మెజారిటీ ప్రజల జీవన విధ్వంసంతో, సంక్లిష్టమైన సంక్షోభంలో కూరుకుపోయిన ప్రస్తుత పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ ఇంకెంత మాత్రం మనజాలదు. దాన్ని సమూలంగా మార్చుకోవాలి. ఆ స్థానంలో జనతా ప్రజాతంత్ర వ్యవస్థను, క్రమంగా సోషలిస్ట్ వ్యవస్థను నిర్మించుకోవాలి. అందుకోసం 1920లలో సోవియట్ రష్యాలో ప్రారంభమై, కొన్ని దశాబ్దాలు కొనసాగిన అద్భుతమైన సోషలిస్టు విధానాల ఆచరణను, అనుభవాలను తప్పనిసరిగా సునిశితంగా పరిశీలించటానికి ఇది సరైన సందర్భం.

## బోల్షివిక్కులు అధికారం స్వాధీనం చేసుకున్న రష్యాలో ఎటువంటి పరిస్థితులున్నాయి?

జార్ చక్రవర్తుల పరిపాలనలో వున్న ఫ్యూడల్ సామ్రాజ్యం అది. వ్యవసాయ ప్రాధాన్యత గల దేశం అయినప్పటికీ వ్యవసాయ రంగం వెనుకబడి వున్నది. ఒకవైపు ముక్క చెక్కలుగా చిన్న కమతాలు, మరొకవైపు సాంకేతిక వెనుకబాటుతనం, పర్యవసానంగా అల్ప ఉత్పాదకత, ఆహారధాన్యాల కొరత, ఫలితంగా పేదరికంలో రైతులు వున్న స్థితి కనిపిస్తుంది. ఇక పరిశ్రమల రంగం పూర్తిగా వెనుకబడి వున్నది. సాంకేతిక పరిజ్ఞానంలో, నవ కల్పనలలో వెనుకబాటుతనం, నిరక్షరాస్యత మరొక సమస్యగా వుంది. ఆర్థిక అసమానతలు, గ్రామీణ – పట్టణ ప్రాంతాల మధ్య వ్యత్యాసాలు తీవ్రంగా ఉన్న పరిస్థితి. స్టాలిన్ మాటల్లో చెప్పాలంటే అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ వ్యవస్థలతో పోల్చినట్లయితే అభివృద్ధిలో, సాంకేతిక నవకల్పనలలోఆనాటికి సోవియట్ యూనియన్ 150 సంవత్సరాలు వెనుకబడి ఉన్నది.

అభివృద్ధికి పారిశ్రామికీకరణ కీలకం. అందుకు పెట్టుబడులు, యంత్రాలు, యంత్ర పరికరాలు, టెక్నాలజీ, సాంకేతిక నవకల్పనలు తప్పనిసరి. వీటిని దిగుమతి చేసుకోవాలంటే విదేశీ రుణాలు లభించవు. సోషలిస్టు విధానాలు విఫలం కావాలని ఒత్తిడి చేసే పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థల నుండి ఎటువంటి సహాయం అందదు. వ్యవసాయక వస్తువుల ఎగుమతులే విదేశీ మారకాన్ని సంపాదించడానికి మార్గం. వెనుకబడి వున్న వ్యవసాయ రంగంతో ఎగుమతులు చేయటం అసాధ్యమే. ఏ మాత్రం అవకాశం దొరికినా ఈ అద్భుతమైన శాస్త్రీయ సామాజిక ప్రయోగాన్ని విధ్వంసం చేయటానికి చుట్టూ పెట్టుబడిదారీ దోపిడీ శక్తులు పొంచి వున్నాయి. ఇక అంతర్గతంగా అన్ని విధాలుగా వెనుకబాటుతనం వుంది. సోషలిస్టు పంథా నుండి బయటకు లాగటానికి అంతర్గతంగా పెటీబూర్జువా, దోపిడీ శక్తుల ప్రయత్నాలు తీవ్రంగానే వుంటాయి. ఈ పరిస్థితుల్ని తట్టుకొని నిలబడాలి. ఉన్నతమైన సామాజిక సంబంధాలను రూపొందించాలి. చుట్టూ బలంగా అభివృద్ధి చెందివున్న పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థలను ఎదుర్కొని నిలబడగలగాలి. సోషలిస్టు వ్యవస్థ నిర్మాణానికి వ్యతిరేకంగా వున్న అంతర్గత శక్తులను నియంత్రించాలి. ఒక్కమాటలో చెప్పాలంటే విప్లవానంతర ఆర్థిక వ్యవస్థలోని సమస్త రంగాలను, టెక్నాలజీని, విద్యను, సంస్కృతిని ఏకకాలంలో సమూలంగా ఉన్నత స్థాయికి తీసుకుపోవాలి. అప్పుడే తలపెట్టిన సోషలిస్టు వ్యవస్థ లక్ష్యసాధన పూర్తిగా విజయవంతం అవుతుంది.

## సోషలిస్టు వ్యవస్థగా రూపొందే క్రమంలో సోవియట్ యూనియన్ :

మానవజాతి చరిత్రలోనే మొట్టమొదటిది ఈ సోషలిస్టు వ్యవస్థ ఆవిర్భావం. అది విజయవంతం కావాలంటే ఆర్థిక వెనుకబాటుతనం వేగంగా అంతం కావాలని 1918లోనే లెనిన్ స్పష్టంగా చెప్పాడు. ఇందుకు, ఒకవైపు దేశంలో లభించే సహజ వనరులను అన్వేషించాలని, మరొకవైపు సాంకేతిక ప్రగతి, నవకల్పనలను వేగవంతం చేయాల్సి ఉంటుందన్నాడు. అదే సమయంలో చైతన్యవంతమైన సామాజిక

సంబంధాలను నిర్మించాలి. సమిష్టి కృషి దిశగా, శ్రామికవర్గం తన చారిత్రక కర్తవ్యాన్ని, సంఘర్షణా చైతన్యాన్ని కొనసాగించే వైపుగా, వ్యవస్థ మొత్తం ప్రయోజనాలకు సహకరించేలా ప్రజలను సమాయత్తం చేయాలి.

ఆర్థిక వ్యవస్థను, పారిశ్రామిక రంగాన్ని పునరుద్ధరించడానికి 1921-1928 మధ్యకాలంలో లెనిన్ నాయకత్వంలో నూతన ఆర్థిక విధానాన్ని అమలుపరిచారు. ఒకరకంగా ఇది మిశ్రమ విధానం, స్టేట్ క్యాపిటలిజం వంటిది. వ్యవసాయ రంగంలో కులక్ వ్యవస్థను క్రమంగా అంతమొందిస్తూ, ప్రభుత్వ కమతాలను ఏర్పరచినారు. చిన్న, మధ్య స్థాయి పరిశ్రమలు కొనసాగాయి. భారీ పరిశ్రమలు, రవాణా, పరపతి, విదేశీ వాణిజ్యం పూర్తిగా ప్రభుత్వ నియంత్రణలో కొనసాగింది. వైయక్తిక ఉత్పత్తిదారులు, ప్రభుత్వం మధ్య లక్ష్యాలలో వైరుధ్యం ఏర్పడింది. వైయక్తిక కమతాలు, ప్రైవేటు యాజమాన్యంలో చిన్న పరిశ్రమలు ఇదేవిధంగా కొనసాగితే పెట్టుబడిదారీ వ్యవస్థ దిశగా వెనక్కి వెళ్లే ప్రమాదం వున్నదని లెనిన్ గుర్తించాడు. డిసెంబర్ 1925లో జరిగిన 14వ కమ్యూనిస్టు పార్టీ కాంగ్రెస్ సమావేశంలో భారీ పరిశ్రమల స్థాపన ద్వారా స్వీయ నిలకడను (self sustaining) సాధించాలని, దిగుమతుల మీద ఏమాత్రం ఆధారపడకుండా స్వావలంబనను సాధించాలని తీర్మానించారు. దీనితో నూతన ఆర్థిక విధానం స్థానంలో కమాండ్ సోషలిజం వచ్చింది. పరిశ్రమలన్నింటినీ జాతీయం చేశారు. మార్కెట్ యంత్రాంగం ప్రస్తావనే ఉండదిక. పకడ్బందీగా రూపొందించిన కేంద్ర ప్రణాళికలే అభివృద్ధి లక్ష్యాలను నిర్ణయిస్తాయి. యంత్రాలు, యంత్ర పరికరాల దిగుమతులను కూడా కనిష్ట స్థాయికి తగ్గించాలని, వ్యవసాయ రంగంలో సమిష్టి వ్యవసాయ క్షేత్రాలను రూపొందించడంలో వేగాన్ని పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. పంట దిగుబడులను పెంచడానికి మంచి విత్తనాలను, పశుగ్రాసాన్ని, ఎరువులను, ట్రాక్టర్లను సమకూర్చాలని, తద్వారా ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరుగుతుందని ఆశించారు. భారీ పరిశ్రమల కేంద్రంగా పారిశ్రామికీకరణను వేగవంతం చేయాలని, ఉత్పత్తి సాధనాల ఉత్పత్తి లక్ష్యంగా పారిశ్రామిక అభివృద్ధి జరగాలని, కొరతగా ఉన్న విలువైన మూలధనంలో అధిక భాగాన్ని ఇందుకోసమే కేటాయించాలని, సోషలిస్టు దిశగా ఆర్థిక వ్యవస్థ పరివర్తనకు ఇది మౌలికమని, నవంబర్ 19, 1928లో జరిగిన ప్లీనం ఆఫ్ సిపిఎస్‌యు (13)లో స్టాలిన్ తన ఉపన్యాసంలో స్పష్టంగా చెప్పాడు. 1928-32కి సంబంధించిన మొదటి పంచవర్ష ప్రణాళిక మొదలైంది. ఇందుకోసం కావాల్సిన విత్త వనరులను చిన్న, మధ్య స్థాయి పరిశ్రమల నుండి, వ్యవసాయరంగం నుండి, విదేశీ వ్యాపారంలో ప్రభుత్వ గుత్తాధిపత్యం నుండి సమకూరిన ఆదాయం ద్వారా, ఆల్కహాల్ మీద పన్ను ద్వారా, ప్రజల నుండి రుణాలను తీసుకోవటం ద్వారా సమకూర్చుకున్నారు.

కాగా, రైతాంగాన్ని అంతర్గత వలసగా భావించాలని, మిగులును స్వాధీనం చేసుకొని బలమైన సోషలిస్టు పరిశ్రమలను నిర్మించాలని ట్రాట్స్కీవాదులు 1920లో ఇచ్చిన సూచనను ప్రధాన బాధ్యతల్లో వున్న స్టాలిన్ తిరస్కరించాడు. అయినప్పటికీ సోవియట్ యూనియన్‌లో రైతాంగం భయంకరమైన దోపిడీకి గురైందంటూ ఈ ట్రాట్స్కీవాదుల సూచనలను ఆధారంగా చేసుకుని బూర్జువా మేధావులు అబద్ధాలను ప్రచారం చేశారు. ఈ అంశాన్ని సున్నితంగా పరిశీలించిన మైఖేల్ ఎల్మన్ మొదటి పంచవర్ష ప్రణాళిక కాలంలో వ్యవసాయ రంగానికి మిగులునిచ్చే శక్తి లేదని, అసలు వ్యవసాయ ఉత్పత్తి కంటే పరిశ్రమలో పెట్టుబడులు నాలుగు రెట్లు అధికమని, ప్రణాళికా కాలంలో జాతీయాదాయం 60 శాతం పెరిగిందని, ఆ పెరుగుదలను పారిశ్రామికీకరణకు మళ్ళించారని, అసలు రైతాంగం, శ్రామికవర్గం మధ్య అటువంటి వైరుధ్యాలు లేవని స్పష్టం చేశాడు. ఆయన మార్క్సిస్టు అభిమాని కూడా కాదు. అయినప్పటికీ వాస్తవాలను గుర్తించడం వల్లనే సోవియట్ పారిశ్రామికీకరణ ఒక గొప్ప విజయ గాథ అంటాడు. 1920-1940 మధ్య ప్రజల జీవన ప్రమాణాలలో గుణాత్మకమైన మార్పు వచ్చింది. పట్టణ ఉద్యోగిత అధికంగా పెరిగింది. వ్యవసాయ రంగం సామర్థ్యత పెరిగింది. ఏ రూపంలో కూడా దోపిడీని ఆమోదించని గొప్ప సోషలిస్టు సమాజాన్ని నిర్మించుకునే క్రమం ప్రారంభంలోనే ఎంత ఉన్నతంగా వుంటుందో ఈ సోషలిస్టు ఆచరణ ఒక సజీవ ఉదాహరణగా నిలిచింది.

1928లో ప్రారంభమైన పంచవర్ష ప్రణాళికల ద్వారా కేవలం 12 సంవత్సరాలలో అంటే 1940 సంవత్సరం వరకే పారిశ్రామికరంగ నిర్మాణాలలో ఆశించిన అనూహ్యమైన పరివర్తన వచ్చింది. భారీ పరిశ్రమల స్థాపన, ఉత్పత్తి సాధనాల ఉత్పత్తిలో స్వావలంబన, సమిష్టి వ్యవసాయ క్షేత్రాల విస్తరణ, వ్యవసాయ ఉత్పత్తిని పెంచడానికి సాంకేతిక సహాయాన్ని అందించడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తులు పెరగటం సాధ్యమైంది. గ్రామీణ - పట్టణ ప్రాంతాల మధ్య వ్యత్యాసం, వ్యవసాయ రంగం - పరిశ్రమల రంగంలో ఉన్న ఉపాంత ఉత్పాదకతలో వ్యత్యాసాలు అంతరించే స్థితి వచ్చింది. దీనినే అతిపెద్ద గెంతుతో ముందడుగు (Great leap forward) అంటారు. సాధించుకొంటేనే సరిపోదు, సోషలిస్ట్ వ్యవస్థగా సోవియట్ యూనియన్ నిలబడాలన్నా, తదుపరి లక్ష్య సాధన దిశగా నిలదొక్కుకోవాలన్నా, దేశ రక్షణలో బలంగా ఉండాల్సిందే. ఇందులో కూడా లక్ష్యాన్ని సాధించారు. ఫ్యూడల్, పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థల అవశేషాలన్నింటినీ నిర్మూలించే క్రమం తీసుకున్నారు. 1940 సం॥ నాటికి 97 శాతం సాగు భూములు సమిష్టి వ్యవసాయ క్షేత్రాలుగా మారాయి. జాతీయ ఆదాయంలో పెరుగుదలతో అధిక భాగం ఉత్పత్తి సాధనాల ఉత్పత్తికి, అభివృద్ధికి, దేశ రక్షణకు, వ్యవసాయ రంగంలో ఉత్పాదకతను పెంచడానికి కేటాయించినా, ప్రజల జీవన ప్రమాణాలు నిరంతరాయంగా పెరగటం విశేషం. పెట్టుబడిదారీ వ్యవస్థలో నిరంతరం సహజమైనదిగా కొనసాగే వ్యవసాయ సంక్షోభం, సోవియట్ యూనియన్‌లో పంచవర్ష ప్రణాళికలు ప్రారంభమైన 12 సంవత్సరాల్లోనే కనుమరుగయింది.

1940 నాటికే సోవియట్ యూనియన్‌లో స్టీలు ఉత్పత్తిలో 80 శాతం, సిమెంట్ ఉత్పత్తిలో 78 శాతం, చమురు ఉత్పత్తిలో 42 శాతం అమెరికా కంటే అధికం. దేశ రక్షణలో, సైన్సు, టెక్నాలజీలో, సాంకేతిక నవ కల్పనలలో, అంతరిక్ష పరిశోధనలలో అమెరికాకు సమానంగా నిలిచింది. రెండవ సూపర్ పవర్ అయింది.

అభివృద్ధికి విద్యుచ్ఛక్తి కీలకమైనది. 1928లో విద్యుచ్ఛక్తి ఉత్పత్తి 5 బిలియన్ల KWH ఉండగా, 1940 నాటికి 48 బిలియన్ల KWHకి పెరిగింది. అంటే 866 శాతం పెరుగుదల అన్నమాట. రసాయనాల ఉత్పత్తిలో 1000 శాతం పెరుగుదలను సాధించింది.

1930లలో అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ వ్యవస్థలన్నీ అతిపెద్ద ఆర్థిక మాంద్యంలో కూరుకుపోయి, పారిశ్రామిక సంస్థలన్నీ మూసివేసే పరిస్థితులు నెలకొన్నాయి. డిమాండ్ లేదు, ఉత్పత్తి లేదు, ఉద్యోగిత లేదు, మళ్లీ డిమాండ్ లేదు. ఇట్లా నిరుద్యోగ సమస్య తీవ్రమైంది. ఇటువంటి పరిస్థితులలో ఈ మాంద్యం సోవియట్ యూనియన్ దరిదాపులకు కూడా రాలేదు. పైగా అదేకాలంలో భారీ పరిశ్రమల స్థాపన, ఉత్పత్తి సాధనాల అభివృద్ధి వేగంగా పెరిగింది. ఉద్యోగిత

పెరిగింది. ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయి. పటిష్టమైన దేశ రక్షణ వ్యవస్థను నిర్మించుకోవటం వల్లనే, రెండవ ప్రపంచ యుద్ధంలో విజయం సాధించింది. కానీ, ఆర్థికంగా మూలధన నిల్వలు మొదలగు వాటిలో చాలా నష్టపోయింది. కొరతగా ఉన్న వనరులను యుద్ధానికి కేటాయించాల్సి వచ్చింది. అయినప్పటికీ త్వరగా కోలుకున్నది. 1950 లలో సోవియట్ యూనియన్‌లో జరిగిన అభివృద్ధిని స్వర్ణ సంవత్సరాలు (Golden years of development) అంటారు.

1930ల చివరినాటికే 8900 కీలక పరిశ్రమలను స్థాపించారు. దిగుమతుల మీద ఆధారపడని స్వావలంబనను సాధించారు. నాటి స్థూల దేశీయోత్పత్తిలో దిగుమతుల వాటా కేవలం ఒక్క శాతం మాత్రమే. పెట్టుబడిదారీ ఆర్థిక విధానాలలో దీన్ని ఊహించడం కూడా సాధ్యంకాదు.

దేశమంతటా విద్యాసంస్థలు, ఉన్నత విద్యాసంస్థలు, టెక్నికల్ విద్యాసంస్థలు స్థాపించారు. నిరక్షరాస్యతను అంతం చేశారు. విద్యలో లింగ వివక్ష లేదు. అభివృద్ధి క్రమంలో మేధోపరమైన చర్యలలో ప్రజలందరినీ భాగం చేయటానికి చేసిన సీరియస్ కృషి విజయవంతం అయింది.

## విద్య, సైన్సు, టెక్నాలజీ :

బోల్షివిక్ విప్లవం తర్వాత కేవలం రెండున్నర దశాబ్దాల స్వల్ప వ్యవధిలో 'వెనుకబడిన వ్యవసాయక దేశం' నుండి 'అభివృద్ధి చెందిన పారిశ్రామిక దేశంగా' ఎదిగింది. ఉత్పత్తి సాధనాల ఉత్పత్తి, అభివృద్ధిలో స్వావలంబనను సాధించింది. సమిష్టి వ్యవసాయ క్షేత్రాల విస్తరణ ద్వారా భూ సంబంధాలలో మౌలిక మార్పులొచ్చాయి. మంచి విత్తనాలు, ఎరువులు, ట్రాక్టర్లు, మొదలైన ఉత్పాదకాలను అందించడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తులలో స్వయం సమృద్ధిని సాధించింది. మరొకవైపు దోపిడీ వ్యావసాయక సంబంధాలను బలోపేతం చేస్తూ, కేవలం నూతన సాంకేతిక పద్ధతుల ద్వారా వ్యవసాయ రంగంలో అభివృద్ధిని సాధించాలనుకునే పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థలలో వ్యవసాయ సంక్షోభం బలపడింది, శాశ్వతమైంది. కాగా సోషలిస్టు వ్యవస్థ కొనసాగటానికి అవసరమైన పటిష్టమైన దేశ రక్షణ వ్యవస్థను సోవియట్ యూనియన్ నిర్మించుకున్నది. మార్కెట్ శక్తుల లాభాపేక్ష నుండి, వ్యక్తిగత ఆస్తి నుండి విముక్తం అయిన అతికొద్ది కాలంలోనే అమెరికాతో అభివృద్ధిలో సమ స్థాయిలో నిలిచింది. పెట్టుబడిదారీ వ్యవస్థలను గడగడలాడించిన ఆర్థిక మాంద్యం, సోషలిస్టు రష్యాలో ఎటువంటి ప్రభావాన్ని చూపించలేకపోయింది. ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయి. ప్రజల జీవితాలకు, జీవనోపాధులకు భద్రత లభించింది. సకల వివక్షలు, అంతరాలు అంతరించటం ముమ్మరమైంది. సమిష్టి సామాజిక సంబంధాలు, సోషలిస్టు సమాజాన్ని రక్షించుకోవాలన్న ప్రజలందరి బలమైన ఆకాంక్ష వల్ల రెండవ ప్రపంచ యుద్ధాన్ని సైతం ఎదుర్కొన్నది, విజయం సాధించింది. మంచూరియాలోకి ప్రవేశించిన జపాన్ నాలుగవ ఆర్మీని ఓడించింది. దోపిడీ పీడనలు అంతమైతే అద్భుతమైన మానవ సమాజం ఏర్పడుతుందని మార్క్స్, ఎంగెల్స్ చెప్పిన విషయానికి సజీవ సాక్ష్యంగా సోవియట్ యూనియన్ నిలిచింది.

ఆర్థిక అభివృద్ధికి, పారిశ్రామికీకరణకు విద్య, సైన్సు, సాంకేతిక నవకల్పనలు కేంద్రం అని 1917లోనే లెనిన్ తన కరపత్రంలో స్పష్టంగా చెప్పాడు. విద్య అందరికీ అందుబాటులోకి రావటానికి, ప్రజలందరికీ సైన్స్ పరిజ్ఞానాన్ని అందించటానికి, తద్వారా శాస్త్రీయ ప్రాతిపదికతో సంస్కృతిని నిర్మించటానికి, ప్రజలందరి భాగస్వామ్యంతో సాంకేతిక నవకల్పనలను రూపొందించటానికి సోవియట్ యూనియన్ ప్రారంభం నుండి కృషి చేసింది. అయితే సోవియట్ రష్యా టెక్నాలజీని దిగుమతి చేసుకున్నదని, అమెరికా నుండి బదిలీ అయిన టెక్నాలజీ వల్లనే త్వరితగతిన అభివృద్ధి సాధించిందని ఆంథోనీ సట్టాన్, తాను ముందే నిర్ణయించుకున్న తప్పుడు అభిప్రాయాన్ని రుజువు చేయటానికి ప్రయత్నించాడు. కానీ దేశీయ టెక్నాలజీ అభివృద్ధి కాకుండా, వినూత్న సాంకేతిక నవకల్పనలు లేకుండా ఏ దేశమైనా అతితక్కువ కాలంలో సూపర్ పవర్‌కి పోటీ ఇవ్వగలదా? ఆధునికమైన అంతరిక్ష పరిశోధనలు, అణువిద్యుత్తు, లేజర్ టెక్నాలజీ మొదలైన వినూత్నమైన దేశీయ సాంకేతిక నవకల్పనలతో సోవియట్ యూనియన్ ప్రజల జీవితాలలో, జీవన ప్రమాణాలలో ఎంతో ఉన్నతిని సాధించిందని మారిస్ డాబ్ స్పష్టంగా చెప్పాడు. జర్మన్ ప్రొఫెసర్ బాన్, తాను అమెరికా మీద రాసిన పుస్తకంలో సోవియట్ యూనియన్ గురించి ప్రస్తావిస్తూ USSRలో "Golden Age of Science and Technology has come" అన్నాడు. చరిత్రకారుడు కోర్ట్ కిన్ ప్రకారం, లాభాల స్థానంలో ప్రణాళికా లక్ష్యాలతో, అప్పటికే అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలతో సమానంగా పోటీ పడగలిగింది, ఇంకా అనేక దేశాలకు తనవంతు సహాయం చేస్తూ సోషలిస్టు వ్యవస్థ కర్తవ్యాన్ని నైతిక ఔన్నత్యాన్ని రుజువు చేసింది.

1940లలోనే స్వంతంగా కంప్యూటర్‌ని డిజైన్ చేసుకున్నారు. గణితం, భౌతికశాస్త్రం, అణుభౌతిక శాస్త్రం, రసాయనిక శాస్త్రం, ఖగోళ శాస్త్రంలో సోవియట్ రష్యా శిఖరాగ్ర స్థానంలో నిలిచింది. 1949లోనే అణు బాంబును తయారు చేసింది. 1957లో మొట్టమొదటి కృత్రిమ ఉపగ్రహాన్ని ప్రయోగించారు. 1961లోనే అంతరిక్షంలో అడుగుపెట్టింది మొదటగా సోవియట్ రష్యా వ్యోమగామి. గతితార్కిక చారిత్రక భౌతిక పునాది మీదనే సైన్సు పరిశోధనలు, సామాజిక శాస్త్ర, మానవీయ శాస్త్ర అధ్యయనాలు కొనసాగాయి.

## ప్రజలందరికీ ఉన్నత విద్య లక్ష్యంగా సోవియట్ యూనియన్:

విద్యను ప్రాథమిక మానవ హక్కుగా సార్వత్రిక మానవ హక్కుల ప్రకటన ప్రకటించడానికి మూడు దశాబ్దాలకు ముందే ప్రజలందరికీ అక్షరాస్యత, ఉన్నత విద్య, సైన్సు మరియు టెక్నాలజీ విద్య అందుబాటులోకి రావాలన్న లక్ష్యంతో సోవియట్ యూనియన్ ప్రారంభం నుండి కృషి చేసింది. కొరతగా వున్న వనరులను భారీ స్థాయిలో విద్యారంగానికి కేటాయించింది. ఉన్నత విద్యా స్కూళ్లు, టెక్నికల్ మరియు ఉన్నత విద్యాసంస్థలను దేశమంతటా నెలకొల్పింది. సెకండరీ విద్య స్థాయి నుండే సైన్స్ విద్యను ప్రవేశపెట్టారు. ఉన్నత విద్య, టెక్నికల్ విద్యా కళాశాలలలో 1929లో ఒక లక్ష మంది వుండగా, 1932 నాటికి 2.3 లక్షలకు పెరిగింది. అద్భుతమైన విషయం ఏమిటంటే ఇందులో 75 నుండి 80 శాతం వరకు శ్రామికుల కుటుంబాలకు చెందిన విద్యార్థులే వున్నారు. విద్యార్థులందరికీ స్టైఫండ్ ఇవ్వటం వల్ల శ్రామికుల పిల్లలు విద్యాభ్యాసం కోసం పెద్దఎత్తున ముందుకు వచ్చారు. శ్రామికవర్గాన్ని మొత్తంగా సైన్స్ మరియు టెక్నాలజీతో అనుసంధానం చేయాలన్నదే వారి లక్ష్యం.

భారత రాజ్యాంగంలో నిర్బంధోచిత ప్రాథమిక విద్యను ప్రకటించుకున్న, 75 సంవత్సరాల "స్వతంత్ర భారత అమృతకాల్"లో కూడా విద్య మాట అటుంచినా, సంపూర్ణ అక్షరాస్యతను సాధించడంలో కూడా విఫలమైనాము. 'స్వాతంత్ర్యం' వచ్చిన 53 సంవత్సరాల తర్వాత 2000 సంవత్సరంలో నూతన సహస్రాబ్దిని మానవీయం చేసుకోవడానికి అంటూ ఐక్యరాజ్యసమితి ప్రకటించిన ఎనిమిది మిలీనియం అభివృద్ధి లక్ష్యాలలో సంపూర్ణ అక్షరాస్యత ఒకటి. అంటే విద్యను ప్రాథమిక మానవ హక్కుగా ప్రకటించిన 52 సంవత్సరాల తర్వాత కూడా సమస్త దేశాలలో ఈ లక్ష్యాన్ని

సాధించనే లేదు. పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థల అభివృద్ధి క్రమం ఏవిధంగా వుంటుందో ఈ చిన్న ఉదాహరణ స్పష్టం చేస్తుంది. ఇక ఇటీవల కాలంలో మన ప్రభుత్వం సంపూర్ణ అక్షరాస్యత గురించి ప్రస్తావించడమే మానుకున్నది. 'విశ్వగురు' లక్ష్యంలో దేశ ప్రజలందరికీ అక్షరాస్యత భాగంగా లేకపోవడం ఇంకా దిగజారిపోవడమే..

అందరికీ ఉన్నత విద్య లక్ష్యాన్ని సోవియట్ యూనియన్‌లో అతి స్వల్పకాలంలో సాధించటం సోషలిస్టు వ్యవస్థ గొప్పతనాన్ని తెలియజేస్తుంది.

1928లోనే 24 సైంటిఫిక్ పరిశోధనా సంస్థలను 8 శాఖలతో నెలకొల్పారు. 1930 నాటికి 83 శాఖలతో 72 సంస్థలైనాయి. వేల సంఖ్యలో ఫ్యాక్టరీ ప్రయోగశాలలను ఏర్పాటు చేశారు. 1931లో సైంటిఫిక్ పరిశోధనా పనులలో 40,000 మంది శ్రామికులున్నారు. సైన్సు, సాంకేతిక నవకల్పనలలో శ్రామికవర్గాన్ని భాగం చేయటానికి ప్రతీ ఫ్యాక్టరీ, వ్యవసాయ క్షేత్రం, ఉన్నత విద్యా సంస్థలలో టెక్నాలజీ మీద పట్టు సాధించడానికి ప్రత్యేక వ్యవస్థలను నెలకొల్పారు. ఒకదానితో మరొకరంగాన్ని అనుసంధానించారు.

యూరప్‌లో కూడా లేని Thermo Technical Institute, Physico Technical Institute మొదలైన ఉన్నత స్థాయి సాంకేతిక సంస్థలు స్థాపించబడ్డాయి. వ్యవసాయ రంగంలో సాంకేతిక అభివృద్ధి కోసం 47 సంస్థలు, రవాణా రంగం కోసం 10 టెక్నికల్ సంస్థలు, పాపులర్ విద్య కోసం 44 సంస్థలు, ప్రజారోగ్యం కోసం 34 సంస్థలు పనిచేయటం ప్రారంభమైంది. ఎంగెల్స్ తన 'Anti duhring'లో "The society emancipated from shackles of capitalist production, bringing forth a new generation of throughly developed producers who understands the scientific foundations of whole industrial process and who study practicals, each one in his branch, the whole series of branches of production from beginning to end will be able to create a new forces of production" అన్నారు.

సైన్సు మరియు టెక్నాలజీ అభివృద్ధిలో జనసామాన్యాన్ని విజయవంతంగా భాగం చేయడంతో భౌతిక, మేధోశ్రమల మధ్య అంతరాలు కొంతవరకు తొలగినాయి. సైన్సు, టెక్నాలజీ మీద పట్టు సాధించటం కోసం జనసామాన్యం తీవ్రంగా కృషి చేశారు, పోరాటం చేశారు. వేలసంఖ్యలో శ్రామికవర్గం నుండి సాంకేతిక నవకల్పనల సూచనలు వచ్చాయి. అద్భుతాలు సృష్టించారు.

ఇదే కదా "ఉన్నతస్థాయి సోషలిస్టు పోటీ". Donetz బేసిన్‌లో గనుల నుండి కన్వేయర్ ద్వారా బొగ్గును తేవటం ఈవిధంగా కనుగొన్నదే. సహజ వనరుల కొత్త నిక్షేపాలను కనుక్కోవటానికి అకాడమీ ఆఫ్ సైన్సెస్, జియోలాజికల్ ఎక్స్‌ప్లోరేషన్ ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో సైంటిస్టులతో పాటు స్థానిక ప్రజలు, టీచర్లు, యువత కూడా వుంటారు. ప్రతిశోధన, పరిశోధనలో జన సామాన్యం తప్పనిసరిగా వుంటారు. సమిష్టి కృషితోనే ఇవన్నీ సాధించటం జరిగింది.

సైన్సుతోనే ప్రజల జీవన ప్రమాణాల పెరుగుదల, ఆరోగ్యం, సంస్కృతి కూడా ఆధారపడి వున్నాయని స్కూల్ విద్య నుండే సైన్సును ప్రవేశ పెట్టారు. పెద్ద సంఖ్యలో సైంటిస్టులు, ఇంజనీర్లు తయారైనారు. అధ్యయనాలను ప్రచురించటానికి పెద్ద సంఖ్యలో పరిశోధనా పత్రికలున్నాయి. సైన్స్ అధ్యయనంలో, మేధోశ్రమలో లింగ వివక్ష అసలే లేదు. కానీ నేడు మహిళా సాధికారత, జెండర్ సమానత నినాదాలతో ఊదరగొడుతూ ప్రస్తుత సామ్రాజ్యవాద దోపిడీ వ్యవస్థ, స్త్రీల శ్రమను, పునరుత్పత్తి విధులను, లైంగికతను సరుకుగా దిగజార్చింది. నిజానికి సోషలిస్టు విధానాలను చూసి పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ సిగ్గుపడాలి. కానీ దుర్మార్గంగా సోషలిజాన్నే కాలం చెల్లిందంటుంది.

1918-20ల మధ్య 'స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అప్లైడ్ కెమిస్ట్రీ'ని స్థాపించారు. పరిశ్రమల రంగం, వ్యవసాయరంగం, ప్రజారోగ్యానికి రసాయన శాస్త్రంతో సంబంధం వున్నదని, 1928 నాటికే ఎరువులు, క్రిమిసంహారక మందులు, పొటాషియం మొదలైన ఉత్పత్తులకు సంబంధించిన అనేక ఫ్యాక్టరీలను స్థాపించారు. 1939లోనే రసాయనిక పరిశ్రమల అభివృద్ధి కోసం ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పడింది. 1926లోనే సింథటిక్ రబ్బరును తయారు చేసే ఉత్తమ పద్ధతిని కనుగొన్నారు. 1931-33 మధ్య సిల్వినైట్ నుండి పొటాషియం క్లోరైడ్‌ను తయారు చేసే భారీ పరిశ్రమను స్థాపించారు. ఏ ముడి పదార్థాన్ని వృథా కానివ్వ లేదు. ఉత్పత్తి క్రమంలో వచ్చే ఉప ఉత్పత్తులను సరియైన విధంగా ఉపయోగించారు. పనిచేసే పరిస్థితులు ఆరోగ్యకరంగా వుంచారు. పర్యావరణాన్ని కలుషితం చేయకుండా కాపాడారు. గడ్డి వంటి పంటల వ్యర్థాలు తగులబెడుతున్నారని ఢిల్లీ చుట్టూ వున్న రైతాంగంపై కేసులు పెడుతున్నారు కానీ వాటిని సేకరించి ఉపయోగకరంగా మార్చే ప్రయత్నాలు చేయని పరిపాలనలను ఇప్పటికీ చూస్తూనే వున్నాం. పెట్టుబడిదారీ దేశాలలో ఇప్పటికీ దుర్భరమైన పని పరిస్థితులు, పర్యావరణ కాలుష్యం తీవ్రమవుతూ కొనసాగుతున్నాయి. భూగోళం మనుగడనే ప్రశ్నార్థకం చేస్తున్నాయి.

సాంకేతిక నవ కల్పనలు, ప్రణాళికలు, సమస్యను పరిష్కరించడం అన్నీ కూడా సైంటిస్టులు, ఇంజనీర్లు, ఉత్పత్తి నిపుణులు, శ్రామికులు సమిష్టి చర్చలతో నిర్ణయిస్తారు. అన్నింటిలో సమిష్టి కృషి, సమిష్టి సహకారం వుంటుంది. విభిన్న శాఖల మధ్య సమన్వయంతో నిర్ణయాలు తీసుకుంటారు. అన్నీ ప్రభుత్వ విద్యాసంస్థలే, ప్రభుత్వ ప్రయోగశాలలే. అందువల్లనే సృజనాత్మకత ఉంటుంది. అపాయకరమైన పోటీ వుండదు. ప్రజల మొత్తం జీవితాన్ని శాస్త్రీయ ప్రాతిపదికల మీద క్రమబద్ధంగా నిర్మించారు. మానవజాతి మొత్తానికి భద్రత గల, ఫలవంతమైన, శాంతియుతమైన జీవితాలు లభించాయి.

## గుత్త పెట్టుబడులు - టెక్నాలజీ - సంక్షోభంలో శ్రామిక ప్రపంచం:

మార్కెట్‌శక్తుల అదృశ్యహస్తం నిర్దేశించటం వల్ల స్వేచ్ఛగా, పోటీ వల్ల సాంకేతిక ప్రగతి, సాంకేతిక నవ కల్పనలు శిఖరాగ్ర స్థాయికి చేరుకుంటాయని పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ గురించి చెబుతారు. ఈ వ్యవస్థలో పెట్టుబడుల లాభం కోసమే సాంకేతిక ప్రగతి వుంటుంది. సాపేక్షికంగా అధిక మిగులు నిచ్చే టెక్నాలజీని వినియోగిస్తాయి. శ్రమదోపిడీని తీవ్రస్థాయిలో పెంచడానికి టెక్నాలజీని ఆధునీకరిస్తూ పోతారు. శ్రామికుల వెసులుబాటు, పని పరిస్థితులను మెరుగుపరచడం, అవసరమైన విశ్రాంతిని కల్పించడం, జీవన ప్రమాణాలను పెంచడం, వీరి సాంకేతిక నవకల్పనల లక్ష్యం కానే కాదు. అసలు దీనికి సంబంధించిన మొత్తం నెట్‌వర్క్ అంటే సైంటిస్టులు, ప్రయోగశాలలు, పేటెంట్లు - అన్నీ గుత్త పెట్టుబడుల గుప్పిట్లో వుంటాయి. తమ లాభం దృష్ట్యా పరిశోధనలను నిర్దేశిస్తాయి. మూలధనం ఆధిపత్యాన్ని బలోపేతం చేయటం, శ్రామికులను నియంత్రణలో అణచి వుంచడం లక్ష్యంగా సాంకేతిక నవకల్పనలను ఆవిష్కరిస్తారు. ప్రభుత్వరంగంలో అభివృద్ధి చేసిన ఆధునిక పరిశోధన ఫలితాలను కూడా ఆఖరిదశలో చేజిక్కించుకుని తమ పేటెంటు హక్కులు పొందుతారు. మానవసమాజం నిర్మించుకుంటూ, ఆవిష్కరించుకుంటూ వచ్చిన అనేక శాస్త్ర, సాంకేతిక సమిష్టి ఫలితాలపై వ్యక్తిగత ఆస్తిలాగా పేటెంట్లు పొందుతారు. దీనికన్నా సామాజిక ద్రోహం మరొకటి లేదు. ఈవిధంగా అనేక రూపాల్లో తమవద్ద పోగుబడిన మూలధనం ఏ ➡

# గుజరాత్ ప్రజలపై మరొక నిర్బంధ చట్టం

**కేంద్ర** ప్రభుత్వాన్ని పాలిస్తున్న బి.జె.పి. పాలకులు, ఒకవైపు వలస కాలంనాటి చట్టాలను – ఇండియన్ పీనల్‌కోడ్, క్రిమినల్ ప్రొసీజరు కోడ్‌లను – నిశితంగా పరిశీలించి మెరుగు పరుస్తామని, అందుకు ప్రక్రియ మొదలైందనీ చెప్తూనే, మరోవైపు తమ పార్టీ పాలనలోనే వున్న గుజరాత్ రాష్ట్రంలో, పోలీసులకు మరిన్ని అధికారాలను యిచ్చే చట్టాలకు అనుమతినిచ్చారు.

సరీగ్గా గుజరాత్‌లో ఎన్నికలు జరగటానికి ఒక నెల ముందే అటువంటి చట్టానికి అనుమతిని మంజూరుచేశారు. గుజరాత్ అసెంబ్లీ మార్చి 2021లో కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (గుజరాత్ అమెండ్‌మెంటు) బిల్లు అన్నదానిని ఆమోదించింది. ఇప్పుడు ఈ బిల్లు, కేంద్ర ప్రభుత్వ అనుమతితో చట్టంగా మారింది.

ఈ నూతన చట్టప్రకారం యిప్పుడు పోలీసులు స్థానిక కోర్టులకు వ్రాతపూర్వకంగా తెలియచేయవల్సిన అవసరంలేకుండానే, 144వ సెక్షన్‌ను ధిక్కరిస్తూ నిరసనలు, ఆందోళన జేశారంటూ అరెస్టుచేసి, కేసులు నమోదు చేయవచ్చు. గతంలో అయితే అటువంటి కేసులు, స్థానిక మేజిస్ట్రేటుకు వ్రాతపూర్వకంగా తెలియ పరచకుండా పోలీసులు నమోదుచేసే అధికారం లేదు. అందువలన, ఏదోమేరకు పోలీసులు విచ్చలవిడిగా అరెస్టు చేయకుండా, కేసులు పెట్టకుండా వుండే పరిస్థితి వుండేది. ఇప్పుడు పోలీసులు, 144వ సెక్షన్‌ను అతిక్రమించారనే నెపంతో, యిష్టారాజ్యంగా కేసులు నమోదు చేయవచ్చు.

నిరంతరం ఏదో ఒక కల్పిత సమస్యను ముందుకు తీసుకువచ్చి, లేదా ప్రజావ్యతిరేక విధానాన్ని ముందుకు తెచ్చి ప్రజల్లో కల్లోలం సృష్టించటం, ఆ రకంగా వారు ఐక్యంగా వుండకుండా, తమ మౌలిక సమస్యల గురించి ఆలోచించకుండా వుండే వ్యూహాన్ని పాటిస్తూ బి.జె.పి. రాజ్యమేలుతోంది. ఈ విధానం వల్ల అనివార్యంగానే, ప్రజలు నిరసనలు, ఆందోళనలు జరపాల్సిన అనివార్య పరిస్థితులలోకి నెట్టబడు తున్నారు. తిరిగి ఆరకంగా, అనివార్యంగా నిరసనలలోకి దిగే ప్రజలను, ప్రస్తుత చట్టపు ఆసరాతో నిర్బంధాన్ని, అక్రమ కేసులను పోలీసులు మరింతగా పెంచుతారు. చావగొట్టి, చెవులు మూసి ప్రజలను పాలించాలన్న బిజెపి పాలకుల యొక్క వైఖరి, విధానాలు యీ చట్టానికి అనుమతి నివ్వటం వలన మరొకసారి వెల్లడవుతోంది.

ఒకవైపు నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం ప్రజలకు యిచ్చిందని ప్రచారం చేస్తూనే, ఆ హక్కును హరించే ప్రయత్నమే తప్ప, ఇది ఏరకంగానూ రాష్ట్రంలో, శాంతి–భద్రతలు నిర్వహించటానికి కాదని అర్థంచేసుకోవాలి!

ఇటువంటి నిర్బంధ చట్టాలను, ప్రజాస్వామిక చైతన్యంతో, ప్రజలు వ్యతిరేకించాలి! ✶

---

➡ దేశానికైనా అవలీలగా వెళ్ళగలుగుతుంది. వర్ధమానదేశాలు రాయితీలు ఇచ్చి అన్ని షరతులను ఒప్పుకొని ఆహ్వానిస్తాయి. మూలధనం వర్ధమాన దేశాలకు ప్రవహించడం వల్ల సంపన్న దేశాలలో నిరుద్యోగిత ఎప్పుడూ వుంటుంది. వర్ధమాన దేశాలలో నిరుద్యోగిత, ఉద్యోగ భద్రత లేకపోవడం, దుర్భర పరిస్థితుల్లో పనిచేయటం తీవ్రమవుతూనే వుంటుంది. శ్రమను, శ్రామికులను అభావం చేస్తూ, పర్యావరణాన్ని విధ్వంసం చేస్తూ, గుత్త పెట్టుబడులు తమ లాభాలను అపారంగా పెంచుకోవటం వల్ల అసమానతలు తీవ్రమవుతాయి. సంక్షోభం సంక్లిష్టమవుతుంది. సైంటిఫిక్ పరిశోధనలు ప్రధానంగా సూపర్ విలాస వస్తువుల ఉత్పత్తి, యుద్ధాలు, యుద్ధానికి సంబంధించి సిద్ధం కావటం, ఆడంబరమైన వస్తు ప్రకటనల దిశగానే వుంటాయి. నిరుద్యోగిత శాశ్వతం కావటం, ఉద్యోగ అభద్రత, శ్రామికుల హక్కులు అంతరించటం, మొదలైన సమస్యలన్నీ శ్రామిక వర్గాన్ని నిరాశవాదంలోకి నెడతాయి. ఇక పూజలు, తాంత్రిక పూజలు, మత మౌఢ్యం ముమ్మరం అవుతాయి. ఫైనాన్స్ క్యాపిటల్ సృష్టించే ప్రతి నవకల్పన కొత్త వైరుధ్యాలకు, కొత్త సమస్యలకు కారణమవుతుంది. సాంస్కృతిక వికృతీకరణ బలపడుతుంది. ఈ సమస్య కేవలం వర్ధమాన దేశాలకు, అనియత రంగానికి, నైపుణ్యం లేని శ్రామికులకు పరిమితం అనుకుంటే పొరపాటే. ఇటీవలి కాలంలో ట్విట్టర్‌ను స్వాధీనం చేసుకున్న ఇలాన్ మస్క్ ఒక మెయిల్‌తో పదివేలమంది అత్యున్నత నైపుణ్యం గల ఉద్యోగులను తొలగించాడు. మిగిలిన కార్పొరేట్ దిగ్గజాలు, అమేజాన్‌తో సహా అదే బాటలో నడుస్తున్నాయి.

సమస్త సంపదను గుత్త పెట్టుబడులు స్వాధీనం చేసుకునే క్రమం సాఫీగా వుండదు. సకల వివక్షలను తీవ్రం చేస్తుంది. నేర ప్రపంచాన్ని సృష్టిస్తుంది, బలోపేతం చేస్తుంది. సంక్షుభిత జీవితాలతో సతమతమవుతున్న పీడితవర్గ యువతను నేర ప్రపంచ సంకెళ్లతో బంధిస్తుంది. శ్రామికవర్గ చైతన్యం ఏమాత్రం అభివృద్ధి కాకుండా ఉండడానికి ఫైనాన్స్ మూలధనం చేసే ప్రయత్నాలలో యువతను లంపెన్ గ్రూపుగా తయారు చేస్తుంది. రాజకీయ నాయకులు తమ ఆధిపత్యం నిరూపించుకోవటానికి రకరకాల కబ్జాలను, అవినీతి కార్యక్రమాలను, ఎన్నికల్లో గెలవడానికి ఎప్పుడూ లంపెన్ యువతను పెంచి పోషించటం ఇందులో భాగమే. మనదేశంలో మత సంబంధమైన ఉత్సవాలు, వినాయక చవితి, నవరాత్రులు మొదలైన వాటిని విపరీతంగా నిర్వహించటం ఈ వికృతీకరణలో భాగమే.

మెజారిటీ ప్రజల జీవితాలు సంక్లిష్టమైన సంక్షోభంలో శాశ్వతంగా కొనసాగుతాయా? గుత్త పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ చట్రంలో సంక్షోభాలకు పరిష్కారమే లేదు. ఇవి మరింత తీవ్రం అవుతాయి. ఇటువంటి జటిలమైన పరిస్థితుల్లో పీడిత వర్గాన్ని చైతన్యవంతం చేయటానికి, సంఘటిత పరచడానికి వ్యవస్థ మార్పును సాధించాలనుకునే విప్లవశక్తుల మీద భారం మరింత అదనమవుతుంది.

లాభాపేక్ష, మార్కెట్ శక్తులు, ప్రైవేటు ఆస్తి నుంచి విముక్తి అయిన సోషలిస్టు వ్యవస్థలోనే అభివృద్ధి అన్నది ప్రజల కోసం వుంటుంది. టెక్నాలజీ అభివృద్ధి కొద్దిమంది బిలియనీర్ల లాభాల గ్యారంటీ కోసం కాకుండా సమాజాని కంతటికీ ఉపయోగపడుతుంది. ఉన్నతమైన సామాజిక సంబంధాలు ఏర్పడతాయి. ప్రజలందరూ గౌరవంగా, ఆత్మగౌరవంతో బ్రతికే పరిస్థితులు ఏర్పడతాయి. ఈ వాస్తవాన్ని సోవియట్ యూనియన్‌లో జరిగిన సోషలిస్టు వ్యవస్థ స్థాపన నిరూపించింది. ఏర్పడిన సోషలిస్టువ్యవస్థ ఇప్పటివరకు మనలేకపోవడానికి కారణాలను వేరుగా పరిశీలించుకోవచ్చు. కానీ నిత్యం సంక్షోభాలతో మునిగితేలే పెట్టుబడిదారీ వ్యవస్థకు అభివృద్ధికరమైన, ప్రత్యామ్నాయమూ, పరిష్కారమూ సోషలిస్టు వ్యవస్థ సాధనే. ఆ దిశగా సరైన ఆచరణ మార్గంలో గమనాన్ని వేగవంతం చేయడానికి బలమైన పోరాటాలను నిర్మించటమే మన ముందున్న కర్తవ్యం. ✶

# 'కాప్-27' సమావేశాలు

# ధరిత్రీ విపత్తు మూలకారణపు దరిదాపులకే చేరని వ్యర్థ చర్చలు

**ఐక్యరాజ్యసమితి** ఆధ్వర్యంలో వాతావరణ మార్పులపై ప్రపంచదేశాల భాగస్వామ్య పక్షాల (సిఓపి-కాప్-27) 27వ సమావేశాలు ఈజిప్టులోని షామ్-ఎల్-షేక్‌లో 2022 నవంబర్ 6 నుండి 21 వరకూ జరిగాయి. దాదాపు 200 దేశాలకు చెందిన దేశాధినేతలు, ముఖ్య నాయకులు, లాబీయిస్టులు, వాతావరణ శాస్త్రవేత్తలు, జర్నలిస్టులు, ప్రభుత్వేతర సంస్థల కార్యకర్తలతో సహా 33,000 మంది ముందుగా నమోదు చేసుకున్న ప్రతినిధులు ఈ సమావేశాల్లో పాల్గొన్నారు. బడా పారిశ్రామిక వర్గానికి చెందిన 15 మంది సభ్యులతోపాటు, మనదేశం నుండి 70 మంది ప్రతినిధుల బృందం ఈ సమావేశాలలో పాల్గొంది.

## 'కాప్' సమావేశాలు - నేపథ్యం

ఈ సమావేశాలు జరగటానికి చాలా ముందుగా, ఏప్రిల్ 4వ తేదీననే వాతావరణ మార్పులపై అధ్యయనం సాగిస్తున్న అంతర్ ప్రభుత్వ కమిటి (ఐపిసిసి) ఒక నివేదికను రూపొందించి, విడుదల చేసింది. నానాటికీ పెరుగుతోన్న కర్బన ఉద్గారాల ఫలితంగా తలెత్తుతున్న పర్యావరణ విపరిణామాలు - ప్రస్తుతం తీవ్ర సామాజిక సమస్యలుగా వున్న పేదరికం, కుల, మతతత్వాలు, టెర్రరిజం వంటివాటిని మించిన విపత్కర పరిస్థితులకు దారితీస్తున్నాయని, వాతావరణంలో సంభవిస్తున్న మార్పులు, మానవజాతి పాలిట పెనుముప్పుగా పరిణమించబోతున్నాయని ఈ నివేదిక రూపకర్తలు హెచ్చరించారు.

అయితే, ఐపిసిసి రూపొందించిన ఈ నివేదిక, శిలాజ ఇంధనాల వాడకం వలన సంభవించే విపత్తులను నామమాత్రం చేసింది. అందుకే దీనిని పాలక ప్రభుత్వాల కనుసన్నలలో రూపొందించిన నివేదికగా పలు దేశాలకు చెందిన పర్యావరణ శాస్త్రవేత్తలు ఎత్తిచూపారు. ఈనాడు భూమండల వునికికే ప్రమాదం పొంచి వున్నదని వారు హెచ్చరించారు. వీరి ఆధ్వర్యంలో 2022 ఏప్రిల్ 6 నుండి 25 దేశాలలో శాసనోల్లంఘన కార్యక్రమాల ద్వారా స్థానిక ప్రభుత్వాలకు తమ నిరసనలు తెలియజేశారు. 'శిలాజ ఇంధనాలే - మరణానికి సోపానాలు' అనే నినాదంతో 'భూతాపం 1.5 డిగ్రీల సెల్సియస్ పెరుగుదలకు వ్యతిరేకంగా వాతావరణ విప్లవం సాగించాల్సి వుందంటూ' వాతావరణ అత్యయిక పరిస్థితిని ప్రకటించాలని ప్రభుత్వాలను వారు డిమాండ్ చేశారు.

'2050 నాటికి కర్బన ఉద్గారాలను నెట్ జీరోస్థాయికి చేర్చటం (తటస్థీకరణం) ద్వారా భూతాపాన్ని 1.5 డిగ్రీల సెల్సియస్‌కు మించి పెరగకుండా నియంత్రించటం సాధ్యమౌతుంద'ని కాప్-27 సమావేశాలను ప్రారంభిస్తూ ఐక్యరాజ్యసమితి ప్రధానకార్యదర్శి గుటెర్రస్ పేర్కొన్నారు. అయితే సమావేశాల అనంతరం ఆయనే మాట్లాడుతూ 'పుడమితల్లి ఇప్పటికీ అత్యవసర గది'లోనే వుంది. అయినా కర్బన ఉద్గారాలను తక్షణమే గణనీయంగా తగ్గించాల్సిన అవసరాన్ని 'కాప్' గుర్తించటంలేద'ని వ్యాఖ్యానించారు.

ప్రస్తుతం అనుసరిస్తున్న నాజూకు వైఖరులతో వాతావరణంలోకి విడుదల చేస్తున్న కార్బన్ డై ఆక్సైడ్‌ను ఇదేవిధంగా కొనసాగించుతూ పోతే, భూతాపాన్ని 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేయటం దాదాపు అసాధ్యమని ఈ సమావేశాలలో పాల్గొన్న జాన్ రాక్‌స్టామ్ అనే అమెరికా శాస్త్రవేత్త హెచ్చరించారు.

అమెరికాకు చెందిన 'ది గార్డియన్', ఇరవై దేశాలలోని 30 వార్తాపత్రికలతో కలసి సంయుక్తంగా ఈ సందర్భంగా ప్రచురించిన తమ సంపాదకీయంలో 'సమయం సమీపిస్తోంది.... శిలాజ ఇంధనాల వాడకాన్ని నిరోధించి, స్వచ్ఛ ఇంధన వాడకానికి నడుం బిగించటానికి బదులు, అనేక దేశాలు చమురు, సహజవాయువులలో తిరిగి పెట్టుబడులను పెంపుజేస్తున్న ఫలితంగా కర్బన ఉద్గారాలను నిలువరించటంలో విఫలమౌతామ'ని పేర్కొంది.

2021-22 సంవత్సరంలో పాకిస్థాన్‌లో భారీ వరదలు, యూరప్‌లో తీవ్ర వడగాడ్పులు, ఆస్ట్రేలియా అడవులలో రగుల్కొన్న విస్తృత కార్చిచ్చు, అమెరికాలో భీకర తుఫానులు, ఇయాన్ పెనుతుఫాన్ దెబ్బకు క్యూబా అతలాకుతలం కావటం వంటి తీవ్ర వాతావరణ విపత్తులనెదుర్కొన్న నేపథ్యంలో కాప్-27 సమావేశాలు జరిగాయి. భారీవర్షాలు, వరదలు ఇండియా, చైనా, జపాన్‌లతోపాటు ఆఫ్రికా కొమ్ముగా పిలవబడే సాహెల్‌లో కూడా తీవ్ర ప్రభావం చూపాయి. వాతావరణ పెనుమార్పుల ఫలితంగా కరువులు, దుర్భిక్షం, పంటల నష్టం, మరోవైపున మంచు చరియలు కరగడంతో వరదల కారణంగా ఆస్తి, పంట నష్టాలన్నింటినీ ప్రపంచదేశాల నిరుపేద ప్రజానీకము, రైతాంగమే భరించాల్సి వస్తోంది.

కర్బన ఉద్గారాల విడుదల అధికమైన ఫలితంగా సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అత్యధికస్థాయికి చేరుకుంటున్నాయని ప్రపంచ వాతావరణ సంస్థ 2020లో రూపొందించిన తన నివేదికలో పేర్కొంది. కార్బన్ డై ఆక్సైడ్ వాతావరణంలో అధికం కావటం వల్ల అధిక ఆమ్ల జలాలతో సముద్ర వాతావరణ, పర్యావరణ వ్యవస్థలు సమస్యలెదుర్కొంటున్నాయని, తీవ్ర వేడి, వరదలు, తుఫానులు సంభవించటంపై దీని ప్రభావం అధికంగా వుంటోందని ఈ నివేదిక తెలిపింది. మానవుల ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్థిరత్వాలకు పెనుముప్పుగా పరిణమించటంతోపాటు, కోట్లాదిమంది ప్రజానీకంపై ఈ విపత్తులు ప్రభావం చూపుతున్నాయని ఈ నివేదిక పేర్కొంది. ఉత్తర అట్లాంటిక్ సముద్రంలో 2020 సం॥రం సీజన్‌లో 30కిపైగా తుఫానులు సంభవించాయని, దీని కారణంగా అమెరికాలో మంచు చరియలు విరిగిపడటంతోపాటు, మరోవైపున దక్షిణ అమెరికాలోని అనేక లోతట్టు ప్రాంతాలు తీవ్ర దుర్భిక్షానికి గురయ్యాయని ఈ నివేదిక తెలిపింది. ఉత్తర అర్జెంటీనా, పెరుగ్వే, బ్రెజిల్‌లోని పశ్చిమ సరిహద్దు ప్రాంతాలు; పసిఫిక్ ప్రాంతం, మధ్య అమెరికాతో సహా ఈ వాతావరణ విపత్తుల దుష్ఫలితాలను ఎదుర్కొన్నాయని, ఈ కారణంగా ఈ ప్రాంతాల నుండి ప్రజలు వలస వెళ్ళటం పెరగటాన్ని ఈ నివేదిక ఎత్తిచూపింది.

సారాంశంలో, ఈనాటి వాతావరణ విధ్వంసం ప్రధానంగా పర్యావరణ వ్యవస్థలోకి పారిశ్రామిక కర్బన ఉద్గారాలను విడుదల చేయటం, 'వి12' శిలాజ ఇంధనాలు, లోహాలు, ప్రపంచ పెట్టుబడిదారీ దేశాలు పారిశ్రామికంగా అభివృద్ధిచేసిన లోహేతర ఖనిజాలు, అతిగా జీవపదార్థేతర వనరుల వినియోగం వలన

జరుగుతోంది. పెట్టుబడిదారీ భారీ ఉత్పత్తిశక్తులు శిలాజ ఇంధనాల వినియోగంపై ఆధారపడి, కర్బన ఉద్గారాలను అధికంగా వెలువరిస్తున్నాయి. పెట్టుబడిదారీ దేశాలు – ప్రత్యేకించి – ఉత్తరార్ధగోళ దేశాలు చారిత్రకంగా అత్యంత అధిక కర్బనాన్ని వాతావరణంలోకి వెలువరించి కాలుష్య తీవ్రతను పెంచటమేగాక, ఆ పరిస్థితినే కొనసాగిస్తున్నాయి. యూరప్, ఉత్తర అమెరికా దేశాలు శిలాజ ఇంధనాలనుపయోగించి అత్యధికంగా లబ్ధిపొందాయి.

ఉత్పత్తిని పెంచటం, వినియోగింపజేయటం, పెట్టుబడి సమీకరణ, లాభాలను దండుకోవటమనేవి పెట్టుబడిదారీ విధానానికి అవసరం. శిలాజ ఇంధనాలను విచ్చలవిడిగా వినియోగిస్తూ 18వ శతాబ్ది నుండి సాగించిన అపరిమిత ఉత్పత్తి క్రమమే పర్యావరణ విపత్తుకు దారితీసి, నేడు భూమండలంపై ప్రాణుల మనుగడకు ప్రమాదకరంగా పరిణమించింది. ప్రపంచంలోని సంపన్నదేశాలలో 74 శాతం పారిశ్రామిక పెట్టుబడిదారీ దేశాలే, 1970 నుండి 2017 వరకు భూమండలంపై అధిక శిలాజ ఇంధన వినియోగానికి బాధ్యత వహించాల్సి వుంటుంది. దీనిలోనూ 27 శాతం అమెరికా; 28 శాతం యూరోపియన్ దేశాలు; 25 శాతం ఇతర అధిక ఆదాయ దేశాలు బాధ్యత వహించాలి.

అమెరికా దేశ ఇంధన విభాగ ప్రత్యేక 'కార్బన్ డై ఆక్సైడ్ సమాచార కేంద్రం' సమాచారం ప్రకారం కూడా, 1750 నుండి కర్బన ఉద్గారాలను విడుదల చేయటంలో అమెరికా ప్రథమశ్రేణిలో వుంది. యావత్తు యూరోపియన్ దేశాలు విడుదల చేసిన కార్బన్‌డైఆక్సైడ్‌ను మించిన స్థాయిలో అమెరికా ఆ వాయువును విడుదుల చేస్తోంది. అలాగే చైనాలో విడుదలయ్యే కర్బన ఉద్గారాలకు రెట్టింపుగాను, మనదేశంతో పోల్చినపుడు 8 రెట్లు అధికంగానూ వాతావరణాన్ని అమెరికా కాలుష్యం చేస్తోంది. 18వ శతాబ్దం నుండి అమెరికా, యూరప్, కెనడా, ఆస్ట్రేలియా దేశాలు మొత్తం ప్రపంచ కర్బన ఉద్గారాలలో సగానికి పైగా విడుదల చేస్తున్నాయి. ప్రపంచంలోని వంద బడా కార్పొరేషన్లు ప్రపంచం మొత్తం వెలువరించే పారిశ్రామిక కాలుష్య వాయువులలో (ప్రధానంగా కార్బన్ డై ఆక్సైడ్, మీథేన్‌లలో) 71 శాతానికి బాధ్యత వహించాల్సి వుంటుందని గణాంకాలు తెలుపుతున్నాయి.

ఆ విధంగా పారిశ్రామికంగా అత్యధికంగా అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాలు, ఈనాటి భూమండల పర్యావరణ విపత్తుకు బాధ్యత వహించాల్సి వుంటుంది. అయితే, ఈ తమ దుర్మార్గానికంతటికీ వారి జవాబుదారీతనం శూన్యంగా వుంది. ఇంతేగాక, ఈ 'పాప'భారాన్ని, విపత్తుల పర్యవసానాలనన్నీ ఇంతకాలంగా, పేద, అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రజానీకమే భరిస్తున్నారు గనుక, వారికి తగిన నష్టపరిహారాన్ని కూడా చెల్లించాల్సి వుంటుంది.

ప్రపంచబ్యాంకుకు చెందిన ప్రొఫెసర్ అవియెల్ వెర్బ్రోగన్ అందజేసిన సమాచారంపై ఆధారపడి సాగించిన విశ్లేషణ – గత 50 సం॥ల కాలంలో చమురు, సహజవాయు పరిశ్రమలు రోజు 2.8 బిలియన్ డాలర్ల లాభాలను పొందాయి. 1970 నుండి పెట్రోలియం ఎగుమతి దేశాలు, శిలాజ నిక్షేపాల బడా కంపెనీలు మొత్తంగా 52 ట్రిలియన్ డాలర్ల కళ్ళు చెదిరే సంపదను గడించాయి. ఈ చమురు దిగ్గజ కంపెనీలు, పాలక రాజకీయ నాయకులను, ప్రతి వ్యవస్థనూ ఈ డబ్బుతో శాసిస్తున్నాయని ఆ విశ్లేషణ పేర్కొంది. పైగా శిలాజ ఇంధన పరిశ్రమలు ప్రభుత్వాల నుండి రోజుకు ఆరు బిలియన్ డాలర్ల సబ్సిడీలతో కూడా ప్రయోజనాలు పొందుతున్నాయని ఐఎంఎఫ్ తెలియచేస్తోంది.

ప్రపంచంలో అత్యంత పెద్దవైన శిలాజ ఇంధన కంపెనీలు, చమురు – సహజవాయువుల ప్రాజెక్టులు, వాతావరణ సమతుల్యత కోసం విధించుకున్న హద్దులన్నింటినీ ఉద్దేశ్యపూర్వకంగా ప్రక్కకుపెట్టి, విపత్కర ప్రభావాలు కల్గిస్తూ 'కార్బన్ బాంబ్'లతో సిద్ధంగా ఉన్నాయంటూ 2022 మేలో 'ది గార్డియన్' పత్రిక వెల్లడించింది.

'షెల్' వంటి కంపెనీలు తెలిసి తెలిసీ తమ శిలాజ ఇంధన వ్యాపార కార్యకలాపాలను పెంచుకుంటూ పోతున్న ఫలితంగా ప్రపంచ వాతావరణ వ్యవస్థకు విఘాతం కలగటంతోపాటు, యావత్ ప్రజల భావి సౌభాగ్యం కూడా విధ్వంసమౌతోంది.

ఈవిధంగా పాలక ప్రభుత్వాలు, శక్తివంతమైన కార్పొరేషన్లు ప్రపంచ శాస్త్రవేత్తల తీవ్ర హెచ్చరికలన్నింటినీ పెడచెవినబెట్టి, వాటిని వెలుగులోకి రానీయకుండా తొక్కిపెడుతున్నాయి. భూమండలంపై మానవజాతి మనుగడ సమస్య కంటే కూడా, తమ ఆర్థిక స్థితి పెరుగుదలకు, స్వల్పకాల లాభాలకే అధిక ప్రాధాన్యతనిస్తున్నాయి.

2021లో వివిధ ప్రపంచ దేశాల యుద్ధాల పద్దు 2 ట్రిలియన్ డాలర్లు (ఒక ట్రిలియన్ = లక్ష కోట్లు) కాగా, అత్యధిక ప్రాధాన్యత కలిగిన వాతావరణ అంశానికి వెచ్చించినది 750 బిలియన్ డాలర్లు మాత్రమే. ఆయుధాలపై పెట్టుబడులు పెరుగుతున్నాయి; శిలాజ ఇంధనాలలో పెట్టుబడులు కొనసాగుతున్నాయి. 2021లో శక్తి మౌలిక సదుపాయాల కల్పనలో పెట్టుబడులు 1.9 ట్రిలియన్ డాలర్లు కాగా, దీనిలో అధికభాగం శిలాజ ఇంధనాలు, వి12 చమురు, సహజవాయువులపై వెచ్చించారు.

ఇంతటి సంక్లిష్ట నేపథ్యంలో 'కాప్-27' సమావేశాలు జరిగాయి. అయితే ఈ సమావేశాల్లో చర్చలేవీ భూమండల విపత్తుకు గల మూలకారణాలను ప్రతిఫలించలేదు. అంతేగాక, గత సంవత్సరం గ్లాస్గోలో జరిగిన 'కాప్-26' సమావేశాలలో తీర్మానించిన విధంగా వంద బిలియన్ డాలర్ల సాంవత్సరిక నిధిని సంపన్న పెట్టుబడిదారీ దేశాలు ఏర్పాటు చేయకుండా ఎందుకు తాత్సారం చేస్తున్నాయనే చర్చ కూడా చేయలేదు. ప్రపంచంలోని అతిపెద్ద ప్లాస్టిక్ కాలుష్యకారక పరిశ్రమ 'కాప్-27' సమావేశాల ప్రాయోజితులలో వుండటమే, ఈ సమావేశ ఫలితాన్ని తేటతెల్లం జేస్తోంది.

## 'కాప్ 27' – సమావేశాలు : శుష్క వాగ్దానాలు

కర్బన ఉద్గారాలను తగ్గించటానికి తీసుకోవలసిన చర్యల గురించి చర్చింటానికి బదులుగా, భూతాపాన్ని 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేయాలనే లక్ష్యాన్నే పశ్చిమ సంపన్న దేశాలు ప్రతిఘటిస్తూ ముందకు వచ్చాయి. కర్బన ఉద్గారాలను వెలువరించటంలో తాము ఇంకా ఎక్కువ వెసులుబాటును తీసుకుంటామని, దీనికి అందరూ కట్టుబడాలని అభివృద్ధి చెందిన సంపన్నదేశాలు కోరాయి. ఉక్రెయిన్ – రష్యా యుద్ధ కారణాన్ని చూపుతూ యూరోపియన్ యూనియన్ దేశాలు, తమ శక్తివనరులైన బొగ్గు, సహజవాయువు, చమురు వంటి శిలాజ ఇంధనాల వాడకాన్ని మరింతగా పెంచటానికి మరికొన్ని సంవత్సరాలపాటు తమకు సదలింపు ఇవ్వాలని కోరాయి.

ఈ సమావేశాలు ఒకవైపు కొనసాగు తుండగానే, అమెరికాకు చెందిన వాతావరణ శాఖ ప్రత్యేక రాయబారి జాన్ కెర్రి 'కాప్-27' పై వ్యాఖ్యానిస్తూ 'ఈ విధమైన నష్టపరిహార నిధిని ఏర్పాటుచేయటానికి అమెరికా మద్దతునివ్వబోదని' పేర్కొన్నాడు. అమెరికాతో సహా ఇంకా అనేక ఇతర దేశాలు జవాబుదారీతనం, నష్టపరిహారాలతో ముడిపడిన న్యాయపరమైన చట్రాన్ని రూపొందించలేదని, కనుక ఈ నిర్ణయం ఇప్పుడే కార్యరూపం దాల్చబోవటంలేదని ఆయన పేర్కొన్నాడు.

ఈవిధంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన సంపన్న పెట్టుబడిదారీ దేశాలు కర్బన ఉద్గారాలను అత్యధికంగా వెలువరించటంలో తమ బాధ్యతను, ప్రస్తుత భూమండల విధ్వంస, విపత్తులకు తామే కారణమనే అంశాలను, తమ చారిత్రక బాధ్యత, జవాబుదారీతనాలను అంగీకరించబోవని ఆయన చెప్పాడు. అయితే ఈ దేశాలు బిచ్చం విదిల్చినట్లుగా ఎంతో కొంత నష్టపరిహార నిధి ఏర్పాటుచేసినప్పటికీ, చట్టపరమైన కట్టుబాట్లను, జవాబుదారీతనాన్ని అంగీకరించబోవని కూడా పేర్కొన్నాడు.

అన్నిరకాల శిలాజ ఇంధనాలను ప్రపంచ దేశాలు ఇంకా వుపయోగిస్తాయా, ఆపివేస్తాయా లేక కేవలం బొగ్గును మాత్రమే ఆపివేస్తాయా? అనే ప్రశ్న ఇంకా అపరిష్కృతంగానే వుంది. 500 బిలియన్ డాలర్ల అంచనాతో 'నష్టపరిహార నిధి'గా పిలవబడే దాని స్వభావము, దాని నిర్వహణ వంటి అంశాలను ప్రత్యేకంగా ఏమీ పేర్కొనకుండా ఒక అస్పష్ట రూపంలో నిధిని ఏర్పాటుచేయటానికి అంగీకారం మాత్రమే కుదిరింది. దీని ఏర్పాటుకు తుదిగడువేదీ నిర్ణయించలేదు.

కర్బన ఉద్గారాలను అధికంగా వెలువరిస్తున్న ప్రాతిపదికన, చైనా, అరబ్ దేశాలు ఇంకా కొన్ని అభివృద్ధిచెందుతున్న దేశాలు, నష్టపరిహారానికి ఉదారంగా విరాళాలివ్వాలని యూరోపియన్ యూనియన్ పట్టుబడుతోంది. కేవలం స్కాట్లాండు, బెల్జియం దేశాలు మాత్రమే 'నిధి'కి నామమాత్రపు విరాళాన్ని ప్రకటించాయి. కొన్ని సంవత్సరాల తర్వాతనైనా ఈ నిధి అర్థవంతంగా అమలవుతుందన్న గ్యారంటీ లేదు.

భూమండల తాపాన్ని 2050 సం॥ నాటికి 1.5 డిగ్రీల సెల్సియస్‌కు మించకుండా చూడటం నేటి తక్షణ ఆవశ్యకత కాగా, ఈ శతాబ్దం చివరకు భూతాపం పెరుగుదలను 2 డిగ్రీల సెల్సియస్ దాటకుండా చూస్తామని 'కాప్-27' డాక్యుమెంటు హామీ ఇస్తోంది.

కాగా, కాప్ సమావేశాలలో జరిగే ఒప్పందాలకు చట్టబద్ధత ఏమీ లేదు కనుక, వీనికి కట్టుబడి ఉండటమన్నది ఆయాదేశాల ఇష్టాఇష్టాలపై ఆధారపడి వుంటుంది. ఐక్యరాజ్య సమితి సాధారణ సభ కూడా పర్యావరణ పరిస్థితిపై కేవలం చర్చ నిర్వహించగలుగుతుంది మినహా, ఒప్పందాల అమలుకు సంబంధించిన చర్యలేమీ చేపట్టబోదు.

సంపన్నదేశాలు, చమురు వ్యాపార పారిశ్రామిక దిగ్గజాలు నష్టపరిహారం, జవాబుదారీతనం డిమాండ్లను ప్రతిఘటించగలుగుతాయి. శిలాజ ఇంధన పరిశ్రమకు ప్రభుత్వాల సబ్సిడీలు కొనసాగుతాయి. పథకం ప్రకారం చర్వితచరణంగా సాగే ఈ చర్చలలో అనవసరమైన, విధ్వంసకరమైన మెక్ మాన్షన్స్, ప్రైవేటు జెట్స్, శిలాజ ఇంధనాలు, ఆయుధాల పరిశ్రమకు నిధుల వినియోగంలో కోతలు విధించే నిర్ణయాలు ఏవీ కాప్-27 సమావేశాలలో జరగలేదు.

బ్యాటరీ పదార్థాల పరిశ్రమలు, ముడిఖనిజాల తవ్వకం, వాటి ప్రభావాల గురించి చర్చించలేదు. అయితే పెట్టుబడిదారీ వ్యవస్థ ఎదుర్కొనే సంక్షోభాన్ని స్థిమిత పరచుకొని, తిరిగి దానిని పునరుత్తేజపరిచేందుకుగానూ నష్టపరిహార నిధుల కోసం చర్చలు జరిగాయి మినహా వేరుకాదు.

ప్రపంచాధిపత్యం కోసం అర్రులు సాచే సామ్రాజ్యవాద దేశాలు. సంపన్న పెట్టుబడిదారీ దేశాలు - వాతావరణ విధ్వంసానికి, విపత్తుకు ముగింపు పలికేందుకు 'కాప్-27' సమావేశాలలో తమ అసమ్మతిని తెలపటం స్పష్టంగా తెలుస్తోంది. తద్వారా ఈ వాతావరణ సంక్షోభానికి ఏకైక, ప్రధాన కారణమైన పెట్టుబడిదారీ విధానం, దీనిని పరిష్కరించబోదనే అంశం కూడా స్పష్టమౌతోంది. 21వ శతాబ్ది క్రూర అనాగరికత్వం అంటే ఇదే!

## వాతావరణ సంక్షోభాన్ని సైతం, వ్యాపార ప్రయోజనాలకే....

కరువును కూడా తమ వ్యాపార ప్రయోజనాల కోసం బహుచక్కగా ఉపయోగించుకునే పెట్టుబడిదారీవర్గం, సామ్రాజ్యవాదులు.... కర్బన ఉద్గారాల తీవ్రతను తగ్గించేందుకు నిర్దిష్టమైన చర్యలు చేపట్టకుండా, ఈ పరిస్థితిని కూడా తమ వ్యాపార ప్రయోజనాలకు, సూపర్ లాభార్జనల కోసం వుపయోగించుకుంటున్నారు. ప్రజారవాణా వ్యవస్థను నీరుగార్చి, వ్యక్తిగత ద్విచక్ర, నాలుగు చక్ర వాహనాలను అపరిమితంగా తయారుచేసి అమ్ముకొని లాభాలు గడించిన సామ్రాజ్యవాదులు, బడా కార్పొరేట్లు.... పెట్రోల్, డీజిల్ వాహనాల స్థానంలో విద్యుత్ వాహనాలు (ఇ.వి.) వినియోగంలోకి తేవటమే వాతావరణ సంక్షోభానికి పరిష్కారమని చెబుతూ ఇ.వి.ల తయారీని ముమ్మరం చేశాయి. భారత ప్రభుత్వం కూడా కాలుష్యాన్ని కట్టడి చేసే పేరుతో 15 ఏళ్ళకు పైబడిన వాణిజ్య వాహనాలను, 20 ఏళ్ళకు పైబడిన వ్యక్తిగత వాహనాలను (మొత్తం దాదాపు 3 కోట్ల వాహనాలను) తుక్కుగా మార్చాలని, వాటిని రహదార్లపై తిరగనివ్వరాదంటూ 2021 సం॥లోనే 'తుక్కు విధానాన్ని' ప్రకటించింది. ఈ చర్యలన్నీ రానున్న కాలంలో బడా, బహుళజాతి కంపెనీల ఇ.వి.లకు మార్కెట్‌ను విస్తృతంగా కల్పిస్తాయనేదాంట్లో సందేహం లేదు.

మరోవైపున దేశంలో పుష్కలంగా లభ్యమయ్యే నీటివనరులపై, దేశీయ సాంకేతిక పరిజ్ఞానంపై ఆధారపడి చౌకగా, కాలుష్యరహితంగా జలవిద్యుత్తును ఉత్పత్తి చేయటాన్ని నిరుత్సాహ పరుస్తూన్నారు. రేడియో ధార్మిక కాలుష్య తీవ్రత అధికంగా వుండే కాలంచెల్లిన ప్రమాదకర అణువిద్యుత్తు కర్మాగారాలను మనదేశంలో నెలకొల్పేందుకు దళారీ పాలకులు బహుళజాతి కంపెనీలు ఈ వాతావరణ సంక్షోభాన్ని కూడా తను వ్యాపార ప్రయోజనాలకనుగుణంగా ఉపయోగించుకుంటున్నాయి.

ఏమైనా, ప్రకృతిని వికృతం చేసే, విధ్వంసం చేసే పెట్టుబడిదారీ వ్యాపార ప్రయోజనాలు మానవసమాజ పాలిట ఎలాంటి మృత్యుఘంటికలు మోగిస్తాయనేది, 2022 డిసెంబర్ 3వ వారంలో అమెరికా, జపాన్ దేశాలపై శీతాకాలపు మంచు తుఫాన్ 'బాంబ్ సైక్లోన్' విరుచుకుపడిన తీవ్రత తెలియజెప్తూంది.

అందువలన, లాభాలే పరమావధిగా ముందుకు సాగే పెట్టుబడిదారీవ్యవస్థ 'కాప్' సదస్సులు ఎన్ని జరిపినా, తీర్మానాలెన్ని చేసినా, వాటన్నింటినీ తుంగలో తొక్కి ప్రకృతిని విచక్షణా రహితంగా కొల్లగొట్టటాన్ని ఆపబోదు. అయితే ఈ దుష్ట విధానాల విష ఫలితాలన్నింటినీ అత్యధికంగా ప్రపంచవ్యాపిత నిరుపేద, శ్రామిక, పేద ప్రజానీకమే అనుభవించాల్సి వస్తోంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి మనిషిని ప్రకృతి నుండి వేరుచేస్తుందని, హద్దుల్లేని వనరుల దోపిడీ పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తుందని కార్ల్‌మార్క్స్ చెప్పిన మాటలు అక్షర సత్యాలు.

దీనికి భిన్నంగా 'ప్రకృతి-మానవ సమాజాలు పరస్పర ఆధారితాలు, పరస్పరం అంగిక సంబంధం కలిగి వుంటాయ'నే సూత్రాన్ని, అవగాహనను సోషలిస్టు సమాజం మాత్రమే ఆచరణలో పెట్టగలుగుతుంది. ప్రకృతి సూత్రాలను అర్థం చేసుకోవటం, ప్రకృతిపై స్వారీ చేయటానికి కాకుండా, ప్రకృతి - మానవ సమాజాల నడుమ సమతుల్యతను సాధించేందుకు ఉపయోగిస్తుంది. వ్యక్తుల చైతన్యాన్ని పెంపొందించటం ద్వారా వ్యక్తిగత ప్రయోజనాలను, సమాజ ప్రయోజనాలకు లోబరిచి, రెంటికీ మధ్య సామరస్యాన్ని సాధించటం ఆ వ్యవస్థలోనే సాధ్యమౌతుంది. కాలుష్య నియంత్రణకు నిర్దిష్ట డిమాండ్లపై సాగించే ప్రజా ఉద్యమాలకు ఈ అవగాహననందించటం, ఈ దిశగా ఉద్యమింపజేయటం కార్మికవర్గ అగ్రగామి శక్తుల కర్తవ్యం. ✸

## ప్రపంచ జీవ వైవిధ్య సదస్సు

# బడాయి ప్రకటనలు ఆపి, తక్షణ చర్యలు చేపట్టాలి

**ఈజిప్టులో** 'కాప్-27' సమావేశాలు జరిగిన నెలరోజుల తర్వాత, 2022 డిసెంబర్ 6 నుండి 19వ తేదీ వరకు కెనడాలోని మాంట్రెడ్‌లో ప్రపంచ జీవవైవిధ్య సదస్సు (సిబిడి) జరిగింది. చైనా, కెనడాలు సంయుక్తంగా ఈ సదస్సుకు ఆతిథ్యమిచ్చాయి. ఈ సదస్సుకు 196 దేశాల నుండి అధికార ప్రతినిధులతోపాటు, పదివేలమందికి పైగా ఇతర ప్రతినిధులు హాజరయ్యారు. ప్రధానంగా ఈ జీవ వైవిధ్య సదస్సు 'పర్యావరణయుత' సమస్యల చట్రంలో కొనసాగుతుండటంతో ప్రపంచ నాయకులు, లేదా దేశాల అధినేతలెవరూ ఈ సదస్సుకు హాజరుకాలేదు.

జీవవైవిధ్య వినాశనమనేది వాతావరణ సంక్షోభంలాగా వెనువెంటనే కనబడేది కాదు. అయితే ఈ వినాశనాన్ని ప్రత్యక్షంగా దర్శించలేక పోయినా, దీని బాధితులను మాత్రం స్పష్టంగా చూడగలం. ప్రస్తుత జీవవైవిధ్య వినాశన తీరుపై ఆధారపడి, ఐక్యరాజ్యసమితి అంచనా ప్రకారం, 34 వేల వృక్షజాతులు, 5200 జంతుజాతులు అంతరించే క్రమంలో వున్నాయి. దీనిలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఎనిమిది పక్షి జాతులలోని ఒక జాతి కూడా వుంది. ప్రధాన వ్యవసాయ జంతు జాతులలోని దాదాపు 30 శాతం జాతులు ప్రస్తుతం అంతరించే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. భూగోళ జీవ వైవిధ్యానికి అడవులు ప్రధాన ఆవాసం కాగా ముఖ్యంగా గత శతాబ్దికాలంలో భూమండలంపైనున్న అసలైన అడవులలో 45 శాతం అంతరించాయి. ఈ విధంగా అడవులు అధికంగా అంతరించిపోతున్న కారణంగా ప్రపంచవ్యాప్తంగా వున్న ఆదిమ తెగల ఆదివాసీ ప్రజానీకపు జీవితాలు చెల్లాచెదురై పోయాయి. వారి ఆవాసాల నుండి, అడవితల్లి ఒడి నుండి వారు విస్థాపనకు గురై, నిరాధారంగా మిగిలిపోతున్నారు. వారి సంస్కృతులు నశిస్తున్నాయి. వారి హక్కులకు రక్షణ లేకుండా పోయింది. అడవులలో నివశించే ఆదిమ తెగల మానవ సమూహాలు నిరాశ్రయులుగా చేయబడటానికి సూపర్ లాభార్జనల కోసం పెట్టుబడిదారుల దురాశే ప్రధాన కారణమనేది నిర్వివాదం. పెట్టుబడిదారీ దేశాలు తమ పశువుల పెంపకం, పశుపోషణ అవసరాల కోసం, వారి ఆహార అలవాట్లు, మాంస వినియోగ అవసరాల కారణంగా అమెజాన్ అడవులను నరికివేస్తుండటం మనం చూస్తున్నాం.

జీవవైవిధ్య వినాశనాన్ని అరికట్టే ఉద్దేశ్యంతో, 2030 నాటికి జీవ వైవిధ్యాన్ని దాని సహజ స్థాయిలకు చేర్చే ఆలోచనతో ఈ జీవ వైవిధ్య సదస్సును నిర్వహిస్తున్నట్లుగా ప్రకటిస్తున్నారు.

భారతదేశం భారీస్థాయిలో అడవుల నరికివేతను వ్యతిరేకిస్తూనే, ఈశాన్య రాష్ట్రాలలో రక్షణ అవసరాలపేరున, భారీ జల విద్యుదుత్పత్తి కేంద్రాల, సువిశాల ప్రధాన రహదారుల అభివృద్ధి పేరుతో అడవుల నరికివేతను భారీగా సాగిస్తోంది. అలాగే అభివృద్ధిపేరిట అండమాన్ నికోబార్ దీవులలో భారీ కంటైనర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం వ్యవసాయ భూములలో అసాధారణ స్థాయిలో పురుగుమందులనుపయోగించి చెప్పనలవికాని పర్యావరణ, జీవవైవిధ్య వినాశనానికి పాల్పడుతోంది. కాగా సదస్సులో జీవవైవిధ్య పరిరక్షణకు తానే ఛాంపియన్‌లాగా జపాన్‌తో కలసి ఫోజు పెడ్తున్నది. పురుగుమందుల వాడకాన్ని తగ్గించటం వంటి ప్రతిపాదనలపై కఠినమైన లక్ష్యాలు పెట్టవద్దంటూ జపాన్‌తో గొంతు కలుపుతోంది. జీవవైవిధ్య పరిరక్షణకు వివిధ దేశాలకు వివిధ స్థాయిలలో బాధ్యతలున్నాయని వాదనలు చేసి, మొత్తానికి బడా వ్యవసాయ, వాణిజ్య, పురుగుమందుల కార్పొరేషన్ల ప్రయోజనాల మేరకు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించాలనే ప్రతిపాదన నిర్ణయ రూపం తీసుకోకుండా జీవ వైవిధ్యానికి హాని తలపెట్టే విధంగా చేయటంలో మనదేశం విజయం సాధించింది. ప్రకృతితో సహజీవనం చేస్తామని, జీవవైవిధ్యాన్ని పరిరక్షించటంలో ఛాంపియన్‌లు తామేనని డాంబికాలు పలికే భారత ప్రభుత్వ పాలకుల వంచన ఈ విధంగా వుంది.

2030 సం॥ నాటికి 30 శాతం భూమి, సముద్రాలను పరిరక్షించాలని ప్రపంచ జీవ వైవిధ్య సదస్సు తీర్మానించింది.

ఈ విధంగా జీవ వైవిధ్య సదస్సు చర్చలు 'ప్యారిస్ మూమెంట్ ఫర్ నేచర్' రూపంలో ముగిశాయి. 2024 సం॥ నాటికి నిర్దిష్ట చర్యలు చేపట్టేందుకు అవసరమైన పథకాలను రూపొందిస్తామని సభ్యదేశాలు అంగీకరించగా, సంపన్నదేశాలు 2030 సం॥ నాటికి ప్రతి సం॥రం 30 బిలియన్ డాలర్లను జీవ వైవిధ్య పరిరక్షణకు వెచ్చిస్తామని అంగీకరించాయి.

అయితే వీరి అంగీకారాలు ఎంతమేరకు ఆచరణరూపం తీసుకుంటాయో వేచి చూడవలసిందే.

ఇప్పుడు చర్చలు, ప్రకటనలు కాదు; నిర్దిష్ట చర్యలు చేపట్టడం అవసరం. అయితే అది సుదూరంగానే వుంది. ✱

## కా॥ జగ్గారపు సుబ్బారావు అంతిమయాత్ర - అంత్యక్రియలు

**17-12-22న** మరణించిన సిపిఐ(ఎం-ఎల్) గుంటూరుజిల్లా సీనియర్ నాయకులు కా॥ సుబ్బారావు అంత్యక్రియలు 18వ తేదీన మంగళగిరి శ్మశానవాటికలో జరిగాయి. అంతకు ముందుగా ఆయన మృతదేహాన్ని సందర్శనార్థం శ్రామికనగర్‌లోని వారి ఇంటివద్ద వుంచారు. సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి సభ్యులు కా॥ గుర్రం విజయకుమార్ కా॥ సుబ్బారావు మృతదేహంపై ఎర్రజెండా వుంచి జోహార్లర్పించారు.

ఆ సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకులు కా॥ ఎం.ఎస్. నాగరాజు అధ్యక్షతన అక్కడే నిర్వహించిన సంతాపసభలో ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర కార్యదర్శి కా॥ జె. కిషోర్‌బాబు; కా॥ సుబ్బారావుగారి పెద్ద అల్లుడు, సిపిఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కా॥ మేకల ప్రసాద్‌తోసహా ఇతర కుటుంబసభ్యులు, వివిధ విప్లవ, వామపక్ష పార్టీల, రాజకీయపక్షాల, ప్రజాసంఘాల ప్రతినిధులు, ప్రజాతంత్రవాదులు, కా॥ సుబ్బారావు మృతదేహంపై పూలు వుంచి, ఆయనకు జోహార్లర్పిస్తూ మాట్లాడారు. శ్మశానవాటిక వరకు వందలాదిమంది వెంట నడవగా అంతిమయాత్ర జరిగింది. అనంతరం, అంత్యక్రియలు జరిపి శ్రామిక ప్రజా ఉద్యమ నాయకునికి తుది వీడ్కోలు పలికారు.

# చరిత్ర గురించి దివాళాకోరు భావవాద భావన

(సెప్టెంబరు 16, 1949) - మావో సేటుంగ్

(అమెరికా దేశీయాంగశాఖ కార్యదర్శి డీన్ అచెసన్ వ్రాసిన లేఖపై షిన్‌హువా వార్తా సంస్థకోసం కామ్రేడ్ మావో రాసిన వ్యాఖ్యానం ఇది. చైనాపట్ల అమెరికా విధానపు సామ్రాజ్యవాద స్వభావాన్ని ఈ వ్యాసం ఎండగట్టింది. చైనాలోని కొందరు బూర్జువా మేధావుల్లో అమెరికా సామ్రాజ్యవాదం పట్ల నెలకొని వున్న భ్రమల్ని విమర్శించింది. చైనా విప్లవం తలెత్తటానికీ, అది విజయం సాధించటానికీ గల కారణాలను గురించి సైద్ధాంతిక వివరణను ఈ వ్యాసం అందించింది)

**చైనా** ప్రజలను వధించడానికి అమెరికా తరపున తిరుగుబాటు కోసం ధనము, తుపాకులను, చాంగ్‌కై షేక్‌కు తోడుగా వనరులను అమెరికా సరఫరా చేసిందని ఒప్పుకున్నందుకు మాత్రమే గాక, తద్వారా చైనాలోని ప్రగతిశీలురలో అపరిణుతలైన వారిని ఒప్పించడానికి తగిన సాక్ష్యాన్ని ఒనగూర్చినందుకు కూడా అమెరికా బూర్జువావర్గ ప్రతినిధి అయిన అచెసన్ (Acheson)కు చైనీయులు కృతజ్ఞత తెలపాల్సి వుంది. లక్షలాది చైనా ప్రజల జీవితాలు ఆహుతైన, గత కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్న పెద్ద రక్తసిక్త యుద్ధాన్ని అమెరికా సామ్రాజ్యవాదం ప్రణాళికలు వేసి సాగించిందన్న వాస్తవాన్ని అచెసన్ స్వయంగా ఒప్పుకున్నాడన్నది అర్థం కావడం లేదా? అచెసన్‌కు చైనీయులు మరొకసారి కృతజ్ఞతలు తెలపాల్సి వుంది. ఎందుకంటే అమెరికా అనుకూల చైనా "ప్రజాతంత్ర మేధావుల" రహస్య ముఠాను తయారు చేసుకొని తద్వారా చైనా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వాన్ని కూలదోయడానికి అమెరికా యోచిస్తున్నదని ప్రకటించినందుకు మరియు ముఖ్యంగా ఉదారవాదం అలవడినవారు అమెరికా నాటకాలను నమ్మకూడదని ఒకరికొకరు చెప్పుకుంటూ అమెరికా రహస్య కుట్రలకు వ్యతిరేకంగా రక్షణ కోసం జాగరుకులుగా వుండే విధంగా వారిని అప్రమత్తం చేసినందుకుగాను కూడా కృతజ్ఞతలు తెలపాలి. ఆధునిక చైనా చరిత్ర గురించి నమ్మశక్యం గాని కథలు అల్లినందులకు కూడా ఆయనకు చైనీయులు కృతజ్ఞతలు తెలపాలి. చరిత్రను గురించి అతని భావన సరిగ్గా ఒక శ్రేణికి చెందిన మేధావుల భావనను పోలినదే, అంటే అది బూర్జువా భావవాద భావనే. కావున అచెసన్ భావాలను తిరస్కరించడం చాలామంది చైనీయుల అవగాహనా పరిధిని విశాల పరచడానికి తోడ్పడుతుంది. అంతేగాక ఎవరి భావనా లోకం పూర్తిగానో, కొంత మేరకో అచెసన్ భావనలను పోలి వుందో అటువంటి వారికి అది మరింత లాభదాయకంగా వుండవచ్చు.

ఆధునిక చైనా చరిత్ర గురించి అచెసన్ చేసిన కల్పనల వైపరీత్యాలేవి? ముఖ్యంగా అతను చైనా విప్లవ పరివర్తనను చైనాలో వుండిన ఆర్థిక, భావజాలాల ఆధారంగా వివరించాలని ప్రయత్నిస్తారు. ఇందులో అనేక కట్టుకథలను ప్రస్తావిస్తాడు.

అచెసన్ ఇలా అంటాడు :

"18 మరియు 19 శతాబ్దాల్లో జనాభా రెట్టింపయినందువల్ల భూమి సమస్యపై భరించలేని ఒత్తిడి ఏర్పడింది. ప్రతి చైనా ప్రభుత్వము ఎదుర్కొన్న ప్రథమ సమస్య ఆ జనాభాకు ఆహారం సమకూర్చడం. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వమూ ఇందులో విజయం సాధించలేదు. కొమింటాంగ్ ప్రభుత్వం అనేక భూసంస్కరణ చట్టాలను రాజ్యాంగబద్ధం చేసి ఈ సమస్యను పరిష్కరించాలని చూసింది. వాటిలో కొన్ని విఫలమయినాయి. మరికొన్ని పట్టింపుకు నోచుకోలేదు. ఈనాడు జాతీయ ప్రభుత్వ సంకట స్థితికి చైనీయులకు అవసరమైనంత ఆహారం అందించకపోవడం చిన్న కారణమేమి కాదు. భూమి సమస్యను పరిష్కరిస్తాం అను వాగ్దానం కమ్యూనిస్టుల ప్రభావంలో ప్రముఖంగా వుంది".

సక్రమంగా ఆలోచించలేని చైనీయులకు పై విషయాలు నమ్మదగినవిగా తోస్తాయి. తినే నోళ్ళు అధికం, ఆహారం అతికొద్ది అయినందు వల్ల విప్లవం సాకారమైంది. కొమింటాంగ్ ఈ సమస్యను పరిష్కరించడంలో విఫలమయింది. కమ్యూనిస్టుపార్టీ అయినా దాన్ని పరిష్కరిస్తుందని చెప్పలేం. "ఇప్పటి వరకు ఎవరూ విజయం సాధించలేదు".

అధిక జనాభా మూలంగా విప్లవాలు తలెత్తుతాయా? చైనాలోను విదేశాల్లోను, ప్రాచీన కాలంలోను, ఆధునిక కాలంలోను విప్లవాలు చాలానే జరిగాయి. అవన్నీ అధిక జనాభా సమస్య మూలంగానే జరిగాయా? గత కొన్ని వేల సంవత్సరాలలో చైనాలో జరిగిన విప్లవాలు అన్నీ అధిక జనాభా సమస్య కారణంగానే జరిగాయా? 174 సంవత్సరాల క్రితం[1] బ్రిటన్‌కు వ్యతిరేకంగా జరిగిన విప్లవానికి కారణం అధిక జనాభాయేనా? అచెసన్‌కు చరిత్రను గురించిన జ్ఞానం శూన్యం. అతను అమెరికా స్వాతంత్ర్య ప్రకటనను కూడా చదవలేదు. వాషింగ్టన్, జెఫర్సన్ తదితరుల నాయకత్వంలో బ్రిటన్‌కు వ్యతిరేకంగా జరిగిన విప్లవానికి బ్రిటిష్ పాలకులు అమెరికన్లపై సాగించిన అణచివేత దోపిడీలే కారణం. అమెరికాలో అధిక జనాభా సమస్య వుండడం వల్ల కాదు. చైనా ప్రజల ఫ్యూడల్ రాచరికాన్ని కూలదోసిన ప్రతిసారి వారిపై రాచరిక అణచివేత, దోపిడీలే కారణం. అధిక జనాభా కారణం కాదు. రష్యన్‌లు జరిపిన ఫిబ్రవరి, అక్టోబర్ విప్లవాలకు కారణం జారు చక్రవర్తి, బూర్జువా వర్గం సాగించిన అణచివేత దోపిడీలే. అధిక జనాభా కారణం వల్ల కాదు. ఈనాటికి కూడా రష్యాలో జనాభాతో పోలిస్తే భూమి వనరు విస్తారంగా వుంది. మంగోలియాలో జనాభా చాలా స్వల్పంగాను భూమి విస్తారంగానూ వుంది. అచెసన్ ప్రకారం అక్కడ విప్లవం జరగడాన్ని ఊహించలేము. అయినా అక్కడ కొంతకాలం క్రితం విప్లవం జరిగింది[2].

అచెసన్ ప్రకారం అయితే చైనాకు ఏ దారీ దిక్కూ లేదు. 475 మిలియన్ల భరింపశక్యం కాని జనాభా ఒత్తిడితో విప్లవం జరిగినా జరగకపోయినా పరిస్థితి అత్యంత నిరాశా జనకంగా వుంది. ఈ విషయమై అచెసన్ గొప్ప ఆశాభావాన్ని కలిగి వున్నాడు. దీన్ని గురించి స్వయంగా వ్యక్తం చేయనప్పటికీ అమెరికన్ పాత్రికేయులు మాత్రం చైనా కమ్యూనిస్టు పార్టీ చైనా ఆర్థిక సమస్యలను పరిష్కరింపజాలదనీ, చైనా శాశ్వత అరాచకంలో వుండిపోతుందనీ, దానికి గల ఒకే ఒక విముక్తి మార్గం అమెరికా నుంచి ఆహార సరఫరా మీద ఆధారపడి బతకడమేననీ అంటే అమెరికాకి వలసగా మారడమేనని వెల్లడిస్తూ ఆరోపించారు.

1911 విప్లవం ఎందుకు విజయవంతం కాలేదు? జనాభా యొక్క ఆహార సమస్యను ఎందుకు పరిష్కరించ లేకపోయింది? ఎందుకంటే ఆ విప్లవం చింగ్ రాచరికాన్ని కూలదోసిందే గాని, సామ్రాజ్యవాద మరియు ఫ్యూడల్ అణచివేతను దోపిడీని అంతమొందించలేదు.

1926-27లో చేపట్టిన ఉత్తరదిశ ప్రస్థానం ఎందుకు విఫలమైంది? అది జనాభా ఆహార

సమస్యను ఎందుకు పరిష్కరించలేదు? ఎందుకంటే చాంగ్ కై షేక్ విప్లవానికి ద్రోహం చేశాడు. సామ్రాజ్యవాదానికి లొంగిపోయాడు. అతడు చైనా ప్రజలను అణచివేతకు, దోపిడీకి గురిచేసిన ప్రతీఘాత విప్లవానికి నాయకుడిగా నిలిచాడు.

ఇప్పటి వరకు ఎవరూ సఫలం కాలేదన్నది నిజమేనా? ఇంతకుముందే విముక్తమైన, ఇప్పటికే భూమి సమస్య పరిష్కారమైన తూర్పు చైనా ప్రాంతాల్లో అచెసన్ భావించినట్లు "జనాభాకు ఆహార సమస్య" ఇంకా కొనసాగుతున్నట్లేనా? చైనాలో అనేక మంది వేగులను లేదా పరిశీలకులు అనే వారిని అమెరికా నియమించింది. వాళ్ళు ఈ నిజాన్ని ఎందుకు వెలికి తీయలేక పోయారు? షాంఘై వంటి చోట్ల నిరుద్యోగ సమస్య, జనావళికి ఆహార సమస్య తలెత్తడానికి సామ్రాజ్యవాదం, భూస్వామ్యం, నిరంకుశాధికార పెట్టుబడిదారీ విధానం మరియు ప్రగతినిరోధక కొమింటాంగ్ ప్రభుత్వము సాగించిన క్రూరమైన, దుర్మార్గమైన అణచివేత దోపిడీలే కారణం. ఉత్తర, ఈశాన్య, ఇతర చైనా ప్రాంతాలలో మాదిరే అక్కడ కూడా నిరుద్యోగము, ఆహార సమస్యలు ప్రజా ప్రభుత్వ పాలనలో సంపూర్ణంగా పరిష్కరించబడతాయి.

పెద్ద జనాభాను కలిగి వుండడం చైనాకు మంచిదయింది. జనాభా ఇంకా అనేక రెట్లు పెరిగినా చైనా తన సమస్యలను పరిష్కరించుకో గల శక్తిని కలిగి వున్నది – ఆ పరిష్కారమే ఉత్పత్తి సామర్థ్యం. జనాభా పెరుగుదలకు అనుగుణంగా ఆహారోత్పత్తిలో పెరుగుదల వుండదు అని మాల్థస్ (Malthus)[3] వంటి పాశ్చాత్య బూర్జువా అర్థ శాస్త్రవేత్తలు చేసిన అసంబద్ధ వాదన మార్క్సిస్టులచే చాలా కాలం క్రితమే సైద్ధాంతికంగా తిప్పికొట్టబడడమే గాక సోవియట్ యూనియన్‌లోను, చైనా విముక్త ప్రాంతాల్లోను జరిగిన విప్లవాల వాస్తవికత కూడా ఆ వాదనను సంపూర్ణంగా ధ్వంసం చేసింది. విప్లవము దానితో పాటే సామాజిక ఉత్పత్తిలో అభివృద్ధి – జనాభా ఆహార సమస్యను పరిష్కరిస్తాయన్న వాస్తవంపై ఆధారపడి చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్రకమిటీ దేశవ్యాప్తంగా పార్టీ నిర్మాణాలకు, ప్రజా విముక్తి సైన్యానికి (PLA) ఈ కింది ఆజ్ఞలు జారీ చేసింది. కొమింటాంగ్ మనుషులను వాళ్ళు ధృవీకరింప బడిన ప్రగతి నిరోధకులు లేదా అపఖ్యాతి పాలైన దుష్టులో అయివుంటే తప్ప వాళ్ళు ఉపయోగపడగల వారు అయి వుంటే వాళ్ళను విధుల్లోంచి తొలగించవద్దని తెలియపరచింది. కష్ట పరిస్థితులున్న చోట ఆహారము, వసతిని పంచుకొని ఉమ్మడిగా జీవించాలి. విధుల నుండి తొలగింపబడిన వారిలో జీవనాధారం లేని వాళ్ళని పునర్నియామకం చేసి జీవన వసతి కల్పించబడతారు. అదే సూత్రం ప్రకారం తిరుగుబాటు చేసి మన వైపు వచ్చిన కొమింటాంగ్ సైనికులను, లేదా బందీలుగా దొరికిన వారిని మనలోకి చేర్చుకుంటాం. పెద్ద నేరస్తులయిన వారిని తప్ప, ప్రగతినిరోధకు లందరికీ వారు పశ్చాత్తాపం ప్రకటించినట్లయితే జీవనాధారాలు ఏర్పరచుకోవడానికి ఒక అవకాశం కల్పించబడుతుంది.

ప్రపంచంలో అన్నింటిలోకి ప్రజలే అత్యంత విలువైన వారు. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వుండి ప్రజలున్నంత కాలం అన్ని రకాల అద్భుతాలను సాధ్యం చేయవచ్చు. అచెసన్ విప్లవ ప్రతిఘాత సిద్ధాంతాన్ని మనం తిప్పికొడతాం. విప్లవం ప్రతిదాన్ని మారుస్తుందని మనం నమ్ముతాం. అనతి కాలంలోనే పెద్ద జనాభా ఉత్పత్తుల సంపద కలిగిన పుష్కలమైన జీవనం, సంస్కృతి వర్ధిల్లే కొత్త చైనా ఆవిర్భవిస్తుంది. నిరాశాజనకమైన అభిప్రాయాలకు ఎట్టి తావూ లేదు.

చైనాలో విప్లవం రావడానికి రెండవ కారణం పశ్చిమ దేశాల ప్రభావం అని అచెసన్ పేర్కొన్నాడు. ఆయన ఇలా అంటాడు :

"మూడు వేల సంవత్సరాలకు పైగా బయటి ప్రపంచం ప్రభావాల స్పర్శ లేకుండా చైనీయులు వారి గొప్ప సంస్కృతిని, నాగరికత అభివృద్ధి చేసుకున్నారు. సైనిక దురాక్రమణలు జరిగినప్పుడు కూడా అంతిమంగా చైనీయులు వారిని లొంగదీసుకొని లీనం చేసుకున్నారు. అందువల్లనే వారు సహజంగా తమని తాము ప్రపంచానికి కేంద్రంగా మానవాళిలో అత్యంత నాగరిక వ్యక్తీకరణగా భావించుకున్నారు. అప్పుడు 19వ శతాబ్దం మధ్యభాగంలో ఇంత వరకు అభేద్యమైన చైనా వేర్పాటు గోడను పాశ్చాత్య దేశాలు బద్దలుకొట్టాయి. ఇదివరకటి విదేశీ దురాక్రమణదారులు తమతోపాటు తీసుకురాని దూకుడుతనాన్ని, అసమానమైన సాంకేతికాభివృద్ధిని, ఉన్నత సంస్కృతీ ధోరణులను చైనాకు తీసుకొచ్చారు. కొంతమేరకు ఈ కారణాల వల్లనూ, కొంతమేరకు మంచూ రాచరిక పాలన పతనావస్థకు చేరుకోవడం వల్లనూ, పాశ్చాత్య చొరబాటుదారులు చైనీయుల పద్ధతిలోకి మారకుండా, వారు ప్రవేశపెట్టిన కొత్త భావాల ప్రభావం చైనా సమాజంలో ఒక అశాంతిని, అలజడిని ప్రేరేపించడంలో ముఖ్యపాత్ర వహించాయి.

చైనీయుల్లో స్పష్టతతో ఆలోచించలేని వారికి అచెసన్ చెప్పింది నిజమే అనిపిస్తుంది – అంటే చొరబడిన పాశ్చాత్యుల భావాలు విప్లవాన్ని ఎగదోస్తాయి.

ఎవరికి వ్యతిరేకంగా విప్లవం ఎక్కు పెట్టబడింది? మంచు రాచరిక ' 'పాలన క్షయించి పోయినందువల్ల", అది బలహీన స్థానంలో వుండి దాడికి గురవుతున్నందువల్ల విప్లవం చింగ్ రాజవంశంపై ఎక్కుపెట్టబడినట్లు కనిపిస్తుంది. అయితే అచెసన్ చెబుతున్నది ఎంత మాత్రం నిజం కాదు. 1911 విప్లవం సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడింది. చైనీయులు చింగ్ రాజవంశంపై ఎందుకు ఎక్కుపెట్టారంటే అది సామ్రాజ్యవాదపు వేట కుక్కగా వ్యవహరిస్తున్నందువల్ల. బ్రిటన్ యొక్క నల్లమందు (Opium) దురాక్రమణకు వ్యతిరేకంగా జరిపిన యుద్ధం, ఆంగ్లో-ఫ్రెంచి మిత్ర సైన్యాలకి వ్యతిరేకంగా తైపింగ్ స్వర్గ రాజ్యం[4] జరిపిన రైతాంగ యుద్ధం, ఫ్రెంచి దురాక్రమణకు వ్యతిరేకంగా జరిపిన యుద్ధం, జపాన్ దురాక్రమణకు వ్యతిరేకంగా జరిపిన యుద్ధం, ఎనిమిది మిత్ర రాజ్యాల దురాక్రమణకు వ్యతిరేకంగా జరిపిన యుద్ధం – ఇవన్నీ పరాజయం పాలయినాయి. అందుకే సామ్రాజ్య వాదపు వేటకుక్క చింగ్ రాచరికానికి వ్యతిరేకంగా 1911 విప్లవ యుద్ధం మొదలైంది. 1911 వరకూ అదీ ఆధునిక చైనా చరిత్ర. ఇక అచెసన్ ప్రస్తావించే "పాశ్చాత్య ప్రభావం" అనేది ఏమిటి? మార్క్స్, ఏంగెల్స్ కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక (1848)లో చెప్పిన విధంగా [5] పాశ్చాత్య బూర్జువా వర్గం ఉదారవాద విధానం ద్వారా ప్రపంచాన్నంతా తనను పోలిన రూపంలోకి మార్చడానికి ప్రయత్నిస్తుంది. ఈ రూప మార్పిడి క్రమంలో బూర్జువా వర్గానికి పాశ్చాత్య ఆచారాలతో పరిచయం వున్న దళారీలు, తొత్తులు అవసరమై వున్నందున పాఠశాలలు ప్రారంభించడానికి, విద్యార్థులను విదేశాలకు పంపడానికి చైనా లాంటి దేశాలను సిద్ధపరచింది. ఆ విధంగా చైనాలోకి "కొత్త భావాలు ప్రవేశపెట్ట బడినాయి. అదే సమయంలో చైనా లాంటి దేశాల్లో జాతీయ బూర్జువా వర్గము, కార్మిక వర్గము పుట్టుకొచ్చాయి. అదే కాలంలో రైతాంగం దివాళా తీయబడింది. పెద్ద అర్ధ-కార్మికవర్గం (Semi-Proletariat) ఉనికిలోకి వచ్చింది. ఆ విధంగా పాశ్చాత్య బూర్జువావర్గం ప్రాచ్య దేశాల్లో రెండు రకాల వారిని సృష్టించింది. సామ్రాజ్యవాదానికి తొత్తులైన చిన్న మైనారిటీ ఒక రకం. రెండవది కార్మికవర్గం, రైతాంగం, పట్టణ పెటీ బూర్జువావర్గం, జాతీయ బూర్జువా వర్గం మరియు ఈ వర్గాలకు చెందిన మేధావులతో కూడిన మెజారిటీ ప్రజానీకం. సామ్రాజ్యవాదంచే

సృష్టించబడిన మెజారిటీ వర్గానికి చెందినవారు సామ్రాజ్యవాదాన్ని భూస్థాపితం చేస్తారు. వారి నుండే విప్లవం పుట్టుకొస్తుంది. పశ్చిమం నుంచి చొచ్చుకొచ్చిన భావాలు అశాంతిని, అలజడిని కలిగించాయన్నది ముఖ్యం కాదు. సామ్రాజ్య వాదపు దురాక్రమణ ప్రజాప్రతిఘటనను ప్రేరేపించిందన్న విషయమే గమనించదగినది.

1840 నల్లమందు (Opium) యుద్ధం నాటి నుండి 1919 మే ఫోర్త్ (May 4th) ఉద్యమం వరకూ అంటే 70 సంవత్సరాల సుదీర్ఘ ప్రతిఘటన కాలంలో సామ్రాజ్యవాద దాడి నుండి రక్షణ పొందడానికి చైనీయులకు సైద్ధాంతిక ఆయుధం ఏదీ అందుబాటులో లేదు. పాత మూర్ఖపు ఫ్యూడల్ సైద్ధాంతిక ఆయుధాలు ఓటమి పాలయి వ్యర్థమైనవిగా తేలిపోయి వైదొలగవలసి వచ్చింది. ఇతరత్రా సరైనది ఏదీ అందుబాటులో లేక చైనీయులు పరిణామ సిద్ధాంతము, సహజ హక్కుల సిద్ధాంతము, బూర్జువా రిపబ్లిక్ సిద్ధాంతము వంటి సైద్ధాంతిక ఆయుధాలను గత్యంతరం లేక స్వీకరించారు. అవన్నీ కూడా సామ్రాజ్యవాదం యొక్క స్వీయ ఆవాసమైన పశ్చిమ దేశాల బూర్జువా వర్గం యొక్క విప్లవకర దశకు చెందిన సైద్ధాంతిక ఆయుధ భాండాగారం నుండి అరువు తెచ్చుకున్నవే. ఆ విధంగా విదేశీ శక్తులను ప్రతిఘటించి ఒక రిపబ్లిక్‌ను నిర్మించుకోగలమన్న నమ్మకంతో చైనీయులు రాజకీయ పార్టీలు నిర్మించి విప్లవాలను తెచ్చారు. అయితే ఈ సైద్ధాంతిక ఆయుధాలు ఫ్యూడల్ సైద్ధాంతిక ఆయుధాల మాదిరే బలహీనమైనవిగా నిరూపించబడి అవి కూడా దారి నుంచి వైదొలగి వెనక్కి తగ్గి అసమర్ధమయినవిగా తేల్చబడినాయి.

1917 రష్యన్ విప్లవం చైనీయుల్ని మేల్కొలిపింది. కొత్త జ్ఞానాన్ని పొందారు. అదే మార్క్సిజం – లెనినిజం. యుగప్రాయమైనది అనదగిన కమ్యూనిస్టు పార్టీ స్థాపన చైనాలో జరిగింది. సన్‌యట్‌సేన్ కూడా "రష్యా నుండి నేర్చుకుందాం", "రష్యాతోనూ అప్పటినుండి చైనా తన దిశను మార్చుకుంది.

సామ్రాజ్యవాద ప్రభుత్వ ప్రతినిధిగా అచెసన్ సహజంగానే సామ్రాజ్యవాదాన్ని గురించి ఒక మాట కూడా మాటలాడడానికి ఇష్టపడదు. సామ్రాజ్యవాద దురాక్రమణను గురించి "విదేశీయులు దూకుడుతనాన్ని తీసుకొచ్చారు..." అని వర్ణిస్తాడు. "దూకుడు" ఆహా! ఎంత అందమైన పేరు! ఈ దూకుడుతనాన్ని అర్థం చేసుకొని చైనీయులు బ్రిటన్ మీదకో, అమెరికా మీదకో దూకుడుగా పోలేదు. కేవలం చైనా లోపల అశాంతిని, అలజడిని సృష్టించుకున్నారు. అంటే సామ్రాజ్యవాదము, దాని వేట కుక్కలకు వ్యతిరేకంగా విప్లవాలు నడిపారు. అయితే దురదృష్టంకొద్దీ ఒక మారు కూడా విజయవంతం కాలేకపోయారు. దూకుడుతనాన్ని కనిపెట్టిన సామ్రాజ్యవాదులే ప్రతిసారి గెలిచారు. అందువల్ల చైనీయులు ఇతరత్రా మార్గాల కోసం వెతకగా ఆశ్చర్యకరంగా వారు వెంటనే కనుక్కోగలిగారు.

"రష్యన్ విప్లవం సైద్ధాంతిక ప్రేరణతో 1920 దశాబ్దం తొలి సంవత్సరాలలో చైనా కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం జరిగింది. ఈ విషయంలో మాత్రం అచెసన్ నిర్ధారణ సరైనదే. ఈ సిద్ధాంతం మార్క్సిజం–లెనినిజం తప్ప వేరు కాదు." ఇంతకు మునుపటి విదేశీ చొరబాటుదారులు తమతో తీసుకురాని "ఉన్నత స్థాయి సంస్కృతి" అని అచెసన్ ప్రస్తావించే పాశ్చాత్య బూర్జువావర్గ భావజాలం కంటే ఇది అంచనా వేయలేనంత ఉన్నతమైనది. ఈ భావజాలం యొక్క సామర్థ్యానికి తిరుగులేని రుజువు ఏమిటంటే భూస్వామ్య సంస్కృతి కంటే "ఉన్నతస్థాయి సంస్కృతి" అంటూ గొప్పలు పోయే అచెసన్ సంస్కృతి మార్క్సిస్టు–లెనినిస్టు సంస్కృతిలో కలబడగానే అది అపజయం పాలైంది.

చైనీయులు ఈ శాస్త్రీయ విప్లవకర నూతన సంస్కృతిని అందుకున్న తరువాత మొదటి యుద్ధంలో సామ్రాజ్యవాదపు వేటకుక్కలయిన ఉత్తరాది యుద్ధ ప్రభువులను ఓడించారు. రెండవ యుద్ధంలో సామ్రాజ్యవాదుల వేటకుక్క అయిన చాంగ్ కై షేక్, చైనా ఎర్రసైన్యం చేసిన 12,500 కిలోమీటర్ల దీర్ఘ ప్రస్థానాన్ని[6] (Long March) అడ్డగింపడానికి చేసిన ప్రయత్నాన్ని ఓడించారు. మూడవ యుద్ధంలో జపాన్ సామ్రాజ్యవాదాన్ని దాని వేటకుక్క వాంగ్ చింగ్ లీ ని ఓడించారు. ఇక నాల్గవసారి చైనాపై పెత్తనం చేసిన అమెరికా ఇతర సామ్రాజ్యవాద శక్తులు, వారి వేటకుక్కలయిన చాంగ్ కై షేక్ ఇతర ప్రతీప శక్తుల పరిపాలనను నిర్మూలించారు.

మార్క్సిజం – లెనినిజం చైనాలో ప్రవేశించిన కాలం నుండి అది అంత గొప్ప పాత్ర నిర్వహించడానికి కారణం చైనా సామాజిక పరిస్థితులు దాని అవసరాన్ని కలిగి వుండడం, అది చైనా ప్రజల వాస్తవ విప్లవ కార్యాచరణతో ముడిపడి వుండడం మరియు చైనా ప్రజలు దానిపై పట్టు కలిగి వుండడం. ఏ భావజాల మైనా–అత్యుత్తమమైనది కూడా, మార్క్సిజం –లెనినిజం అయినా సరే – అది వస్తుగత వాస్తవికతలతో అనుసంధించకపోతే, వాస్తవ అవసరాలను తీర్చకపోతే, జనసామాన్యం దానిని అర్థం చేసుకోలేకపోతే అది నిష్ప్రయోజనకర మవుతుంది. మనం చారిత్రక భావవాదులను వ్యతిరేకించే చారిత్రక భౌతికవాదులం.

అనుకోని విధంగా "సోవియట్ సిద్ధాంతము, ఆచరణ ప్రత్యేకించి ఆర్థిక విధానాలు, పార్టీ నిర్మాణ విధానాల్లో డా॥ సన్‌యట్ సేన్ ఆలోచనలు సూత్రాలపై గణనీయమైన ప్రభావం కలిగి వుండేవి". అచెసన్ ఇంకా అలాంటి వారు గర్వంగా చెప్పుకొనే "పాశ్చాత్యుల ఉన్నతస్థాయి సంస్కృతి" డా॥సేన్ పై ఎలాంటి ప్రభావం చూపింది? అచెసన్ దాని గురించి ఏమీ పలకడం లేదు. డా॥ సేన్ తన జీవితంలో అధిక భాగాన్ని తన దేశాన్ని కాపాడుకోవడానికి అవసరమైన సత్యం ఏదైనా వుండేమోనని బూర్జువా సంస్కృతిలో వెదకడానికి వెచ్చించి, చివరికి నిరాశ చెంది "రష్యా నుండి నేర్చుకోవ డానికి" సిద్ధమయ్యాడన్నది యాదృచ్ఛికంగా జరిగిందేనా? కాదు అన్నదే స్పష్టమైన సమాధానం. అయితే డా॥సేన్ మరియు ఆయన ప్రాతినిధ్యం వహించిన సుదీర్ఘకాలం బాధలను అనుభవించిన చైనా ప్రజలు అందరూ పాశ్చాత్య తాకిడి పట్ల కోపోద్రిక్తులై, సామ్రాజ్యవాదము దాని వేటకుక్కలపై ప్రాణాలకు తెగించి పోరాడడానికి "రష్యాతో, కమ్యూనిస్టు పార్టీతో కూటమి కట్టడానికి" నిర్ణయించుకున్నారు. ఈ విషయమై, సోవియట్ ప్రజలు సామ్రాజ్యవాద దురాక్రమణదారులని, వారి నుండి సన్‌యట్ సేన్ నేర్చుకున్నాడని చెప్పడానికి అచెసన్ బరితెగించలేదు. అయితే, మరి డా॥ సన్‌యట్ సేన్ సోవియట్ ప్రజల నుండి నేర్చుకోగలిగి నప్పుడు, సోవియట్ ప్రజలు సామ్రాజ్యవాద దురాక్రమణదారులు కానప్పుడు ఆయన వారసులు, అంటే ఆయన తరవాతి చైనీయులు సోవియట్ ప్రజల నుండి ఎందుకు నేర్చుకో గూడదు? చైనీయులు మార్క్సిజం–లెనినిజం ద్వారా శాస్త్రీయ ప్రాపంచిక దృక్పథాన్ని, సామాజిక విప్లవ సిద్ధాంతాన్ని నేర్చుకొని వాటిని చైనా నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించి చైనా విముక్తి ప్రజా యుద్ధాన్ని, గొప్ప ప్రజా విప్లవాన్ని చేపట్టి జనతా ప్రజాతంత్ర నియంతృత్వం గల రిపబ్లిక్‌ను స్థాపించినందుకేనా, సన్‌యట్‌సేన్ "కొమింటర్న్ యొక్క రహస్యా ముఠా" అని, "ఎర్ర సామ్రాజ్యవాదం తొత్తులు" అని పేర్లు అంటగడతా వున్నారు. ఇటువంటి గొప్ప తర్కం ప్రపంచంలో వేరెక్కడయినా వుంటుందా? మార్క్సిజం–లెనినిజం నేర్చుకున్నందువల్లనే చైనా ప్రజలు నిష్క్రియాపరత్వం నుండి బయటపడి చొరవను ప్రదర్శించగలిగారు. ఆధునిక ప్రపంచ

> మార్క్సిజం-లెనినిజం చైనాలో ప్రవేశించిన కాలం నుండి అది అంత గొప్ప పాత్ర నిర్వహించడానికి కారణం చైనా సామాజిక పరిస్థితులు దాని అవసరాన్ని కలిగి వుండడం, అది చైనా ప్రజల వాస్తవ విప్లవ కార్యాచరణతో ముడిపడి వుండడం మరియు చైనా ప్రజలు దానిపై పట్టు కలిగి వుండడం. ఏ భావజాల మైనా-అత్యుత్తమమైనది కూడా, మార్క్సిజం -లెనినిజం అయినా సరే - అది వస్తుగత వాస్తవికతలతో అనుసంధించకపోతే, వాస్తవ అవసరాలను తీర్చకపోతే, జనసామాన్యం దానిని అర్థం చేసుకోలేకపోతే అది నిష్ప్రయోజనకర మవుతుంది. మనం చారిత్రక భావవాదులను వ్యతిరేకించే చారిత్రక భౌతికవాదులం.

చరిత్ర కాలంలో చైనీయులను, చైనా సంస్కృతిని హీనంగా చూడబడిన దశ అంతటితో అంతమైంది.

మహత్తరమైన విజయవంతమైన చైనా ప్రజల విముక్తి యుద్ధం మరియు గొప్ప ప్రజావిప్లవం చైనా ప్రజల గొప్ప సంస్కృతిని పునరుజ్జీవింపజేశాయి, ఇంకా చేస్తున్నాయి. ఈ చైనా ప్రజా సంస్కృతి దాని ఆత్మిక సంపత్తిలో పెట్టుబడిదారీ ప్రపంచంలోని ఏ సంస్కృతి కంటే కూడా సమున్నతంగా నిల్చొని వుంది. ఉదాహరణకు అమెరికా స్టేట్ సెక్రెటరీ అయిన అచెసన్‌ను, ఇంకా అలాంటి వాళ్ళను పరిశీలింపవచ్చు. ఆధునిక చైనా గురించి, ఆధునిక ప్రపంచం గురించి వారి జ్ఞానం చైనా విముక్తి సైన్యంలోని సాధారణ సైనికుని కంటే కూడా తక్కువగా వుంది.

బూర్జువా ప్రొఫెసర్ విసుగెత్తించే పాఠాన్ని బోధించే మాదిరి ఇప్పటి వరకు చైనాలో జరిగిన ఘటనల కారణాలను, ప్రభావాలను వెతికే వాడిగా అచెసన్ నటిస్తూ వచ్చాడు. ఆయన ప్రకారం ప్రథమంగా అధిక జనాభా వల్ల, తరువాత పాశ్చాత్య భావాల ప్రేరణ వల్ల చైనాలో విప్లవం జరిగింది. అంటే ఆయన కార్యకారణ సంబంధ సిద్ధాంతకర్తగా కనిపిస్తున్నాడు. అయితే ఆ తరవాత క్రమంలో ఈ చిన్నపాటి, విసుగెత్తించే కపట కార్యకారణ సిద్ధాంతం కూడా కనుమరుగై వివరింప వీలుకాని ఘటనల సమాహారం మాత్రం మిగులుతుంది. ఆయన ప్రకారం చైనీయులు అర్థం కాని విధంగా అధికారం కోసం, సంపద కోసం పరస్పరం అనుమానంతోనూ, ద్వేషంతోనూ తమలో తాము కలహించు కున్నారు. పోటీ బడుతున్న రెండు పార్టీలు అంటే కొమింటాంగ్, కమ్యూనిస్టు పార్టీల నైతిక స్థైర్యంలో అంతుచిక్కని మార్పు సంభవించింది. ఒక పార్టీ మనోబలం సున్నా కంటే దిగువకు నిశిత వేగంతో జారిపోయింది. ఇంకొక పార్టీ మనోబలం నిశిత వేగంతో తెల్లగా వేడెక్కి ఎగిసింది. కారణమేమిటి? ఎవరికీ తెలియదు అని అంటాడు అచెసన్. అదీ అమెరికా పీఠాధిపతి అయిన అచెసన్ ప్రాతినిధ్యం వహించే "ఉన్నతస్థాయి సంస్కృతి"లో భాసించే తర్కం!

**నోట్సు :**

[1] ఉత్తర అమెరికా వారు బ్రిటిష్ వలసపాలనను వ్యతిరేకిస్తూ జరిపిన స్వాతంత్ర్య యుద్ధం అనబడే 1776-83 బూర్జువా విప్లవం.

[2] మంగోలియన్ ప్రజా విప్లవ పార్టీ నాయకత్వంలో 1921-24లో మంగోల్ ప్రజలు తమ విముక్తి పోరాటంలో జపాన్ సామ్రాజ్యవాదుల దన్నుగా వుండిన వైట్‌గార్డ్ బందిపోటు సైన్యాన్ని మరియు చైనా ఉత్తరాది యుద్ధ ప్రభువులను పారదోలి, మంగోలియా భూస్వామ్యాన్ని కూలదోసి మంగోలియన్ ప్రజా రిపబ్లిక్‌ను స్థాపించుకున్నారు.

[3] టి.ఆర్.మాల్థస్ (1776-1834) ఆంగ్లికన్ మతాచార్యుడు, ప్రగతి నిరోధక అర్థ శాస్త్రవేత్త.తన రచన "Essay on Population" (1798)లో ఇలా రాసాడు: "జనాభాను నియంత్రించకపోతే అది... 2, 4, 8,16... నిష్పత్తిలో భారీగా పెరుగుతుంది... అయితే జీవన పోషకాలు... 1,2,3,4,5.... నిష్పత్తికి మించి పెరగవు. ఈ నిర్హేతుక ఊహ ఆధారంగా మానవ సమాజంలోని పేదరికం, చెడులు శాశ్వత విషయాలుగా వుంటాయన్న నిర్ధారణ చేసాడు. ఆయన ప్రకారం శ్రామిక జనుల పేదరికం సమస్యను పరిష్కరించగల ఏకైక మార్గం వారి ఆయుస్సును తగ్గించడం, జనాభాను తగ్గించడం. లేదా దాని పెరుగుదలను నిరోధించడం మాత్రమే. కరువు కాటకాలు, యుద్ధాలు జనాభాను తగ్గించే సాధనాలుగా ఆయన పరిగణించాడు.

[4] తైపింగ్ స్వర్గ రాజ్య యుద్ధం (The War of the Taiping Heavenly Kingdom) 19వ శతాబ్దం మధ్య భాగంలో చింగ్ రాచరికం సాగించిన భూస్వామ్య పరిపాలన, జాతి అణచివేతలకు వ్యతిరేకంగా జరిగిన రైతాంగ విప్లవ యుద్ధం. Hung Hsiu-chuan, Yang Hsiu-Ching తదితర ఈ విప్లవ యోధులు 1851 జనవరిలో Kwangsiలో తిరుగుబాటు జరిపారు. తైపింగ్ స్వర్గరాజ్యము స్థాపించినట్లు ప్రకటించారు. 1852లో రైతాంగ సైన్యం Kwangshi నుండి ఉత్తర దిశగా Hunan, Hupeh, Kiangsi మరియు Anhwei గుండా కదంతొక్కి 1853లో యాంగ్సీ నది దిగువ భాగం ఉత్తరంగా మరింత ముందుకెళ్ళి ఉత్తర చైనాలో ఒక ప్రధాన నగరమైన Nanking దగ్గరికి చేరుకుంది. తైపింగ్ సైన్యం తాము వశం చేసుకున్న ప్రాంతాల్లో పునాది స్థావరాలను నిర్మించకపోవడం వల్ల, నాన్‌కింగ్‌లో రాజధానిని ఏర్పరచిన తరవాత, సైన్య నాయకత్వం చేసిన అనేక సైనిక, రాజకీయ తప్పుల వల్ల అది చింగ్ రాజ్య సైన్యాల, దురాక్రమించిన బ్రిటన్, అమెరికా, ఫ్రాన్స్ సైన్యాల ప్రతీఘాత దాడిని ఎదుర్కొనలేక 1864లో పరాజితమైంది.

[5] "కమ్యూనిస్టు ప్రణాళిక" మొదటి అధ్యాయాన్ని (బూర్జువాలు మరియు కార్మికులు) చూడండి. బూర్జువావర్గం "నిర్బంధం వల్ల సకల జాతులూ, మరణమే మార్గాంతరం గనుక, బూర్జువా ఉత్పత్తి విధానాన్ని అనుసరిస్తాయి. దాని నిర్బంధం వల్ల అది దేన్ని నాగరికత అంటుందో దాన్ని సకల జాతులు స్వీకరిస్తాయి - అనగా తామే బూర్జువా జాతులు అవుతాయి. ఒక్కమాటలో చెప్పాలంటే బూర్జువావర్గం తన్నుబోలిన ప్రపంచాన్ని సృష్టిస్తుంది."

[6] 1934లో చైనా కార్మిక కర్షక ఎర్రసైన్యం యొక్క మొదటి, రెండవ, ఐదవ సైనిక దళాలు పశ్చిమ Fukienలోని Changting మరియు Ninghua నుండి, మరియు దక్షిణ Kiangsiలోని Juichin, యుటు మరికొన్ని ప్రదేశాల నుండి ఒక పెద్ద వ్యూహాత్మక ప్రస్థానాన్ని ప్రారంభించినాయి. Fukien, Kiangsi, Kwengtung, Hunan, Kwangsi, Kweichow, Szechuan, Yunnan, Sikang, Kansu మరియు Shensi అను 11 ప్రాంతాల గుండా ప్రయాణిస్తూ నిత్యం మంచుతో కప్పబడిన పర్వతాలను, అడుగు జాడలేని పచ్చిక మైదానాలను దాటుకుంటూ, చెప్పలేని కష్టాలను భరిస్తూ మాటిమాటికి ఎదురవుతున్న శత్రువు చుట్టివేతల్ని, తరిమి వేతల్ని, అవరోధాలను, అడ్డుకోవడాల్ని అధిగమించి, శత్రువుని నిరాశపరుస్తూ ఎర్ర సైన్యం 12,500 కిలోమీటర్ల దూరాన్ని నడిచింది. అంతిమంగా 1935 అక్టోబర్‌లో ఉత్తర షెన్సీలోని విప్లవ స్థావర ప్రాంతాన్ని విజయవంతంగా చేరింది.

**(మావో సేటుంగ్ రచనల సంకలనం, 4వ సంపుటి, పేజీ : 451-459)** ★

# జి-20 సమావేశం 'యుద్ధ ముగింపు' గురించి చర్చ

**2022** నవంబర్ 15న ఇండోనేషియాలోని బాలిలో జి-20 దేశాల సదస్సు జరిగింది. జి-20 దేశాల నాయకులు ఈ సదస్సులో కలుసుకొని, ఉక్రెయిన్‌లో యుద్ధం శాంతియుత పద్ధతుల్లో ఆపివేసితీరాలని అభిప్రాయపడ్డారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ ఈ సమావేశాలకు హాజరుకాలేదు.

వీడియో లింక్ ద్వారా జి-20 సదస్సు నుద్దేశించి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రసంగించాడు. 'న్యాయబద్ధంగా మరియు ఐక్యరాజ్యసమితి సూత్రాలు, అంతర్జాతీయ న్యాయాల ప్రాతిపదికపై ఆధారపడి' యుద్ధాన్ని ముగించితీరాలి. 'రష్యా సాగిస్తున్న విధ్వంసక యుద్ధం తప్పనిసరిగా ఆపగలిగే సమయమిది. ఒక్కోరోజు ఆలస్యం, ఉక్రెయిన్ మరణాల్ని పెంచుతోంది; ప్రపంచంముందు నూతన సవాళ్ళను వుంచుతోంది. రష్యా దురాక్రమణ యుద్ధం కొనసాగినందువలన, నష్టాలలో - ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ - భారీ పెరుగుదల నమోదవుతుంది' అని జెలెన్‌స్కీ పేర్కొన్నాడు.

"రష్యాతో చర్చలు జరిపేందుకు ఉక్రెయిన్ నిరాకరిస్తోందని, అంతేగాక శాంతికోసం అవాస్తవికమైన షరతులను ముందు పెడుతోందని" రష్యా విదేశాంగశాఖామంత్రి పేర్కొన్నాడు.

జి-20 సదస్సును ప్రారంభిస్తూ ఇండోనేషియా అధ్యక్షుడు విడోడో ఐక్యత కోసం విజ్ఞప్తి చేశాడు. "మనకు మరో ప్రత్యామ్నాయం లేదు; ప్రపంచాన్ని కాపాడుకోవాలంటే కలసికట్టుగా వుండటం అవసరమన"ని ఆయన పేర్కొన్నాడు.

"ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న అనాగరిక యుద్ధం మరియు అణుబాంబుల గురించి రష్యా చేసిన బాధ్యతారహితమైన హెచ్చరిక"లను అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఈ సదస్సులో లేవనెత్తుటంతోపాటుగా, "చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పేర్కొన్న 'అణ్వాయుధాలతో తలపడి ఎవరూ విజయం సాధించలేర'నే తమ ఒప్పందాన్ని పునరుద్ఘాటించటంతోపాటు అణ్వాయుధాలు వుపయోగించటం పట్ల తమ వ్యతిరేకతను వ్యక్తం చేస్తూ ఉక్రెయిన్‌లో అణ్వాయుధాలను ఉపయోగించటాన్ని తక్కువగా అంచనా వేయవద్దని" బైడెన్ పేర్కొన్నాడు.

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ జి-20 సదస్సు నుద్దేశించి చేసిన ప్రసంగంలో ఉక్రెయిన్ యుద్ధాన్ని గురించి సూటిగా పేర్కొనకుండా ప్రపంచ "సంఘీభావం" పెరుగుదలకు ఆయన పిలుపునిచ్చాడు. 'మానవజాతి భవితవ్యపు భాగస్వామ్య భావన, శాంతి బోధన, అభివృద్ధి, పరస్పర సహకారంతో అన్ని దేశాలు సామూహిక దృక్పథాన్ని ఏర్పరచుకోవటం అనివార్యమ'ని ఆయన పేర్కొన్నాడు. విబేధాలు, సంఘర్షణలు ఏ ఒక్కరి ప్రయోజనాన్నీ కాపాడలేవన్నారు. కేవలం ఉమ్మడి అభివృద్ధి, సంఘీభావాలే సరైన ప్రత్యామ్నాయాలుగా చేసుకోవాలని ఆయన కోరారు.

యుద్ధానికి ముగింపు పలకటానికి దౌత్య సంభాషణలను తిరిగి ప్రారంభించాలని జి-20 నాయకులకు భారత ప్రధాని మోడీ విజ్ఞప్తి చేశాడు. "ఉక్రెయిన్‌లో కాల్పుల విరమణ, దౌత్య సంభాషణల విధానానికి తిరిగి వెళ్ళే మార్గాన్ని మనం కనుగొనాలి" అని జి-20 సదస్సు ప్రారంభ వాక్యాలలో మోడీ పేర్కొన్నాడు. 'ప్రపంచంలో శాంతి, కలసిమెలసి జీవించటం, భద్రతలకు హామీ కల్పించేవిధంగా నిర్దిష్టమైన, సామూహిక పరిష్కారాన్ని చూపడమే నేటి తక్షణ కర్తవ్యమ'ని మోడీ ఉద్బోధించాడు.

ఒకవైపున సదస్సు జరుగుతూండగానే, పోలెండ్ సరిహద్దుల వద్ద రష్యా 75 క్షిపణులను మోహరించిందని, ఈ క్రమంలో క్షిపణి దాడిలో ఇద్దరు పోలెండ్ పౌరులు మరణించారనే ఆరోపణలు ముందుకొచ్చాయి. నాటో మరియు జి-7 నాయకులతో బాలిలోనే బైడెన్ అత్యవసర సమావేశాన్ని నిర్వహించి, రష్యా చర్యలను ఖండించాడు. "నాటో కూటమికి చెందిన పోలెండ్ నుండి రష్యా ప్రయోగించిన ఒక క్షిపణి కారణంగా ఇద్దరు మరణించారనటం 'ప్రతికూలమైనది'గా బైడెన్ పేర్కొన్నాడు. తర్వాత, ఉక్రెయిన్ నుండే క్షిపణి ప్రయోగం జరిగిందని, ఆ క్షిపణి ఆ దేశానికి చెందినదేనని పోలెండ్ అధికారవర్గాలు ధృవీకరించాయి. అయితే పోలెండ్ చేసిన ప్రకటనను ఉక్రెయిన్ ప్రభుత్వం తిరస్కరించింది.

2022 జూన్‌లో జరిగిన జి-7 దేశాల సదస్సులో ఆయా దేశాల నాయకులు ఒక సంయుక్త ప్రకటన చేస్తూ "తాము ఉక్రెయిన్‌కు ఆర్థికపరమైన, మానవతాపరమైన, దౌత్యపరమైన సహాయ సహకారాలను సమకూర్చటాన్ని కొనసాగిస్తామని" ప్రకటించారు. జి-7 సదస్సు అలాగే జి-20 సదస్సుల నుండి మనకు అర్థమయ్యేదేమంటే ఐక్యరాజ్యసమితి జోక్యంతో యుద్ధాన్ని నిలువరించే మార్గాన్ని కనుగొనేందుకు జి-7, నాటో దేశాలు సిద్ధంగా లేవని తెలుస్తోంది.

2022 ప్రారంభంలో జరిగిన 'బ్రిక్స్' సదస్సులో 'బ్రిక్స్' దేశాలు ఉక్రెయిన్ యుద్ధంపై బీజింగ్ ప్రకటనకు ఆమోదం తెలిపాయి. ఆ ప్రకటన ప్రకారం, ఐక్యరాజ్యసమితి ప్రయత్నాలు చేసి ఉక్రెయిన్, రష్యాల నడుమ చర్చల్ని పునరుద్ధరించటానికి మద్దతుగా నిలవాలి. అలాగే ఉక్రెయిన్‌లోను, ఆ పరిసరాల్లోనూ మానవ హననానికి సంబంధించిన పరిస్థితిపట్ల వారంతా బాధ్యతతో స్పందించారు. రెండు దేశాల నడుమ ఎట్టి పరిస్థితుల్లోనూ శాంతియుత ఒప్పందంతో యుద్ధం ముగియాలని, రష్యాపై ఆంక్షలు యుద్ధ సమస్యకు పరిష్కారంకాదని, దాని దుష్ఫలితాలతో ప్రపంచవ్యాపితంగా ఇంధనం, ఎరువుల కొరత ఏర్పడుతుందని జి-20 సదస్సులోని 'బ్రిక్స్' దేశాలు తమ అభిప్రాయాల్ని వ్యక్తం చేశాయి. ఇంధనం, ఎరువుల తయారీ, ఎగుమతిదారులతో రష్యా ప్రపంచంలో అగ్రభాగాన వుంది. అలాగే ఉక్రెయిన్, ప్రపంచంలోని ఉన్నతస్థాయి ఆహార ఉత్పత్తిదారులలో ఒకటిగా వుంది.

ఉక్రెయిన్ యుద్ధంపై జి-7, నాటో, బ్రిక్స్ దేశాల ఈ ప్రకటనల ద్వారా యుద్ధాన్ని ఆపటానికి ప్రయత్నించే బదులుగా తమ దుష్ట కోర్కెలను నెరవేర్చుకునేందుకు ఉక్రెయిన్‌ను జి-7 మరియు నాటో దేశాలు మరింతగా రెచ్చగొడుతున్నాయని అర్థమౌతోంది. 'బ్రిక్స్' దేశాలు శాంతిని ప్రబోధిస్తూనే, ఏ పక్షంవైపు మొగ్గకుండా రెండువైపులా తమ అవసరాల్ని నెరవేర్చుకునేందుకు చూస్తున్నాయి. ఈ యుద్ధం కారణంగా అంతిమంగా ప్రజలే తీవ్ర బాధితులని స్పష్టమౌతోంది.

రానున్న 18వ జి-20 సదస్సుకు భారతదేశం ఆతిధ్యమివ్వనుంది. ఇండియా యొక్క అధ్యక్ష పదవి 2022 డిసెంబర్ 1 నుండి ప్రారంభమై 2023 చివరి త్రైమాసికంలో జరిగే సదస్సు వరకు కొనసాగుతుంది. ✶

## సంస్మరించుకుందాం

# ఉపాధ్యాయ ఉద్యమ సీనియర్ నాయకులు కా॥ పరమేశ్వరరావుకు జోహార్లు



**నిబద్ధ** కమ్యూనిస్టు విప్లవకారుడు, ఉపాధ్యాయ ఉద్యమ సీనియర్ నాయకులు కా॥ నూతలపాటి పరమేశ్వరరావు మొదటి వర్ధంతి (11-1-2023) సందర్భంగా ఆ కామ్రేడ్‌కు విప్లవ జోహార్లర్పిద్దాం.

కా॥ పరమేశ్వరరావు యువకునిగా వున్న కాలం నుండే గుంటూరుజిల్లా - నిమ్మగడ్డవారిపాలెంలో వారి సోదరునితో కలసి కమ్యూనిస్టు పార్టీ రాజకీయాలు స్వీకరించి చురుకైన పాత్ర నిర్వహించారు. విజయవాడ వచ్చిన తర్వాత ప్రధానంగా ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాణంలో ఆరు దశాబ్దాల కాలం ఆయన తన శక్తి సామర్ధ్యాలను వెచ్చించారు. మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానాన్ని తన ప్రాపంచిక దృక్పథంగా స్వీకరించిన కా॥ పరమేశ్వరరావు, పార్టీ ఉద్యమ పత్రికలకు ఎనలేని సేవలందించారు. ఉద్యమ అవసరాన్ని అందుకున్న నిబద్ధ గుణంతో కడదాకా నిశ్శబ్ద కృషి సాగించారు. నిర్మాణ క్రమశిక్షణ, సమయపాలన, నిరాడంబరత్వం, నిజాయితీ, వినయశీలత, పెడధోరణులపై పోరాడే సునిశితత్వం, ఎనభై సం॥ల వయస్సులోనూ నిరంతర అధ్యయనం, నిర్మాణ దృష్టితోపాటు కామ్రేడ్స్ కుటుంబాలన్నింటినీ పరామర్శించేతత్వం వంటి ఎన్నో విలువైన, విశిష్టమైన, ఆదర్శనీయమైన లక్షణాలను పుణికిపుచ్చుకున్న కా॥ పరమేశ్వరరావు ఆశయాలను ముందుకు గొనిపోదాం. కా॥ పరమేశ్వరరావుకు విప్లవ జోహార్లు.

## జర్మనీ

# రోజురోజుకూ పెరిగిపోతున్న తీవ్ర అభివృద్ధి నిరోధక మితవాదం

**ఒకనాడు** ప్రపంచమంతటికీ ముప్పుగా, ప్రపంచ ప్రజానీకానికి శాపంగా పరిణమించిన జర్మనీ నాజీ ముష్కర హంతకుల, తీవ్ర అభివృద్ధి నిరోధక మితవాద రాజకీయ భావాలు, అభిప్రాయాలు తిరిగి జర్మనీలో తలెత్తుతున్నాయి. అతి మితవాద గ్రూపులు రాజకీయంగా బలాన్ని పుంజుకొంటున్నాయి. అతి మితవాద రాజకీయ పార్టీగా వున్న ఆల్టర్‌నేటివ్ ఫర్ జర్మనీ అనే రాజకీయ పార్టీ 2013 ఎన్నికలలో కేవలం 5% ఓట్లనే తెచ్చుకోగా క్రిందటి సంవత్సరం బుందర్ స్టాగ్‌కు జరిగిన ఎన్నికలలో 83 సీట్లు సంపాదించ గలిగింది. ఈ అతి మితవాద పార్టీ ప్రజల్లో ఏ రకంగా ప్రభావం సంపాదించుకొంటున్నదో చెప్పటానికి యిది ఒక సూచికగా వుంది.

మరోవైపు యీ తీవ్ర మితవాద శక్తులు జరుపుతున్న హింసాత్మక ఘటనలు కూడా పెరుగుతున్నాయి. 2019లో యీ శక్తులు, మధ్య - వామపక్ష స్థానిక రాజకీయనేత ఒకర్ని పశ్చిమ జర్మనీలో చంపివేశాయి. తూర్పు జర్మనీలోని హాల్లేలో ఒక సైనగాగ్ (యూదుల ప్రార్థనా మందిరం)పై దాడి జరిపి, యిద్దరిని చంపివేశాయి. గత సంవత్సరం, జర్మనీ ప్రభుత్వం తమ కమేండో స్పెజియల్ కరాఫే అనే సైనిక విభాగంలోకి తీవ్రవాదులు చొరబడ్డారు అనే కారణంచేత, ఆ దళాన్ని పాక్షికంగా రద్దుచేసింది.

జర్మనీలో పనిచేసే రీచ్‌బర్గర్ లేదా సిటిజన్స్ ఆఫ్ రీచ్ అన్న తీవ్ర అతి మితవాద గ్రూపు, యుద్ధానంతర జర్మన్ రాజ్యాన్ని గుర్తించదు. అది అమెరికాలోని అతి మితవాద సమూహం అయిన క్యూ-ఏనన్ అనే గ్రూపు ప్రచారం చేసే, కుట్ర సిద్ధాంతాలతో ప్రేరేపితమైంది. జర్మనీలోని యూదు వ్యతిరేక తీవ్రవాద గ్రూపులన్నీ ఏకమై, సైనిక తిరుగుబాటు జరిపి ప్రభుత్వాన్ని వశపరచుకొనే యత్నంలో వున్నారని జర్మన్ ప్రభుత్వం భావిస్తోంది.

డిసెంబరు 7వ తేదీన జర్మన్ ప్రభుత్వం, అధికారంలో వున్న ఒక న్యాయమూర్తిని, ఒక మాజీ సైనిక అధికారినీ, ఒక మాజీ పోలీసు అధికారితోపాటు మరో 25 మంది వ్యక్తులను తీవ్రవాదులుగా అరెస్టు చేసింది. ఇలా అరెస్టుకాబడిన న్యాయమూర్తి బ్రైట్ ఎమ్. డబ్ల్యు, ఆల్టర్‌నేటివ్ ఫర్ జర్మనీ పార్టీకి చెందిన చట్ట నిర్మాత. అరెస్టయిన మాజీ సైనిక (పారాట్రూప్స్) కమేండర్ అయిన హెన్రిక్-XIII, ప్రిన్స్ రూస్, యూదు వ్యతిరేక నినాదాలు యిచ్చేవారి రింగ్ లీడర్. అతడు ఆధునిక జర్మన్ రిపబ్లిక్‌ను ఒకనాడు 'భ్రమ' అని పేర్కొన్నవాడు. అతడు సమాజంలో యూదు-వ్యతిరేక తీవ్రవాదాన్ని ప్రచారం చేస్తూ, ఒకనాటి జర్మన్ సామ్రాజ్యాన్ని కలగంటూ, కుట్ర సిద్ధాంతాలను ప్రచారం చేస్తూ, సాయుధంగా ప్రస్తుత జర్మన్ ప్రభుత్వాన్ని కూల్చాలనే సిద్ధాంతం కలవాడు.

ప్రపంచీకరణ అనంతర పరిణామంగా ప్రపంచమంతటా యీ తీవ్ర, అతి మితవాద రాజకీయాలు తలెత్తుతున్న దానిలో భాగంగానే, నేడు జర్మనీ దేశంలో కూడా, యీ తీవ్రవాద, అభివృద్ధి నిరోధక రాజకీయ బృందాలు రోజురోజుకూ బలం పుంజుకుంటూ, సమీప భవిష్యత్తులో ప్రపంచ ప్రజానీకానికి ప్రమాదకరంగా పరిణమించబోతున్నాయన్నదానికి, జర్మనీలోని తీవ్ర, అతి మితవాదుల అరెస్టులు ఒక సూచికగా వున్నాయి!

(హిందూ పత్రిక సంపాదకీయం ఆధారంగా)





సిపిఐ(ఎం.ఎల్) ప్రచురణ

**విప్లవ మేధోసైనికుడు**
**కామ్రేడ్ జశ్వంతరావు**

పేజీలు : 192 విరాళం : రు. 100/-

కాపీలకు :

**మైత్రీబుక్‌హౌస్**
జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2

# మతపరమైన సామాజిక శతృత్వ భావమున్న దేశాల్లో మన దేశానిదే అగ్రస్థానం

**ప్యూ** పరిశోధనాకేంద్రం, ఇండియావారు 2007 నుండి తమ 13వ ఎడిషన్ సర్వేను 2020 వరకూ నిర్వహించారు. వారు 198 దేశాల్లో యిటువంటి సర్వేను నిర్వహించి, ఆయా దేశాలలోని, సమాజాల్లోని ప్రజల మధ్య మతపరమైన శతృత్వభావం (యితర మతస్థుల పట్ల శతృత్వభావం) ఏ మేరకు వుందోనన్న విషయాన్ని అంచనా వేశారు. 2007 సంవత్సరంలో ఆయా దేశాలలో వున్న ప్రజల్లో గల శతృత్వభావం ప్రాతిపదికగా, 2019 మరియు 2020 సంవత్సరాల నాటికి ఆ మత శతృత్వభావం ఏ స్థాయికి పెరిగింది లేదా ఏ స్థాయికి తగ్గింది అని అంచనా వేశారు. వారు సర్వే చేసిన 198 దేశాలలోనూ, సమాజంలో మతపరమైన శతృత్వం అత్యధికంగా వున్న దేశంగా మన దేశం వెల్లడయింది. 2007 నాటి మతసంబంధమైన విషయంలో సమాజంలో గల శతృత్వభావం 2019 నాటికి పెరిగి, 2020 నాటికి మరింతగా అధికమైంది.

13 అంశాల ఆధారంగా చేసిన యీ సర్వేలో మొత్తం పది మార్కులు వుంటే, భారతదేశానికి 2007లో 8.8 మార్కులు వస్తే, 2019 నాటికి అవి 9.1కి పెరగగా 2020 నాటికి 9.4 మార్కులకు పెరిగింది. అంటే క్రమక్రమంగా మన సమాజంలో మతపరమైన శతృత్వభావనలు పెరిగిపోతున్నాయని అర్థం. ఒక సెక్యులర్ (మతప్రసక్తి లేని రాజ్యం) రాజ్యంగా వుండవలసిన భారతదేశంలో మతసంబంధ సామాజిక శతృత్వ భావనలు క్రమంగా పెరిగిపోతూ వుండటమన్నది, మనదేశం ఎటువైపు పోతోందో తెలుపుతుంది. ఇందుకు కారణం దేశంలో ప్రభుత్వాధికారంలో వున్న బి.జె.పి, దాని సైద్ధాంతిక మార్గదర్శక సంస్థలైన ఆర్.ఎస్.ఎస్., భజరంగదళ్ లాంటి హిందూ మతతత్వవాద సంస్థలేనన్నది నిర్వివాదమైన అంశం. ఈ సంస్థలు, వీటి అనుబంధ సంస్థలు ఏవిధంగా హిందూమతతత్వ విద్వేషాలను దేశమంతటా అనునిత్యం రెచ్చగొడుతున్నాయో, మత విద్వేష అల్లర్లకు పాల్పడుతున్నాయో, ఎటువంటి అదుపూ లేని ఘోర కృత్యాలు సాగిస్తున్నాయో, మత సఖ్యతతో జీవిస్తున్న వివిధ మతాల ప్రజల మధ్య మత విద్వేష భావాలను రెచ్చగొట్టి, ఐక్యం కాకుండా ఎంతగా విభజిస్తున్నాయో, యీ హిందూత్వవాద సంస్థల ప్రతీచర్యనూ ప్రభుత్వాధికారంలో వున్న బి.జె.పి. పాలకులు సమర్థించటమేకాక, హిందుత్వవాద అభివృద్ధి నిరోధక భావాలకు అనుగుణమైన చట్టాలను ఏవిధంగా తయారుచేస్తున్నాయో మనం నిత్యం గమనిస్తూనే వున్నాం. ఇటువంటి మత విద్వేష భావాలను ప్రజల్లో రెచ్చగొట్టడం ద్వారా మెజార్టీ హిందువుల ఓట్లను పొందుతూ ప్రభుత్వాధికారానికి చేరుకొంటున్న వైనాన్నీ చూస్తూనే వున్నాం. వీటిని నిరోధించి ప్రజల మధ్య మైత్రి, సయోధ్యలను పెంపుదల చేయవలసిన న్యాయవ్యవస్థ, తదితర పరిపాలనా వ్యవస్థలు ఏవిధంగా విఫలమవుతున్నాయో కూడా మనం చూస్తూనే వున్నాం. ప్రధానంగా ముస్లిం మతస్థులపై ఎక్కుపెట్టబడిన యీ అమానవీయ హిందూమతతత్వవాదుల హేయమైన దాడులను, అత్యాచారాలను గమనిస్తూనే వున్నాం.

ఇటువంటి మతవిద్వేష, శతృత్వ హిందూత్వ విధానాలను సమర్థిస్తూ, ప్రోత్సహిస్తూ బిజెపి పాలకులు రాజ్యాధికారాన్ని కైవసం చేసుకోవటమే కాకుండా, దేశ ప్రజలు తామనుభవిస్తున్న దుర్భర జీవన పరిస్థితులకు గల మూలకారణాలను గురించి ఆలోచించకుండా, వారి ఆలోచనలను అనవసరమైన పరమత వ్యతిరేక భావాలవైపు మళ్ళిస్తూ, తమ పబ్బం గడుపుకుంటున్నారు.

ఈ ప్రమాదాన్ని సూచించేదే యీ "మత సంబంధ విషయాలపట్ల, సామాజిక శతృత్వ భావనల"కు సంబంధించిన సూచిక.

ఈ సర్వే ద్వారా, తయారుచేయబడ్డ సూచికను గమనిస్తే మరో గమనార్హమైన అంశం మన ముందుకొస్తుంది.

ముస్లిం మత దేశంగా వుండి, మన శతృదేశంగా నిరంతరం పాలకులచేత ప్రచారం చేయబడుతున్న పాకిస్తాన్ దేశంలో 2017లో మతశతృత్వ భావాల స్థాయి 8.9 స్థాయిలో వుంటే అది 2019 నాటికి 8.1 తగ్గి, 2020 నాటికి 7.5కు తగ్గిపోయింది.

అదేవిధంగా మరో ఇస్లాం మత దేశమైన ఇరాన్‌లో 2007లో మతపర శతృత్వ భావనలు 6 స్థాయిలో వుంటే, 2019 నాటికి అవి 1.5 స్థాయికి, 2020లో 1.9 స్థాయి మేరకే వున్నాయి. పొరుగు దేశమైన బంగ్లాదేశ్‌లో కూడా 2007లో 8.3 స్థాయిలో వున్న మతపర శతృభావనలు 2020 నాటికి 7 స్థాయికి తగ్గిపోయాయి.

మనదేశంలో మాత్రం సామాజిక మతపర శతృభావనలు నానాటికీ పెరిగిపోతున్నాయి.

సోషల్‌మీడియాలో అబద్ధపు వార్తల ద్వారా, మతపర విద్వేషం రెచ్చగొట్టడం ద్వారా, మూఢమత విద్వేషపు దాడుల ద్వారా హిందుత్వవాద శక్తులు యీ రకంగా దేశంలోని ప్రజల మధ్య మత సామరస్యాన్ని విధ్వంసం చేస్తున్నాయి. ఇది ప్రజాస్వామిక అవగాహన, ఆకాంక్షలకు ప్రమాదకరమైన ధోరణి. గొడ్డలిపెట్టు.

ఇప్పటికైనా యీ ప్రమాదాన్ని గుర్తించి, వివిధ మతాల దేశ ప్రజల మధ్య మతసామరస్యాన్ని, ఐక్యతను పెంపొందించాల్సి వుంది. ఇది సమాజ పురోగామి శక్తుల వలననే సాధ్యమయ్యే పని. మితవాద, అభివృద్ధి నిరోధక, వినాశక శక్తులైన యీ హిందూ మతతత్వవాద శక్తుల నుండి ముంచుకొచ్చిన యీ ప్రమాదాన్ని దేశంలోని పురోగామి శక్తులన్నీ ఐక్యంగా ప్రతిఘటించటం నేటి తక్షణావసరం. ✸





**సిపిఐ(ఎం.ఎల్) ప్రచురణ**

**శ్రామికవర్గ విప్లవ నాయకుడు**
**కామ్రేడ్ మధు**

**పేజీలు : 200** **విరాళం : రు. 100/-**

కాపీలకు : **మైత్రీబుక్‌హౌస్**
**జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్,**
**విజయవాడ-2**

# ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదలకు కారణం ఎవరు?

**2020** నుండీ అన్ని ప్రపంచ దేశాలలోనూ ద్రవ్యోల్బణం ఎక్కువస్థాయిలో వుండి, నిలకడగా వుంటోంది. అదేవిధంగా ధరలు కూడా అనూహ్యంగా విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఫలితంగా అన్ని ప్రపంచ దేశాలలోని సామాన్య ప్రజలు, ఖర్చులు పెరిగిపోయి, ఆదాయాలు చాలక, అవసరాలను కుదించుకొంటూ పడరాని పాట్లు పడుతున్నారు.

ఇలా ఎందుకు జరుగుతోంది? అని ప్రశ్నిస్తే అంతర్జాతీయంగా అన్ని దేశాలలోనూ ద్రవ్యోల్బణము, ధరలు పెరిగిపోతున్నాయి కనుక మన దేశంలోనూ ధరలు పెరిగిపోతున్నాయంటూ, మన పాలకులు సమర్ధించుకొంటున్నారు.

నేడు ప్రపంచమంతటా తమ నయా ఉదారవాద పెట్టుబడిదారీ ఆర్ధిక విధానాలను అవలంబింపచేసిన, సామ్రాజ్యవాద అమెరికా దేశ రాజకీయ నాయకులూ, ఆర్ధికవేత్తలు యీ పెరుగుదలకు ప్రధాన కారణం. కార్మికులు తాము నిలద్రొక్కుకోవటానికి వేతన పెంపు కోసం ఆందోళనలు జరపటం, ఫలితంగా వారి వేతనాలు పెరిగిపోవటం ప్రధాన కారణంగానూ, సరుకులకు డిమాండ్ పెరగటం మరో కారణంగానూ చూపిస్తున్నారు.

ఇందుకు పరిష్కారంగా కేంద్ర బ్యాంకులు వడ్డీరేట్లను పెంచాలనీ, లేబర్ మార్కెట్లో అధిక వేతనాలను యివ్వటాన్ని ఆపివేయాలనీ, అందువలన ఆర్ధికవ్యవస్థలో సమతూకం ఏర్పడు తుందనీ వాదిస్తూ తదనుగుణంగా అమెరికా దేశపు ఫెడరల్ బ్యాంకు వడ్డీరేట్లను పెంచటంతో పాటు, కార్మికుల వేతనాలు పెరగకుండా తగు చర్యలు తీసుకొనేట్లు చేసింది.

సహజంగానే, అమెరికా దేశ ఆర్ధికవ్యవస్థ, ఆర్ధిక విధానాలతో ముడివేసుకున్న మనదేశం లాంటి దేశాలు కూడా మెల్లమెల్లగా అవే విధానాలను అనుసరించి అమలు జరుపుతున్నాయి. అయినా ద్రవ్యోల్బణం, అధిక ధరలు కట్టడి కాకపోగా దినదినం పెరిగిపోతూనే వున్నాయి.

మరొక వాదన ఏమిటంటే, 'ఉద్యోగిత పెరిగితే, కార్మికులకు బేరసారాలాడే శక్తి పెరుగుతుంది' అంటూ అందరినీ నమ్మబలుకుతున్నారు.

అయితే అమెరికా ఫెడరల్ బ్యాంకు అనుసరించే విధానాల వలన - కార్మికులకు ఎక్కువ వేతనాలు యివ్వకుండా నిరోధించటం, దూకుడుగా వడ్డీరేట్లు పెంచుకొంటూ పోవటం వలన, మరొక ప్రపంచ ఆర్థిక మాంద్యం అనివార్యంగా వస్తుంది. అంతేగాక దక్షిణభాగపు ప్రపంచ రాజ్యాల నుండి, యీ వడ్డీ పెంపు వలన పెట్టుబడి వెనక్కి లాక్కోబడుతుంది. ఉదాహరణకు అమెరికా దేశ బ్యాంకుల్లో వడ్డీరేటు పెంచటం వలన, మనదేశం నుండి విదేశీ సంస్థల పెట్టుబడులు (ఎఫ్.ఐ.ఐ.లు) గణనీయమైన మొత్తాలలో వెనక్కు తీసుకోబడి, మనదేశపు ఆర్థికవ్యవస్థపై హానికరమైన ప్రభావాన్ని కలిగించాయి. ఇందువలనే మనదేశంలోని స్టాక్‌మార్కెట్లు పదేపదే కుప్పకూలి పోవటం జరుగుతోంది.

అమెరికా దేశ ఆర్థికవ్యవస్థ డేటాను పరిశీలిస్తే, ద్రవ్యోల్బణానికి, అధిక ధరలకు కారణంగా వారు చెప్పే వాదనలని వెల్లడవుతోంది.

అమెరికా దేశంలో నిరుద్యోగిత తగ్గిపోతూ, ఉద్యోగిత పెరిగినా, ఈ అధిక ద్రవ్యోల్బణ కాలంలో వారి నిజ వేతనాలు పెరగటానికి బదులు తగ్గిపోతున్నాయి. దీనర్ధం కార్మికుల వేతనాలు పెరగటం వలన ద్రవ్యోల్బణం పెరగటంలేదని. అంతేగాక ఉద్యోగిత పెరగటం వలన కార్మికుల బేరసారాలాడే శక్తి పెరుగుతుందన్నది కూడా అబద్ధం. వాస్తవానికి యీ ప్రపంచీకరణ శకంలో, కార్మికుల బేరసారాలాడే శక్తి చాలామేరకు తగ్గిపోయిందన్నదే యిందుకు నిదర్శనం. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలో కూడా, ఔట్‌సోర్సింగ్ ద్వారా పనిచేయించుకొంటూ, ఉద్యోగావకాశాలు మరో దేశానికి తరలిపోవటం వలన, అక్కడి కార్మికుల బేరసారాలాడే శక్తి తగ్గిపోయింది.

అమెరికాలో క్రూడ్ చమురు ధరలు రెట్టింపుకు పెరగటం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధ కారణంతో జి-7 దేశాలు ఆర్థిక ఆంక్షలు విధించటం వలన, ద్రవ్యోల్బణం పెరిగింది. ధరలు పెరిగిపోయాయి. ఉద్రిక్తతలు తగ్గించటానికి బదులు, యిటువంటి ఆంక్షలు విధించటం వలన ద్రవ్యోల్బణం, ధరలు పెరిగిపోతున్నాయి.

అమెరికా దేశ ఫెడరల్ బ్యాంకు వడ్డీరేట్లను పెంచటం వలన, ఆ దేశంలో కూడా ప్రైవేటు పెట్టుబడులు తరిగిపోయాయి. ఫలితంగా ఉద్యోగిత పెరుగుదల అవకాశాలూ తగ్గిపోయాయి.

ఏవిధంగా చూసినా ద్రవ్యోల్బణం పెరుగుదలకు, ధరల పెరుగుదలకూ, కార్మికులకు అధిక వేతనాలు యివ్వడం కానీ, వాడకపు సరుకులకు గిరాకీ పెరగటంగానీ ఎంత మాత్రమూ కాదని, కేవలం సామ్రాజ్యవాద అమెరికా, దాని మిత్ర పెట్టుబడిదారీ దేశాలూ అవలంబించిన విధానాలనీ స్పష్టమవుతోంది.

ప్రస్తుత దశలో, వాణిజ్య-వ్యాపార సంస్థలు, ఖర్చులు పెరిగాయన్న సాకుతో, చమురు ధరలను పెంచటమే, నేడు పెరిగిన ద్రవ్యోల్బణానికి, పెరుగుతున్న ధరలకూ కారణం. ఇదే అసలు వాస్తవం.

ప్రపంచ దేశాలకు చెందిన కరెన్సీలపై అమెరికా డాలర్ కరెన్సీ ఆధిపత్యం వుండటం వలన, అమెరికా దేశంలో వడ్డీరేట్ల పెంపకం యొక్క దుష్ప్రభావం, అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలపైనా పడింది. అందువలనే మన దేశంతో సహా అన్ని దేశాలలోనూ ద్రవ్యోల్బణం పెరుగుతూ, ధరలు పెరుగుతున్నాయి. అయితే యిందుకు బాధ్యత కార్మికుల అధిక వేతనాలుగా చూపిస్తూ, అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారు.

ప్రపంచ కార్మికవర్గం యీ సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ దేశాల అసంబద్ధ మోసపూరిత ప్రచారాలను అర్ధంచేసుకొని, ప్రభావవంతంగా త్రిప్పికొట్టేందుకు ఉపక్రమించాలి.

**(రోహిత్ అజాద్, ఇంద్రానిల్ చౌదరిల వ్యాసం ఆధారంగా)**


*Read !* *Subscribe!!*




*Organ of Central Committee of CPI (ML)*

*Read !* *Subscribe!!*




*Hindi Organ of Central Committee of CPI (ML)*

## సూరత్ నగరం

# వలస కార్మికుల శ్రమశక్తి అమానవీయ దోపిడీ

**బిజెపి** పాలకులు, గుజరాత్‌లో జరిగిన అభివృద్ధికి నమూనాగా మెరిసిపోతున్న సూరత్ నగరాన్ని చూపిస్తూ వుంటారు. ఈ నగర అభివృద్ధికి నిజమైన కారకులైన కార్మికులు మాత్రం దుర్భర జీవన, పని పరిస్థితుల బారినపడి జీవితాలను ఈడ్చుతున్నారనే వాస్తవం ప్రపంచానికి తెలియదు. మీడియా సహితం యీ అభాగ్య కార్మికుల జీవితాలను గురించి పట్టించుకోదు. తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవ్వరో తెలియనట్లు, సూరత్‌నగర వైభవానికి తమ శ్రమశక్తిని వెచ్చించి, హరించుకుపోతున్న అంతర్ రాష్ట్ర వలస కార్మికుల జీవిత వివరాలు మాత్రం మరుగున పడిపోతున్నాయి.

సూరత్‌నగరం బట్టలనేత పరిశ్రమకు, రంగులు వేయటం (డైయింగ్) – ప్రింటింగ్ పరిశ్రమకు, వజ్రాల పాలిషింగ్ పరిశ్రమకు, ఎంబ్రాయిడరీ పరిశ్రమకు పేరుగాంచిన నగరం. ఈ పరిశ్రమలన్నీ తమ కార్యకలాపాలను చిన్న, మధ్యతరగతి యూనిట్లలో నిర్వహిస్తాయి. ఈ నాల్గు పరిశ్రమలలోనూ కార్మికులు కాంట్రాక్టు, కేజువల్ పద్ధతిన నియమించబడి వుంటారు. ఈ పరిశ్రమలలోనేకాక నిర్మాణరంగంలో కూడా కార్మికులు పనిచేస్తారు. ఈ కార్మికులందరూ అసంఘటితరంగంలో పనిచేసే కార్మికులే.

ఈ రంగాలేకాక చిన్న అంగళ్ళలోనూ, హోటళ్ళు – రెస్టారెంట్లలోనూ, గ్యారేజిల్లోనూ, వర్కుషాపుల్లోనూ, స్వయం జీవనోపాధి కార్యకలాపాలలోనూ, సెక్యూరిటీగార్డులుగానూ, లిఫ్టు ఆపరేటర్లుగానూ, ఇళ్ళలోని పరిచారికలుగానూ, తమ యింటి వద్దే పనిచేసే కార్మికులుగానూ, చెత్త ఏరుకొనేవారుగానూ అనేకమంది అసంఘటితరంగ కార్మికులుగా పనిచేస్తూనే వుంటారు.

పైన పేర్కొన్న పరిశ్రమలల్లో ఎక్కువమేరకు, అంటే 80%కి పైగా యితర రాష్ట్రాల నుండి వలస వచ్చిన కార్మికులే పనిచేస్తూ వుంటారు. పరిశ్రమల యజమానులు వీరి పేర్లను ఎక్కడా నమోదు చేయరు. ఆరకంగా వారు కార్మికచట్టాలను, అవి నిర్దేశించిన కార్మికులకు కల్పించాల్సిన కనీస సదుపాయాలను అమలుచేయకుండా తప్పించు కొంటారు. అంతేకాదు ప్రభుత్వ పరిపాలనా సంస్థలూ వీరి పేర్లను ఎక్కడా నమోదుచేసుకోరు. వీరు స్థానిక ఓటర్లు కాదు గనుక ఓటర్ల జాబితాలోనూ వీరి పేరు నమోదుచేసుకోరు. అందువలన వీరు ఆ నగర పౌరులూ కాదు. ఇలా పనిచేసే వలస కార్మికుల సంఖ్య సూరత్‌లో సుమారు 24 లక్షలమంది.

బట్టలనేత రంగంలో ఒరిస్సా, మహారాష్ట్రల నుండి వలస వచ్చిన కార్మికులు పనిచేస్తారు. డైయింగ్ – ప్రింటింగ్ (బట్టల) రంగంలో ఉత్తరప్రదేశ్ నుండీ, బీహార్ నుండీ వచ్చిన కార్మికులు పనిచేస్తారు. వీరిలో అధికభాగం ముస్లిం కార్మికులు. వజ్రాల పరిశ్రమలో సౌరాష్ట్ర ప్రాంతం నుండి వచ్చిన పతిదార్ కులానికి చెందిన కార్మికులు పనిచేస్తారు. ఎంబ్రాయిడరీ రంగంలో ఉత్తరప్రదేశ్ నుండి వచ్చిన వలస కార్మికులు పనిచేస్తారు. నిర్మాణరంగంలో, బరువైన – నైపుణ్యం లేని పనులను వలస వచ్చిన గిరిజన కార్మికులు చేస్తారు. ఈ రంగంలో ప్లంబింగ్ పనులను పశ్చిమబెంగాల్ నుండి వచ్చిన ముస్లిం కార్మికులు చేస్తారు. పెయింటింగ్ పనులను ఉత్తరప్రదేశ్ నుండి వలస వచ్చిన కార్మికులు చేస్తారు. వీరిలో అత్యధిక భాగం ముస్లిం కార్మికులే. జార్ఖండ్ నుంచి వలస వచ్చిన కార్మికులు ప్రధానంగా ప్రభుత్వం చేపట్టిన రోడ్ల నిర్మాణం, ఫ్లైఓవర్ల నిర్మాణం తదితర నిర్మాణపు పనుల్లో పనిచేస్తారు.

సూరత్ నగరంలో, దాని పరిసర ప్రాంతాల్లో వందల వేలమంది వలస కార్మికులు పనిచేస్తూ, జీవనోపాధిని గడిస్తారు. ఒక్క వజ్రాల రంగంలో పనిచేసే వలస కార్మికులు తప్ప, మిగిలిన అన్ని రంగాలలోనూ, అన్ని పనుల్లోనూ పనిచేసే వలస కార్మికులు సూరత్ నగరంలోని మురికివాడ ప్రాంతాల్లోనే నివశిస్తారు. సూరత్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రకారం 334 మురికివాడ ప్రాంతాల్లో నివసిస్తున్నారు.

ఈ వలస కార్మికులందరిలోనూ, నిర్మాణ రంగంలోని వలస కార్మికులు అత్యంత దయనీయమైన, దుర్మార్గమైన జీవన పరిస్థితుల్లో దుర్భరమైన జీవితాలను గడుపుతున్నారు. ఈ నిర్మాణరంగంలో పనిచేసే 60% మంది వలస కార్మికులు బహిరంగ ప్రదేశాల్లోనే నివశిస్తున్నారు.

ఎక్కువమంది నిర్మాణరంగ గిరిజన వలస కార్మికులు, తమ భార్యాబిడ్డలతో తరలివచ్చి, బహిరంగ ప్రదేశాల్లోనూ, ఫుట్‌పాత్‌లమీదా, ఫ్లైఓవర్ల క్రిందా తాము పనిచేసే పని ప్రదేశాల దగ్గర్లో నివశిస్తున్నారు. అందువలన వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. పోలీసులు, సూరత్ మున్సిపాలిటీ ఉద్యోగులూ వీరితో దురుసుగా ప్రవర్తిస్తూ వుంటారు. వీరిని నిరంతరం వాళ్ళు నివసించేచోట్ల నుండి తరిమేస్తూ వుంటారు. అందువలన వీరు నిరంతరం ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి మారుతూ, తిరుగుతూనే జీవిస్తున్నారు. అటు పోలీసు, మున్సిపల్ అధికారులేకాక, స్థానిక రౌడీలూ తదితరులూ వీరిని వేధిస్తూనే వుంటారు.

వీరు ఏరోజుకు ఆరోజు కూలిపని వెతుక్కోవలసి వుండటం వలన వీరు వివిధ ప్రాంతాలలో ప్రతీ ఉదయం ప్రోగుపడుతూ వుంటారు. ఈ ప్రాంతాలు 'నాకా'లు లేదా 'కూలీల మార్కెట్లు' అని పిలుస్తారు. సూరత్ నగరంలో అటువంటి నాకాలు 23 వున్నాయి.

బంద్‌ఖమ్ మజ్దూర్ సంఘటన, ప్రయాస్, అజీవకా లాంటి ప్రభుత్వేతర సంస్థల నిరంతర కృషి వలన, ప్రభుత్వం యీ వలస కూలీల కోసం 'రెన్–బాసెరా' అని పిలవబడే రాత్రిపూట షెల్టర్లను ఏర్పాటుచేసింది. బిల్డర్ల నుండి వసూలుచేసే ప్రత్యేక సెస్సుతో యీ 'రెన్–బాసెరా'లను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. అయితే ప్రభుత్వం ఏర్పాటు చేసిన 27 షెల్టర్లలో, కేవలం ఒక్క షెల్టర్ మాత్రమే (దీన్ని స్వచ్ఛంద సంస్థ ప్రయాస్ నిర్వహిస్తోంది) పనిచేస్తోంది. మిగిలిన 26 షెల్టర్లూ పనిచేయటంలేదు.

వీరి శ్రమశక్తిని దోచుకొంటూ అభివృద్ధిని పొందుతున్న ప్రభుత్వం, వీరిని పట్టించుకోదు. తమ ఆశ్రయానికి (నివశించటానికి) కావల్సిన ఏర్పాట్లు యీ వలస కార్మికులే స్వయంగా చూసుకోవాలి. తమ భద్రతను తామే ఏర్పాటు చేసుకోవాలి.

నిజానికి నిర్మాణరంగ కార్మికుల సంక్షేమ బోర్డు, వీరికి ఆవాస సౌకర్యాలను కల్పించాలి! 3,100 కోట్ల రూపాయలను యీ నిర్మాణరంగ కార్మికుల సంక్షేమం కోసం బిల్డర్ల నుండి వసూలు చేసిన నిర్మాణరంగ సంక్షేమ బోర్డు, వీరి ఆవాసాల ఏర్పాటు గురించి పట్టించుకోదు. నిర్మాణరంగ కార్మికుల సంక్షేమ చట్టాన్ని అమలుచేయదు. చట్టప్రకారం వివిధ బడా పరిశ్రమలు తమ కార్మికులకు తామే గృహ వసతి కల్పించాలి! కానీ వారు అలా చేయరు. నిర్మాణరంగ కార్మికుల సంక్షేమ చట్టం ప్రకారం వసూలుచేసిన మొత్తాల్లో, భారీ ఎత్తున మొత్తాలను ప్రభుత్వం, ఆ బడా పారిశ్రామిక యాజమాన్యాలు కార్మికుల కోసం నిర్మించే క్వార్టర్సుకు యిస్తుంది. ఆ రకంగా నిర్మాణరంగ కార్మికుల సంక్షేమం కోసం వసూలు చేయబడ్డ మొత్తాలు, బడా పరిశ్రమ యజమానులకు ధారాదత్తం చేయబడుతుంది. →

# కేరళ | అదానీ గ్రూపు భారీ ఓడరేవు నిర్మాణం – మత్స్యకారుల ఆందోళన

**కేరళ** రాజధాని తిరువనంతపూర్‌కు 20 కిలోమీటర్ల దూరంలో విళింజం ప్రాంతంలో అరేబియా మహాసముద్రతీరంలో అదానీ గ్రూపు సంస్థ అంతర్జాతీయ ఓడరేవు నిర్మాణాన్ని తలపెట్టింది. 7290 కోట్ల రూ॥ల భారీ అంచనాతో నిర్మించ తలపెట్టిన ఈ ట్రాన్స్-షిప్‌మెంట్ ప్రాజెక్టు ప్రభావంతో పర్యావరణం పూర్తిగా దెబ్బతింటుందని, అరుదైన మత్స్యసంపద కనుమరుగు అవుతుందని, జలచరాల ఉనికికే ప్రమాదమేర్పడుతుందని ఆ ప్రాంత మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

ఈ ఓడరేవు ప్రతిపాదన ముందుకొచ్చిన నాటినుండీ 100 రోజులకుపైగా ఈ ప్రాంత మత్స్యకారులు, స్థానిక చర్చి ఫాదర్‌లు, క్రిస్టియన్ మతపెద్దలు ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నారు. కేంద్రంలోని బిజెపి, స్థానిక వామపక్ష ప్రభుత్వాల అండదండలతో అదానీ కంపెనీ ఓడరేవు ప్రాజెక్టు నిర్మాణ పనులు సాగిస్తూండటం, తమ నిరసనలను ఖాతరు చేయకపోవడంతో వారంతా తమ ఆందోళనలను తీవ్రం చేశారు.

కొద్దికాలం క్రితం కేరళ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలతో నిలచిపోయిన ఓడరేవు నిర్మాణపనులు, అదానీ యాజమాన్యానికి అనుకూలంగా హైకోర్టు తీర్పునివ్వడంతో తిరిగి ప్రారంభమయ్యాయి. 2022 నవంబర్ 1వ తేదీన మత్స్యకారుల ఉద్యమాన్ని నిరసిస్తూ, భారీ పోర్టు నిర్మాణాన్ని సమర్థిస్తూ పాలక సిపిఎం, బిజెపి నాయకుల ఆధ్వర్యంలో ప్రదర్శన జరగడం విశేషం!

కాగా, నవంబర్ 26న ఓడరేవు నిర్మాణ ప్రాంతాన్ని పరిసర తీరప్రాంత గ్రామాల నుండి తరలివచ్చిన వేలాదిమంది మత్స్యకారులు చుట్టుముట్టారు. నిర్మాణ సామాగ్రితోనున్న 50 లారీలను అడ్డుకొని, నిర్మాణ సామాగ్రిని దించకుండా నిలువరించారు. దీనితో యాజమాన్య మద్దతుదార్లు, ఓడరేవుకు సమర్ధనగా రంగంలోకి దిగి ఘర్షణకు తలపడ్డారు. కొన్ని గంటలపాటు సాగిన ఈ దాడి యుద్ధ వాతావరణాన్ని తలపించింది. ఈ ఘటనలో పోలీసులతో సహా అనేకమంది మత్స్యకారులు గాయపడ్డారు. శాంతిభద్రతలను కాపాడే పోలీసు అధికారుల పక్షపాత వైఖరితో మరింత ఆగ్రహించిన ఆందోళనకారులు పోలీసులపై తమ ఆగ్రహాన్ని వెళ్ళగక్కారు; అనేకమంది పోలీసులను తరిమారు; కొన్ని పోలీస్ జీపులను దగ్ధం చేశారు. వెయ్యిమంది పోలీసులు మోహరించినా ఆందోళనను అణచివేయటం కష్టమైందంటేనే పరిస్థితి తీవ్రత అర్ధమౌతుంది. కాల్పులు జరిపితే మరింత భ్రష్టుపడతామనే అంచనాతో పాలక ప్రభుత్వాలు లాఠీఛార్జీ వరకే పరిమితమయ్యారు. ఏమైనా ఈ ఘటన తదనంతరం హత్యాయత్నం, చొరబాటు, విధ్వంసం, దాడులు, నేరపూరిత కుట్రతో సహ పలు అభియోగాలు మోపి 3 వేలమంది మత్స్యకారులతోసహా వారికి మద్దతుగా నిల్చిన అనేకమంది చర్చి ఫాదర్‌లపై పోలీసులు కేసులు బనాయించారు.

విళింజం వద్ద భారీ ఓడరేవు నిర్మాణంలో భాగంగా అశాస్త్రీయంగా నిర్మించే గ్రోయన్లు, కృత్రిమ సముద్రగోడలు, కోస్తాతీరం కోతకు గురికావటానికి ఒక కారణమని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఓడరేవు నిర్మాణాన్ని ఆపివేసి, కోస్తా తీరంపై ఈ అంతర్జాతీయ స్థాయి ఓడరేవు ప్రభావం గురించి అధ్యయనం చేయించాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు. వీరి న్యాయమైన డిమాండ్లను పెడచెవిన బెట్టి, బలప్రయోగంతో ఓడరేవు నిర్మాణానికి పూనుకోవటంతో తమ దుస్థితిని అధికారులకు తెలియజెప్పేందుకు తమకు మరోమార్గం కన్పించ లేదని వందరోజులకు పైగా శాంతియుతంగా ఆందోళన చేస్తున్న మత్స్యకారులు తమ ఆవేదన వెలిబుచ్చారు. తీరం లేకుంటే జీవనం లేదని, తామంతా జీవనోపాధిని శాశ్వతంగా కోల్పోతామని వారు చెబుతున్నారు. వారి ఆందోళనలోని వాస్తవికతను గుర్తించి, వారికి శాస్త్రీయ నిర్ధారణలతో నమ్మకం కలిగించేందుకు అదానీ గ్రూపు యాజమాన్యముగానీ, పాలక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కానీ పూనుకోలేదు. ఉద్యమాన్ని అణచివేసి ఓడరేవు నిర్మాణం చేయగలుగుతామని భావిస్తూ వారు ముందుకు వెళుతున్నారు. ✸

---

➡ నిర్మాణరంగ కార్మిక సంక్షేమ చట్టం – 1996 ప్రకారం నిర్మాణరంగ కార్మికులకు యజమానులే షెల్టర్లను ఏర్పాటుచేయాలి. అలా చేయకపోతే యజమానులను చట్టపరంగా శిక్షించాలి. వారిపై కేసులు పెట్టాలి. కానీ సంబంధిత పాలనాధికార సంస్థలు కేసులు యజమానులపై సక్రమంగానైనా పెట్టవు. లేదా ఆ కేసులు ఏళ్ళూ, పూళ్ళూ అయినా పరిష్కరింపబడవు. ఉదాహరణకు సూరత్ జిల్లాలో 2007 నుండి 2009 వరకూ కేవలం 118 కేసులే నమోదు చేయబడ్డాయి. 2010 నుండి 2018 దాకా అటువంటి కేసులే నమోదు చేయబడలేదు. నమోదుచేయబడ్డ 50 కేసులు పరిష్కరింపబడ్డాయి. అంటే చట్ట ఉల్లంఘనకు ఆ యజమానులకు, ఫైన్ (అపరాధ రుసుం) విధించారు. ఇంతకీ ఆ 50 కేసులలో మొత్తంగా విధించిన అపరాధ రుసుం (ఫైన్) ఎంతయ్యా అంటే కేవలం 22,050 రూపాయలు. అంటే ఒకో యజమానికి కేవలం సగటున 441 రూపాయలు ఫైన్ విధించారన్నమాట! చట్టం అమలుపరచబడుతున్న వింతైన తీరు యిది! ఇది క్రూర పరిహాసం తప్ప మరేమవుతుంది?

ఈ రకంగా వలస కార్మికుల జీవితాలతో అటు యజమాన్యాలు యిటు ప్రభుత్వాలూ ఆడుకొంటూ, ఆ కార్మికుల శ్రమశక్తిని అమానవీయంగా, దారుణంగా దోపిడీ చేసుకొంటూ "అభివృద్ధిని" సాధిస్తున్నారు. ఆ అభివృద్ధిని గురించి పాలకులు గొప్పలు చెప్పుకొంటున్నారు.

దేశం అంతటా యించుమించు యిదేవిధంగా అంతర్‌రాష్ట్ర కార్మికుల శ్రమశక్తి, నిరాఘాటంగా, ప్రభుత్వ అనుమతి – మద్దతులతోనే నిర్దాక్షిణ్యంగా దోపిడీ చేయబడుతోంది.

కానీ, అంతర్జాతీయ వేదికలైన అంతర్జాతీయ కార్మికసంఘం లాంటి సమావేశంలో, ప్రభుత్వ ప్రతినిధులు, తమ ప్రభుత్వం వలస కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకొంటోందనీ, ప్రత్యేకించి కోవిడ్–19 మహమ్మారి కాలంలో, యీ వలస కార్మికులకు రేషన్ అందించి, ఆదరించిందని నిస్సిగ్గుగా ప్రకటిస్తున్నారు. మేడిపండుగా భారతదేశం ఖ్యాతిని యినుమడింప చేస్తున్నారు.

దేశంలోని కార్మికవర్గమే, కార్మికవర్గ సంస్థలే యీ వలస కార్మికుల దుస్థితిని పట్టించుకొని, వారి జీవన పనిపరిస్థితుల మెరుగు కోసం అకుంఠిత దీక్షతో కృషి చేయాల్సిన అవసరం ఎంతగానో వుంది. ✸

# బీహార్

# పట్టాదారులకే భూమి కోసం AIKMKS ఆధ్వర్యంలో నిరుపేదల ఆందోళనకారుల డిమాండ్

**గత** కొన్ని నెలలుగా, బీహార్ రాష్ట్రం - రోహతాస్‌లోనూ, మరి నాలుగు జిల్లాలలోనూ పేదలపై సాగుతున్న దాడులకు వ్యతిరేకంగా AIKMKS వివిధరకాల ఆందోళనలు నిర్వహిస్తోంది.

2022 నవంబర్ 12న ఏఐకెఎమ్‌కెఎస్ రోహతాస్ జిల్లాకమిటీ ఆధ్వర్యంలో వందలాదిమంది ప్రజానీకం ప్రదర్శన, ఆపై 5 గంటలపాటు రాస్తారోకో జరిపిన అనంతరం బహిరంగసభ నిర్వహించింది. నితీష్‌కుమార్ ప్రభుత్వ నియంతృత్వ విధానాలను ఇంకెంతమాత్రం ప్రజానీకం సహించబోరని హెచ్చరించటంతో పాటు, తమ భూసమస్యను పరిష్కరించాలని ఈ సందర్భంగా ఆందోళనలో పాల్గొన్న ప్రజానీకం డిమాండ్ చేశారు.

"ప్రభుత్వ అధికారులారా, మా పట్టా భూములను కబ్జా చేస్తున్న భూ బకాసురులకు మీరందిస్తున్న తోడ్పాటును ఇక మేమెంతమాత్రము సహించము; ఈ గూండాల పట్ల మీ ఉదార వైఖరిని మేము అంగీకరించబోము". "వారికి మద్దతునిస్తూ వారితో కుమ్మక్కు అయిన పోలీసులు నశించాలి". "న్యాయవ్యవస్థను అమ్మకానికి బెట్టి సొమ్ము చేసుకుంటున్న ఉన్నతాధికారవర్గం.... సిగ్గుసిగ్గు" అనేవి ఆందోళన సందర్భంగా మార్మోగిన నినాదాలలో కొన్ని మాత్రమే.

భూమిలేని నిరుపేద కుటుంబాలన్నింటికీ 6 సెంట్ల నివాసభూమిని ఇవ్వాలని, ఆక్రమణల పేరుతో భూముల నుండి పేదవారిని ఖాళీ చేయించటాన్ని ఆపివేయాలని, నిరుపేదలకు విద్యుత్ బిల్లులను రద్దుచేయాలనే డిమాండ్లను ఈ భారీ ప్రదర్శన, సభ ద్వారా ప్రభుత్వం ముందుంచారు.

రోహతాస్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగిన ఈ సభకు ఏఐకెఎమ్‌కెఎస్ జిల్లా అధ్యక్షులు నథూనిరామ్ అధ్యక్షత వహించారు. సంఘ నాయకులు కామ్రేడ్ అశోక్ ఖైతా, జిల్లా కార్యదర్శి కా॥ సురేంద్ర పాశ్వాన్ తదితరులు ఈ సభలో ప్రసంగించారు.

అమీర్‌దాస్ నివేదికను ఇప్పటికీ దాచి వుంచారని, దాని వెంటనే బహిరంగపరచాలని, డి. బందోపాధ్యాయ కమీషన్ నివేదిక ఈనాటికి కూడా అమలుకు నోచుకోలేదని వక్తలు తమ ప్రసంగాల్లో పేర్కొన్నారు. బీహార్‌లో నితీష్‌కుమార్ ప్రభుత్వంలో ఉన్నతాధికారుల నియంతృత్వచర్యల ఫలితంగా ప్రజా జీవితాలు విధ్వంసమవుతున్నాయని వారు అన్నారు. ప్రజల ప్రయోజనం కొరకు ఏ కార్యక్రమమూ చేపట్టం జరగటంలేదని, వివిధ ప్రభుత్వ శాఖలలో లంచాల విధానము సృష్టించ బడిందని వారు విమర్శించారు.

బలహీనవర్గాల భూములను మాఫియాలు కబ్జా చేస్తున్నారని, పట్టాదారుల భూములను గూండాలు బలప్రయోగంతో ఆక్రమించు కుంటున్నారని, ఇవన్నీ పోలీసుల సహాయ సహకారాలతో సజావుగా సాగిపోతున్నాయని వివరించారు. పేద ప్రజలకు ఎక్కడా భూములను కేటాయించటం జరగలేదని, కానీ రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటుతో నకిలీ దస్తావేజులను పుట్టించుకొన్న మండల స్థాయిలోని అధికారులంతా 'భూదాన్' భూములను భారీస్థాయిలో స్వాధీనం చేసుకుంటున్నారని వివరించారు. ఈ ఆక్రమణదారులకు 'జమా-బందీ' రసీదులు కూడా లేవన్నారు. 1970 సర్వే 'ఖటియాన్' ప్రకారం నమోదుచేసిన ప్రతి గ్రామంలోని భూముల వివరాలన్నీ అందుబాటులో వున్నప్పటికీ, భూమాఫియాలు, భూకబ్జాదారులైన ఉన్నతాధికారులు భూదాన్ భూములను తమ పేరిట మార్పించుకోవటమే గాకుండా, ఆ భూములనే ప్రస్తుతం భూమిలేని నిరుపేదలకు అమ్ముతున్నారన్నారు.

కన్సాలిడేషన్ శాఖ, భూదాన్ శాఖలు సంవత్సరాల తరబడి ఈ క్రీడను సాగనిస్తూ పేదల హక్కులను కాలరాస్తున్నాయని వక్తలు పేర్కొన్నారు. భూములు ప్రజల హస్తగతమయ్యేంతదాకా పోరాటం కొనసాగి తీరుతుందని వక్తలు ప్రకటించారు. ✱

---

(23వ పేజీ నుండి)

రైతుల ఖాతాల్లో నగదు జమచేస్తున్నామని అంటున్నారని, కానీ రైతుల ఆత్మహత్యలను ఆపలేకపోతున్నారని వివరించారు. నరేంద్రమోడీ మూడు వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చాడు. గిట్టుబాటు ధరల నిర్ణయాన్ని కంపెనీలకు అప్పచెప్పేసాడు. వ్యవసాయ మార్కెట్ కమిటీలను రద్దుచేశాడు. ఢిల్లీ సరిహద్దుల్లో సంవత్సర కాలంపైగా రైతులు ఈ చట్టాలను రద్దుచేయాలని ఆందోళన చేశారు. చివరికి ఈ చట్టాలను వెనక్కి తీసుకుంటున్నానన్నాడు. కానీ అప్పటికే ఈ చట్టాలు దేశంలోని అనేక రాష్ట్రాల్లో వివిధ రూపాల్లో అమల్లోనే వున్నాయనే సంగతిని రైతులు అర్థం చేసుకోవాలని కోరారు.

చైతన్యం కలిగిన రైతులు తమ భూములను కాపాడుకోవడానికి, పాలకుల విధానాలపై కమ్యూనిస్టు పార్టీ ఇచ్చే చైతన్యంతో ముందుకు వచ్చి సంఘటితంగా పోరాడితే తప్ప న్యాయం జరగదని, ఇటువంటి పోరాటాలలో ముందుకు సాగటమే అమరులందరికీ మనమిచ్చే నివాళి" అని ముగించారు.

తర్వాత **స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర అధ్యక్షులు కా॥ చల్లపల్లి విజయ, నందిగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ వాసిరెడ్డి సాంబశివరావు, స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కోశాధికారి ఆవుదొడ్డి నాగమల్లేశ్వరి** తదితరులు మాట్లాడారు. ✱





సిపిఐ(ఎం-ఎల్) ప్రచురణ

కాపీలకు :

**మైత్రీబుక్‌హౌస్,**

**జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్,**

**విజయవాడ-2**



# పీడిత ప్రజా ఉద్యమ నాయకులు
# కామ్రేడ్ అంగడి చెన్నయ్య, కొప్పుల కోటయ్యల వర్ధంతిసభలు




వర్ధంతిసభలో ప్రసంగిస్తున్న కా॥ గుర్రం విజయకుమార్

**అమరులు** కామ్రేడ్స్ అంగడి చెన్నయ్య, కొప్పుల కోటయ్యల వర్ధంతిసభ 2022 డిసెంబర్ 1న గుంటూరులోని కామ్రేడ్ అంగడి చెన్నయ్య స్థూపం వద్ద జరిగింది. ఈ సభకు **సి.పి.ఐ.(ఎం-ఎల్) జిల్లా నాయకులు కామ్రేడ్ ఉల్లిగడ్డల నాగేశ్వరరావు** అధ్యక్షత వహించారు. సభలో ముందుగా **పార్టీ కేంద్రకమిటి సభ్యులు కామ్రేడ్ గుర్రం విజయకుమార్** మాట్లాడుతూ, అమరులకు జోహార్లు అర్పిస్తున్నామంటే - వారి కర్తవ్యాలను గుర్తుచేసుకుంటూ, వారి కార్యకలాపాలను కొనసాగిస్తూ; వారి ఆశయాలను నెరవేరుస్తామని నిర్ణయం తీసుకోవడమేనన్నారు.

“ధరలు పెరుగుతూ జనం ఉద్రిక్తతలకు లోనవుతున్నారు. కుబేరులు పెరుగుతున్నారు. కోవిడ్ కాలం నుండి ఎగుమతులు తరుగుతూ దిగుమతులు పెరుగుతూ రూపాయి విలువ పడిపోతున్నది. ఆత్మనిర్భర ఘనత, 75 సం॥రాల స్వాతంత్ర్య పరిస్థితి ఇది. మన ప్రజల జీవన ప్రమాణాలు పడిపోతున్నాయి. 260 కోట్లమందికి తిండి పెట్టగల భూమి ఉంది. కానీ 40 కోట్లమంది అర్ధాకలితో ఉంటున్నారు.

పారిశ్రామిక విప్లవాల కాలంలో దున్నేవానికే భూమి కార్యక్రమం అనేక దేశాల్లో సాగింది. ‘దున్నేవానికే భూమి’ దక్కించుకునేందుకు విప్లవోద్యమం నిర్మించుకోవాలి. కార్మిక కర్షక రాజ్యం ఏర్పరచుకోవాలి. అది కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన సాధించుకోవాలి. నక్సల్బరి, శ్రీకాకుళ ఉద్యమాలు, పోరాటాలు జరిగినా భూపంపిణీ కర్తవ్యం పూర్తికాలేదు. ప్రజల్ని నిరుద్యోగ భూతం ఆవరించింది. వ్యవసాయ సంస్కరణలు, పారిశ్రామిక ఏర్పాట్లు జరగలేదు. పాలకుల మధ్య లడాయి అభివృద్ధి జరగలేదని తెలియజేస్తున్నది.

ఉద్యోగం, ఉపాధి కల్పించకుండా మత, కుల ఉద్రేకాన్ని రెచ్చగొడుతున్నారు. పాలకులు ఫాసిస్టు తరహా పద్ధతుల్ని అనుసరిస్తున్నారు. వాటిని ఎదుర్కోవాలి. అమర కామ్రేడ్స్ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను నిర్మించడానికి ముందుకు సాగడమే వారికి అర్పించే నిజమైన నివాళి’ అని ఆయన తన ప్రసంగం ముగించారు.

**సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు కామ్రేడ్ ఎస్. ఝాన్సీ** మాట్లాడుతూ కామ్రేడ్స్ మరణించి ఎన్నో సంవత్సరాలు గడిచినా, మన మనస్సుల్లో జీవించే వున్నారన్నారు. “చెన్నయ్యన్న ఆనాడు తన పార్టీని మన పార్టీతో విలీనం చేసాడు. ఆ కామ్రేడ్‌ను హత్యచేయటం వలన ఎంత నష్టం జరిగిందో చెప్పాం; ప్రచారం చేసాం. ఆ కామ్రేడ్ ఆశయాన్ని ముందుకు తీసుకుపోతున్నాం. మహత్తర శ్రీకాకుళ పోరాటానికి ఈ జిల్లా నుంచి వెళ్ళారు. పీడిత ప్రజా ఉద్యమాలలో శ్రామిక శ్రేయోరాజ్యం కోసం మరణించారు. ఆ ఆశయాలకు వారసులం మనం.

కోరన్న, మంగన్నల 52వ వర్ధంతిసభ ఈ మధ్యనే జరిగింది. ఆ కామ్రేడ్స్‌ను చాటుమాటుగా కాల్చి చంపారు. ఇన్నేళ్ళ తర్వాత ఆ కామ్రేడ్స్‌ను, అమరులను స్మరించుకుంటున్నామంటే మరో అడుగు ముందుకు వెళ్ళడానికే. ఈనాడు అధికారంలో వున్న పార్టీలన్నీ దోపిడీవర్గ అనుకూల పార్టీలే. అందరికీ ఆరోగ్యం, విద్య, వసతి సౌకర్యాలు ఉన్నాయా? ఆత్మగౌరవంతో బతకగలుగుతున్నారా? నిరుద్యోగ సమస్య ఎందుకు నానాటికీ తీవ్ర మౌతుంది?! పబ్లిక్ సెక్టార్ ఎందుకు మూతపడుతోంది? ఈ సమస్యలకు మూలం ఏమిటనేది ఏ పాలక పార్టీ చెప్పదు; మాట్లాడదు. జి.యస్.టి., పెద్దనోట్ల రద్దు, మూడు నల్లచట్టాలు లాంటివాటితో ప్రజల్ని మరింత దోపిడీచేస్తూ ప్రజల శక్తి సామర్థ్యాలను హరించివేస్తున్నారు. ప్రజలను చైతన్యపరుస్తూ విప్లవోద్యమానికి సంసిద్ధం చేయడమే ప్రధాన కర్తవ్యంగా మనమందరం ముందుకు సాగడమే అమరులకు అర్పించే నిజమైన నివాళి అని కామ్రేడ్ ఝాన్సీ పేర్కొన్నారు.

**సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు కామ్రేడ్ డి.వి.యస్. స్వామి, సిపిఐ(ఎం-ఎల్) నాయకులు కామ్రేడ్ యం.యస్. నాగరాజు,** కామ్రేడ్ అంగడి చెన్నయ్య, కొప్పుల కోటయ్యల కృషిని త్యాగాన్ని వివరించారు.

## నందిగామ, 3-12-22 :

విప్లవ కమ్యూనిస్టు నాయకుడు, రైతుకూలీ ఉద్యమనేత, అమరుడు కామ్రేడ్ కొప్పుల కోటయ్య 5వ వర్ధంతిసభ ఎన్టీఆర్ జిల్లా నందిగామలో 3-12-22న ఓ.సి.క్లబ్‌లో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు కా॥ ఎం. రాంబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సభలో **రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ ఝాన్సీ** ముందుగా కా॥ కోటయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించి మాట్లాడుతూ - 80 సంవత్సరాల జీవితంలో 65 సంవత్సరాలు పీడిత ప్రజల విముక్తి కోసం కామ్రేడ్ కోటయ్య కృషిని సాగించారని, ప్రజా ఉద్యమాలలో పూర్తిగా దిగబడి పనిచేశారని గుర్తుచేశారు. ఉమ్మడి కమ్యూనిస్టుపార్టీ నుంచి ప్రారంభమైన ఆయన రాజకీయ జీవితం తుదిశ్వాస వరకు తరిమెల నాగిరెడ్డిగారి ప్రజా ఉద్యమ పంథాలో నిలిచారని అన్నారు. తరిమెల నాగిరెడ్డిగారి కుట్రకేసులో కా॥ కోటయ్య కూడా నిర్బంధాన్ని ఎదుర్కొన్నారని గుర్తుచేశారు.

ప్రస్తుత రాష్ట్ర పరిస్థితులను ప్రస్తావిస్తూ మోడీ, చంద్రబాబు, జగన్ వీరందరూ ఈనాడు రైతుల కోసమే ఎన్నో పథకాలు తెస్తున్నామని అంటున్నారని,

**(తరువాయి 22వ పేజీలో)**

**Janasakti (Communist Revolutionaries' Monthly) RNI No. 8315/63 VJ-077/2022-24**
No.of pages : 24 Date of publication : 1st & 2nd of Every Month Posting date : 5th or 6th of Every Month

# జీ.వో. నెం.1

# పాలకవర్గాల కుమ్ములాటలో భాగంగా అంతిమంగా ప్రజలపై పెంచుతున్న నిర్బంధం

**ఆంధ్రప్రదేశ్** రాష్ట్ర ప్రభుత్వం నూతన సంవత్సర కానుకగా కూడళ్ళలో సభలు, రోడ్‌షోలను నిషేదిస్తూ కాలంచెల్లిన 1861 నాటి ఖాకీ చట్టానికి మరిన్ని సవరణలు చేస్తూ జీ.వో. నెం.1ని విడుదల చేసింది. అధికార, ప్రతిపక్ష పార్టీల కుమ్ములాటలో భాగంగా ఇది పైకి కనిపించినా, అంతిమ పరిశీలనలో ప్రజల వాక్, సభా స్వాతంత్ర్యాలను, తమ అసమ్మతిని, నిరసనలను తెలియజెప్పే ప్రాథమిక హక్కులను కాలరాయటానికే గతకాలపు నిర్బంధ చట్టాల కోరలకు మరింత పదును పెడ్తున్నారనేది వాస్తవం.

రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు మరో ఏడాది పైగా కాలపరిమితి వున్నప్పటికీ, రాష్ట్రంలో అధికార, విపక్షాలు ఇప్పుడే ఎన్నికలు జరిగి పోతున్నట్లుగా మోహరిస్తున్నాయి. ప్రభుత్వాధికారంలోనున్న వైసిపి తన అధికార యంత్రాంగాన్ని, పోలీసు బలగాలను వినియోగించి రాష్ట్రం నలుమూలలా 'అధికారిక' పర్యటనలు, 'భారీ' సభలు జరుపుతోంది. కాగా, ప్రభుత్వాధికారానికి దూరమైన టిడిపి, చావు బ్రతుకుల సమస్యగా ఎంచి తన 'శక్తియుక్తుల' న్నింటినీ వెలికితీసి వైసిపి ప్రభుత్వాన్ని తూర్పార బడుతూ వివిధ జిల్లాలలో చంద్రబాబు నేతృత్వంలో సభలను, రోడ్‌షోలను నిర్వహిస్తోంది. కాగా, పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో 'వారాహి' వాహనంపై మరో రోడ్‌షోకు జనసేన సమాయత్తమౌతోంది.

తెలుగుదేశం పార్టీ డిసెంబర్ 28న కందుకూరు సెంటర్‌లో నిర్వహించిన బహిరంగసభ, రోడ్‌షో సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఊపిరాడక 8 మంది ప్రజలు మరణించగా, మరి అనేకమంది గాయాల పాలయ్యారు. ఇది జరిగిన 3 రోజులలోనే గుంటూరులో చంద్రబాబునాయుడు 'చంద్రన్న కానుకలు' కొందరికి అందజేసి వెనుదిరిగిన కొద్దిసేపటికే జరిగిన తొక్కిసలాటలో ముగ్గురు మహిళలు మరణించారు. డ్రోన్ షాట్‌ల ప్రచార వ్యామోహంతో ఇరుకు ప్రదేశాల్లో సభలు నిర్వహిస్తూ, తమ సభలకు వేలాదిగా ప్రజలు హాజరవుతున్నారని టిడిపి చౌకబారు ప్రచారం చేసుకుంటుందని వైసిపి ఆరోపిస్తుండగా, తమ సభలకు, రోడ్‌షోలకు తగిన సంఖ్యలో పోలీస్ సిబ్బందిని కేటాయించకుండా, రద్దీని నియంత్రించకుండా వదిలేయటవే ఈ తొక్కిసలాటలకు, మరణాలకు కారణమని టిడిపి ప్రత్యారోపణలు చేస్తున్నది. దురదృష్టకరమైన ఈ ఘటనలకు పాలక, విపక్షాలుగా ఎవరి బాధ్యతలేమిటో గుర్తించటానికి బదులు పరస్పర నిందారోపణలతో ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు. వీరెవరికీ ప్రజల వాస్తవిక జీవన సమస్యలతో నిమిత్తం లేదని స్పష్టమౌతోంది.

కోవిడ్ కాలం దాటిపోయిందనుకుంటూ వుండగానే మరోసారి ఆ పెనుభూతం ప్రపంచంపై విరుచుకుపడనుందని పాలక ప్రభుత్వాలు ప్రకటనలు చేసి చేతులు దులుపుకుంటున్నాయి. 2019-22 మధ్య కరోనా హెచ్చుతగ్గులతో కొనసాగిన కాలంలో సామాన్య ప్రజానీకం ఎదుర్కొన్న చేదు అనుభవాలు పునరావృతం కాకుండా వైద్య, ఆరోగ్యరంగాలపై దృష్టిసారించి పాలకులు చేపట్టిన చర్యలు శూన్యం.

మరోవైపు పంటలకు గిట్టుబాటు ధరలేక, తుఫాను నష్టాన్ని తట్టుకొని చేతికొచ్చిన ధాన్యాన్ని కొనే నాధుడు లేక, రైతాంగం తీవ్ర సమస్యల నెదుర్కొంటున్నారు. రైతుల, ముఖ్యంగా – కౌలు రైతుల ఆత్మహత్యలు సాగుతున్నాయి. పెరుగుతున్న ధరలతో, తరుగుతున్న పనిదినాలతో, చాలీచాలని కూలి డబ్బుతో రైతుకూలీలు, శ్రామిక ప్రజానీకం పడరాని పాట్లు పడుతున్నారు. పన్నుల భారాలు, విద్యుత్‌ఛార్జీలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల నిరంతరాయ పెరుగుదలతో, సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం అవస్థలు పడుతున్నారు. పారిశ్రామిక యాజమానుల ఉద్దేశపూరిత నిర్లక్ష్యం కారణంగా ఎందరో కార్మికుల ప్రాణాలు ప్రతిరోజూ అనంతవాయువుల్లో కలిసిపోతున్నాయి. మహిళలపై, బాలికలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు, 'పరువు' హత్యలు నిరాటంకంగా సాగిపోతున్నాయి. అడవి తల్లి నుండి ఆదివాసులను గెంటివేస్తూ విస్థాపనకు గురిచేస్తున్నారు. దళితులపై దమనకాండ, దాడుల వార్తలు ప్రతిరోజూ పత్రికల కెక్కుతూనే వున్నాయి

విస్తరిస్తున్న యుద్ధ సంస్కృతి, పెరుగుతోన్న ద్రవ్యోల్బణం, రెక్కలు మొలిచిన నిత్యావసరాల ధరలు, ప్రజల జీవితాలను వెక్కిరిస్తున్నాయి. తీవ్రమౌతున్న శ్రమదోపిడీ, తరుగుతున్న వేతనాలు, పెచ్చరిల్లుతున్న ఆధిపత్య హింసోన్మాదం, చెలరేగుతున్న కుల, మత, భాషా, ప్రాంతీయ విద్వేషాలు ప్రజానీకాన్ని సమస్యల సుడిగుండంలో పడదోస్తున్నాయి.

ఈ నేపథ్యంలో, వివిధ రంగాలకు చెందిన ప్రజానీకం వారి సమస్యలమీద వీధుల్లోకి రావటం పెరుగుతోంది. ముఖ్యంగా ఇటీవల ఉపాధ్యాయ, ఉద్యోగవర్గాలు వెల్లువలా కదలి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీనిని సహించలేని ప్రభుత్వం వారిపై అనేక నిర్బంధాల్ని ప్రయోగించింది; వేధించింది. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై నిరసనలను, అసమ్మతిని తెలియజేయటం, ప్రకటించడం 'పవిత్ర రాజ్యాంగం' కల్పించిన హక్కుగా పాలకులందరూ పేర్కొంటారు. అయితే తాము అధికారంలోకి వచ్చాక మాత్రం రాజ్యాంగ నిబంధనలను 'తూనా బొడ్డుంబాల్' అంటూ తీసిపడేస్తున్నారు. ప్రజలకు అసౌకర్యంపేరిట ఇప్పటికే హైదరాబాద్‌లో, విజయవాడలలో నిరసనలు తెలిపే, ధర్నాలు నిర్వహించే ప్రదేశాలను ప్రజలకు సంబంధంలేని ప్రాంతాలకు పరిమితం చేశారు. నిర్బంధ చట్టాల కోరలకు కొత్తగా పదును పెట్టడంలో కేంద్ర, రాష్ట్రాల పాలకులు పోటీపడ్తున్నారు.

గౌరవప్రదమైన జీవనం కోసం ప్రజలు పోరాటం సాగించటం కూడా ఒక ప్రజాస్వామిక హక్కు అనే చైతన్యాన్ని పెంపొందించటం నేటి తక్షణావసరంగా ముందుంది. దోపిడీవర్గాలు తమ అధికారాన్ని ఎక్కువకాలం నిలుపుకునేందుకు ఎన్ని జిమ్మిక్కులు చేస్తున్నప్పటికీ, సంక్షోభం తీవ్రత ప్రజలను ఆందోళనల్లోకి కదలిస్తోంది. సంఘటితమౌతోన్న ప్రజలపై, ప్రజాఉద్యమాలపై, ఉద్యమ నాయకులపై సాగుతున్న అన్ని విధాలైన నిర్బంధాన్ని, నిర్బంధ చర్యలను, నిర్బంధ చట్టాలను వ్యతిరేకిస్తూ ప్రజాస్వామిక ఉద్యమానికి ప్రజాతంత్రవాదులు, మేధావులు పూనిక వహించాలి. ✶

Printed, Published and Owned by S. Seshamma
32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
Printed at SVR Offset Printers & Binders, D.No. 24-29-128B, Garimallavari Street, Gulabithota, Vijayawada-3
Editor : S. Seshamma, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010